సోమవారం
2•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 157
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




**మహిళా ఉద్యోగులకు..**



### రాత్రి 8 గంటల్లోపు డ్యూటీ దిగేలా ఏర్పాట్లు

- ప్రతి డిపోలో 20 రోజుల్లో ప్రత్యేక టాయిలెట్లు, డ్రెస్ చేంజ్‌రూమ్స్, లంచ్‌రూమ్స్
- ప్రసూతి సెలవులతోపాటు, మూడునెలలపాటు చైల్డ్‌కేర్ లీవ్
- ఖాకీ డ్రెస్ నిబంధన తొలగిస్తాం. వారికి ఇష్టమైన రంగులో యూనిఫాం
- పురుష ఉద్యోగులు కూడా వేరే రంగు యూనిఫాం వేసుకునే అవకాశం
- మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీ




**ఉద్యోగుల కోసం..**

### ఆర్టీసీలో కార్మికులుండరు.. అంతా ఉద్యోగులే

- రెండేండ్లపాటు గుర్తింపు యూనియన్ ఎన్నికలు ఉండవు
- ప్రతి డిపోలో ఇద్దరు ఉద్యోగులతో కార్మిక సంక్షేమబోర్డు
- తాత్కాలిక ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేస్తాం
- టికెట్ బాధ్యత ప్రయాణికుడిదే.. కండక్టర్లపై చర్యలుండవు
- యథావిధిగా ఇంక్రిమెంట్

**కుటుంబాలకు..**

### ఉద్యోగుల తల్లిదండ్రులకు హెల్త్ సర్వీసులు

- ప్రతి డిస్పెన్సరీలో ఉచితంగా మందుల పంపిణీ
- తల్లిదండ్రులకు ఉచిత బస్‌పాసులు.. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉద్యోగుల గృహనిర్మాణ పథకానికి రూపకల్పన

• ప్రగతి చక్రాల జోష్

# ఆర్టీసీపై వరాల వర్షం

- సెప్టెంబర్ నెల వేతనం నేడు చెల్లింపు
- సమ్మెకాలానికి వేతనం ఒకే దఫాలో ఇస్తాం
- సమ్మెకాలంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఎనిమిది రోజుల్లోగా ఉద్యోగం ఇవ్వాలి
- మృతుల కుటుంబాలకు రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా
- వచ్చే బడ్జెట్‌లో ఆర్టీసీకి వెయ్యి కోట్లు కేటాయిస్తాం
- ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏండ్లకు పెంపు
- ఆర్టీసీ ఉద్యోగులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత
- పీఎఫ్ బకాయిలు, సీసీఎస్‌కు డబ్బులు చెల్లిస్తాం
- ఒక్క బస్సు కూడా ప్రైవేటుకు ఇచ్చేదిలేదు: సీఎం కేసీఆర్




ఆదివారం జనహితలో ఆర్టీసీ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్.. ఆర్టీసీ బలోపేతంపై సీఎం ఉత్సాహ పూరిత ప్రసంగానికి హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ ఉద్యోగులపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వరాలవర్షం కురిపించారు. ఉద్యోగాలకు ఎలాంటి ఢోకాలేదంటూ భరోసా నిచ్చారు. సెప్టెంబర్ వేతనాన్ని సోమవారం ఇస్తామని ప్రకటించారు. సమ్మెకాలానికి కూడా వేతనాలను తర్వాతి రోజుల్లో ఒకేదఫాలో ఇస్తామని తెలిపారు. సమ్మెకాలంలో మరణించిన ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి ఎనిమిది రోజుల్లోగా ఉద్యోగం ఇవ్వడంతో పాటు, ప్రభుత్వం తరఫున రెండు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. రిటైర్మెంట్ వయస్సును 60 ఏండ్లకు పెంచుతామని చెప్పారు. మహిళలకు రాత్రి డ్యూటీలు రద్దుచేస్తున్నట్టు చెప్పిన సీఎం.. వారికి ప్రసూతి సెలవుతోపాటు చైల్డ్‌కేర్ లీవ్ ఇస్తామని ప్రకటించారు. వచ్చే బడ్జెట్ నుంచి ఆర్టీసీకి వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పారు. ఆర్టీసీ స్థితిగతులపై, దాని పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రతి ఆర్టీసీ డిపో నుంచి ఐదుగురు చొప్పున ఉద్యోగులతో జనహితలో సమావేశం అవుతానని ఇటీవల ప్రకటించిన సీఎం.. ఆ మేరకు ఆదివారం వారితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉద్యోగులను ప్రగతిభవన్‌కు పిలిపించి.. వారితోకలిసి భోజనంచేశారు. అంతకుముందు, భోజనం చేస్తున్న సమయంలో కార్మికుల వద్దకు వెళ్లి వారి కష్టాలు, ఇబ్బందులు విన్నారు. అప్పటికే ఆర్టీసీ

మిగతా 2వ పేజీలో

### వెయ్యి కోట్ల లాభాల్లోకి సంస్థ ఎదగాలి

- ప్రగతిచక్రానికి ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశం
- మీ వెంట తానుంటానని ఉద్యోగులకు భరోసా
- బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తానని వ్యాఖ్య
- భోజనం పెట్టి.. బాగోగులు తెలుసుకున్న సీఎం
- అనంతరం జనహితలో కార్మికులతో భేటీ
- కార్మికుల చప్పట్లతో మార్మోగిన జనహిత

## జై కేసీఆర్..

- మార్మోగిన నినాదాలు
- సంబురాల్లో ఆర్టీసీ ఉద్యోగులు
- డిపోల వద్ద పండుగ వాతావరణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాలజల్లు కురిపించడంతో ఉద్యోగుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సీఎంతో ఆత్మీయ సమావేశం అనంతరం ప్రగతిభవన్ నుంచి వెలుపలికి వచ్చిన ఉద్యోగులు ప్రభుత్వానికి అనుకూలంగా పెద్దఎత్తున నినాదాలుచేశారు. తమ జీవితంలో ఇలాంటి ముఖ్యమంత్రిని చూడలేదని, సమ్మెచేసి ఇబ్బంది కలిగించినప్పటికీ తమపై వరాలు కురిపించారని హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 97 డిపోల వద్ద ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు అంబరాన్నంటాయి. పటాకులు కాల్చి.. జై కేసీఆర్ అంటూ నినాదాలుచేశారు. ఒకరినొకరు ఆలింగనాలు చేసుకుంటూ స్వీట్లు తినిపించుకున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఉద్యోగులను పిలిపించి మాట్లాడలేదని, కలిసి భోజనంచేసిన దాఖలు లేవని కార్మికులు అన్నారు. ఇక తమ ఉద్యోగాలకు భరోసా కలిగిందని, సీఎం కేసీఆర్ సూచించినట్టు క్రమశిక్షణతో పనిచేసి సంస్థను లాభాల బాట పట్టించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, యూనియన్లతో అవసరం లేదని.. తమ నాయకుడు సీఎం కేసీఆర్ అని స్పష్టంచేశారు.

# ఇది అమానుషం

**'జస్టిస్ ఫర్ దిశ' కేసు సత్వర విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు.. అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం**

కాలంచెల్లిన చట్టాలను మార్చాలి.. ప్రధాని మోదీకి మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి




ఆదివారం హైదరాబాద్‌లో 'జస్టిస్ ఫర్ దిశ' కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించిన ప్రజలు


**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ, శంషాబాద్:**

శంషాబాద్ ఘటన అమానుషమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆదివారం ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వెటర్నరీ వైద్యురాలిపై జరిగిన ఘాతుకంపై స్పందించారు. ఆడబిడ్డలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని, సామూహిక లైంగికదాడికి పాల్పడి సజీవదహనం చేయడం దారుణమైన, అమానుషమైన దుర్ఘటన అని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'జస్టిస్ ఫర్ దిశ' కేసును అత్యంత వేగంగా విచారించి దోషులకు కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటుచేయాలని సూచించారు. ఇటీవల వరంగల్‌లో మైనర్ బాలిక హత్యకేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయడం వల్ల 56 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించిన విషయాన్ని గుర్తుచేసిన సీఎం కేసీఆర్.. ఇదేతరహాలో

మిగతా 6వ పేజీలో

### నిందితులను అసహ్యించుకుంటున్న చర్లపల్లి ఖైదీలు!

- అప్రమత్తమైన జైలు అధికారులు
- వెటర్నరీ డాక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన డీజీపీ
- బాధితురాలి పేరును ఎక్కడా వాడొద్దు
- జస్టిస్ ఫర్ దిశగా సంబోధించాలి: సీపీ సజ్జనార్



**ఖబర్దార్..అన్నట్టుగా దండన ఉండాలి**

దారుణమైన మారణకాండకు పాల్పడేవారికి తగిన దండన విధించి తీరాలి. పదిమంది చూసేట్టుగా, పదిమందికి తెలిసేట్టుగా చేయాలి. ఇంకెవరైనా అలాంటి ఆలోచన చేయాలన్నా.. ఖబడ్దార్ అనే వార్నింగ్ ఇవ్వగలిగినట్టుగా దండన ఉండాలి.

- త్రిదండి చినజీయర్‌స్వామి

# ముమ్మరంగా ఎత్తిపోత

కాళేశ్వరం ద్వారా కొనసాగుతున్న గోదావరి పరవళ్లు.. ఇప్పటిదాకా లక్ష్మీబరాజ్ నుంచి 21 టీఎంసీలు లిఫ్ట్

ఎల్లంపల్లి నుంచి రాజరాజేశ్వరకు 31 టీఎంసీలు.. మార్చి వరకు నిరంతరాయంగా ఎత్తిపోతకు సన్నాహాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా లక్ష్మీ పంప్‌హౌస్‌లో గోదావరి జలాలను ఎత్తిపోస్తున్న 4, 6, 8 ,10వ నంబర్ మోటర్లు

రాష్ర్టానికి జీవనాధారమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అద్భుత ఫలితాలనిస్తున్నది. ప్రారంభించిన తక్కువ సమయంలోనే భారీస్థాయిలో గోదావరి జలాలను ఎత్తిపోసింది. కాళేశ్వరం ప్రారంభోత్సవం నాటినుంచి ఆదివారం సాయంత్రం వరకు లక్ష్మీ పంపుహౌస్ అంటే లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్ నుంచి 21 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. ఎల్లంపల్లి జలాశయం నుంచి శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయానికి ఇప్పటివరకు 31 టీఎంసీలను ఎత్తిపోసినట్టు కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాల పరవళ్లు కొనసాగుతున్నాయి. ప్రధాన గోదావరిలో ఎగువ నుంచి వరద నిలిచిపోవడంతో గత కొన్నిరోజులుగా ప్రాజెక్టులోని లింక్-1, లింక్-2లో భాగంగా నిర్మించిన పంపుహౌస్‌ల నుంచి జలాల ఎత్తిపోత నిరంతరాయంగా సాగుతున్నది. వచ్చే ఏడాది మార్చి దాకా దీనిని కొనసాగించాలని ప్రభుత్వం యోచిస్తుండటంతో ఆ దిశగా ఇంజినీర్లు సన్నాహాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్.. ప్రాజెక్టును ప్రారంభించిన తర్వాత మొదట లింక్-1లో భాగంగా లక్ష్మీబరాజ్ నుంచి పార్వతి బరాజ్ ఆపై ఎల్లంపల్లి జలాశయానికి జలాల్ని తరలించారు. నదిలో వరద ప్రవాహానికి అనుగుణంగా ఎగువ నుంచి ఎల్లంపల్లికి ఇన్‌ఫ్లో ఉండటంతో లింక్-1ను నిలిపివేసి.. ఆపై ఎల్లంపల్లి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి తరలించారు. సాంకేతిక ప్రొటోకాల్‌లో భాగంగా ఇంజినీర్లు శ్రీరాజరాజేశ్వర జలాశయాన్ని ఖాళీచేయాల్సి రావడంతో ఆ నీటిని ఎల్‌ఎండీకి పరుగులు పెట్టించారు. కొన్నిరోజుల కిందట ఎల్లంపల్లికి వరద పూర్తిగా నిలిచిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టు అసలుపని మొదలైంది. ప్రాణహిత నుంచి వస్తున్న ప్రవాహానికి అనుగుణంగా లక్ష్మీబరాజ్ ఫోర్‌షోర్ నుంచి లక్ష్మీ పంపుహౌస్ ద్వారా జలాల ఎత్తిపోత మొదలుపెట్టారు. అదే సమయంలో ఎల్లంపల్లి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి కూడా జలాల

మిగతా 6వ పేజీలో



## మొబైల్ చార్జీల మోత

- నేటి అర్ధరాత్రి నుంచి పెరుగనున్న ధరలు
- వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ నిర్ణయం
- 50 శాతం వరకు ఆయా ప్లాన్లు ప్రియం
- డిసెంబర్ 6 నుంచి జియో వడ్డన

9

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 88.00 | రిటైల్ లైవ్ | 110.00 |
| డ్రెస్‌డ్ | 160.00 | స్కిన్‌లెస్ | 182.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 441.00 | రంగారెడ్డి | 441.00 |
| మెదక్ | 441.00 | కరీంనగర్ | 444.00 |
| వరంగల్ | 444.00 | చిల్లర ధర | 5.00 |

# ప్రాణహితలో పడవ మునక

ఇద్దరు ఎఫ్‌బీవోల గల్లంతు ■ మరొక ఎఫ్‌బీవోతోపాటు ముగ్గురు స్థానికులు క్షేమం

సహాయక చర్యలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశం ■ సాయంత్రంవరకు గాలించినా లభించని ఆచూకీ ■ నేడు మళ్లీ గాలింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ కౌటాల రూరల్ (చింతలమానెపల్లి):**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం గూడెం సమీపంలోని (మహారాష్ట్ర సరిహద్దులో) ప్రాణహిత నదిలో ఆదివారం నాటుపడవ మునిగి ఇద్దరు ఫారెస్ట్ బీట్ అధికారులు (ఎఫ్‌బీవో) గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా కర్జెల్లి అటవీ ప్రాంతం పరిధిలోని కేతిని బీట్ అధికారి బాలకృష్ణ, చిత్తా బీట్ అధికారి సురేశ్, శివపెల్లి బీట్ అధికారి సద్దాం మహారాష్ట్ర సరిహద్దులోని అహేరికి నాటుపడవలో వెళ్లారు. నది పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించి తిరిగి బయల్దేరారు. వీరితోపాటు స్థానికులైన పడవ నడిపే పానెం లింగయ్య, సూరకత్తెరయ్య, పేదం అంజయ్య కూడా ఉన్నారు. ప్రాణహిత మధ్యలోకి వచ్చేసరికి పడవ ప్రమాదవశాత్తు మునిగిపోయింది. ఈ ఘటనలో బీట్ ఆఫీసర్లు బాలకృష్ణ, సురేశ్ గల్లంతవగా, మిగతా నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ డీఎస్పీ బీఎల్‌ఎన్ స్వామితోపాటు కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, మహారాష్ట్ర పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన రెస్క్యూ సిబ్బంది సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ

మిగతా 6వ పేజీలో



ప్రాణహిత నదిలో నాటుపడవ బోల్తాపడిన ప్రాంతం

సురేశ్

బాలకృష్ణ

# పబ్‌లో గూండాగిరీ




### నందీశ్వర్‌గౌడ్ కొడుకు వీరంగం

- యువతుల పట్ల అసభ్య ప్రవర్తన
- సినీనటి చేయి లాగిన ఆశిష్‌గౌడ్.. కేసు నమోదు
- పరారీలో మాజీ ఎమ్మెల్యే కొడుకు

**హైదరాబాద్ సిటీబ్యూరో/మాదాపూర్, నమస్తే తెలంగాణ:**

పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత టీ నందీశ్వర్‌గౌడ్ కుమారుడు ఆశిష్‌గౌడ్ మద్యం మత్తులో రెచ్చిపోయాడు. ఆదివారం తెల్లవారుజామున ఆశిష్‌గౌడ్, ఆయన మిత్రగణం హైదరాబాద్ మాదాపూర్‌లోని నోవాటెల్ ఆర్టిస్ట్రీ పబ్‌లో వీరంగం సృష్టించారు. అక్కడున్న ఓ సినీనటితోపాటు ఆమె స్నేహితురాండ్లను తాకడంతోపాటు వారి చేతులు పట్టుకొని లాగి అసభ్యంగా ప్రవర్తించారు. అంతటితో ఆగకుండా ఆశిష్‌గౌడ్ తన చేతిలో ఉన్న గాజుగ్లాసును నేలకేసి కొట్టి భయోత్పాతం సృష్టించాడు. ఈ దుశ్చర్యను అడ్డుకోవాల్సిన బౌన్సర్ కూడా ఆశిష్‌గౌడ్‌కే వంతపాడుతూ యువతులను వెళ్లిపోవాల్సిందిగా హూంకరించాడు. ఈ ఘటనపై బాధిత సినీనటి ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు మొదలుపెట్టారు. వివరాల్లోకెళ్తే.. స్నేహితులతో కలిసి మాదాపూర్ హైటెక్స్‌లోని ఆర్టిస్ట్రీ పబ్‌కు వెళ్లిన సినీనటి, ఆమె స్నేహితురాండ్లు ఓ పక్కన నిలబడి సంగీతాన్ని వింటున్నారు. అప్పటికే మద్యంమత్తులో జోగుతున్న ఆశిష్‌గౌడ్, అతని మిత్రులు వారి వద్దకొచ్చి చేతులు పట్టి లాగారు. అంతటితో ఆగకుండా ఆశిష్‌గౌడ్ తీవ్ర పదజాలంతో

మిగతా 6వ పేజీలో



ఆదివారం జనహితలో ఆర్టీసీ కార్మికులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ, ఈడీలు, ఆర్‌ఎంలు, డీవీఎంలు, డీఎంలు, కంట్రోలర్లు, సూపర్‌వైజర్లు, కార్మికులు కూడా ఉన్నారు.



# ఆర్టీసీపై వరాల వర్షం

మొదటిపేజీ తరువాయి...

క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులు ఇచ్చిన నివేదికలను అధ్యయనంచేసిన సీఎం.. భోజనం అనంతరం జనహితలో ఏర్పాటుచేసిన సమావేశంలో రెండుగంటలపాటు ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఆర్టీసీ తెలంగాణలోనే ఉన్నదని అంతా చెప్పుకోవాలని ఆకాంక్షించారు. మీ వెనుక తానుంటానంటూ భరోసానిచ్చారు. రెండేండ్లపాటు ఆర్టీసీ గుర్తింపు యూనియన్ ఎన్నికలు ఉండవని చెప్పారు. ఆర్టీసీ రాత మార్చాలని, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. నాలుగు నెలల తర్వాత మరోసారి ఇక్కడే సమావేశమవుదామని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగం ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..



ప్రగతిభవన్‌లో సీఎం కే చంద్రశేఖర్‌రావుతో కరచాలనం చేస్తున్న జగిత్యాల డిపో కండక్టర్ వంగర ఉమారాణి. చిత్రంలో వివిధ డిపోల మహిళా కండక్టర్లు

### ఐదేండ్లలో 5వేల కోట్లు ఇచ్చినం

నేను ఎన్కట రవాణామంత్రిగ మూడేండ్లు పనిచేసిన. నష్టంలో ఉన్న సంస్థను కష్టపడి రూ.14 కోట్ల లాభాల్లోకి తెచ్చిన. తర్వాత ఉద్యమంలోకి పోయిన.. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం అయిన. మీరే గెలిపించినరు. నాకు ఆ పాత ప్రేమ కారిపోయింది కదా ఆర్టీసీ మీద.. డీఎంలు, ఆర్‌ఎంలను పిలిచి పొద్దుగాల మొదలుపెడితే సాయంత్రందాకా మీటింగుపెట్టి ఎట్లయినా సంస్థను కాపాడాలని చెప్పిన. నాకు ఇష్టమున్న సంస్థ అని చెప్పిన. డబ్బులిచ్చినం. టీఆర్‌ఎస్ అధికారంలోకి రాకముందు అప్పటి ప్రభుత్వం ఐదేండ్లలో ఆర్టీసీకి రూ.732 కోట్లు ఇస్తే.. పోయిన ఐదేండ్లలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.5వేల కోట్లిచ్చింది. ఇది లెక్క. అబద్ధాలు చెప్పేదికాదు. ప్రేమకొద్దీ.. సంస్థ మంచిగుండాలి, ముందుపడాలి, పెరుగాలని ఇచ్చినం.

### మృతుల కుటుంబాల్లో ఒకరికి ఎనిమిది రోజుల్లో ఉద్యోగం

కొందరు కార్మికులు చనిపోయారు. చాలా బాధాకరం. అలా జరుగాల్సింది కాదు. మంత్రికి, ఎండీకి విజ్ఞప్తిచేస్తున్నా. ఎనిమిది రోజుల్లో వాళ్ల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. దరఖాస్తులు, దండాలు పెట్టుడూ.. లంచాలు.. ఇవన్నీ దరిద్రాలు ఉండద్దు. ఎనిమిదోనాడు ఫోన్‌చేసి ఏ డిపోవాళ్లను అడిగినా డ్యూటీ ఎక్కినట్లు చెప్పాలి. ప్రభుత్వపరంగా కుటుంబానికి రెండులక్షల ఎక్స్‌గ్రేషియా ఇద్దాం. సంస్థపరంగా ఏమివ్వగలరో చూద్దాం.

### రోజుకు ఇంకొక్క కోటి సంపాదించలేరా?

ఆర్టీసీని బతికిద్దామా.. చంపుదామా? మనం అనుకుంటే లాభంలోకి తీసుకురాలేమా! రోజుకు పదిన్నరకోట్లు సంపాదిస్తరు.. ఇంకొక్క కోటి సంపాదిస్తే ఏడాదికి రూ.365 కోట్లు అదనంగా వస్తయి. పంచుకొని మనమే తింటం కదా! కరంట్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకంటే ఎక్కువ జీతం వస్తది. తెలివి ఉంటే మనకు సాధ్యంకాదా? మీరు నావెంట ఉంటే వంద శాతం అయితది. రాదన్న తెలంగాణ రాలేదా.. గట్టిగ మొండిపట్టు పడితే! చావుదాకా పోయిన గానీ వదలిపెట్టలేదు. ఒక దశలో మీరూ చేయికలిపారు. అంత గొట్టుపని అయింది.. సంస్థను లాభాల బాట పట్టించడం కష్టమా? కష్టం చేసేవారి చేతిలోనే లక్ష్మి ఉంటది. మీకు జీతాలు తక్కువ ఉండుడేంది? క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఆరునెలల్లోనే సంస్థను మార్చుదాం. ఇక నేనే సూపర్‌వైజర్‌గా ఉంటా. ఈరోజు వచ్చిన వాళ్లతోనే మళ్లీ నాలుగు నెలల తర్వాత సమావేశం ఏర్పాటుచేస్తం. ఈ నాలుగు నెలల్లో ఏమన్న చేసినమా, చేయలేదా! ఇక చూపెడుదాం తమాషా. ఎలా సాధ్యంకాదో చూద్దాం. మీ వెంట సీఎం ఉన్నాక ఎందుకు మార్పు రాదు? దాని కత ఏందో చూస్తాను. ఇండియాలో బెస్ట్ ఆర్టీసీ ఎక్కడుంది అంటే తెలంగాణ వైపు చూపాలి. అంతా కష్టపడి సంస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు కృషిచేయాలి.

### మహిళా సిబ్బంది సంక్షేమకోసం కమిటీలు

మహిళా సిబ్బంది సంక్షేమానికి కార్పొరేట్ లెవల్, రీజియన్, డిపోలవారీగా కమిటీలు వేసుకుందం. మహిళా అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలి. ఆర్టీసీ వెయ్యికోట్ల లాభంలో ఉన్నప్పుడు దావత్ చేసుకుందం. నేను కూడా ఆరోజు సీటీ (విజిల్) కొడుత. అది మనం సాధించిన విజయం కిందికి వస్తది! డిపో మేనేజర్లు కార్మికులతో వనభోజనాలకు వెళ్లాలి. సంతోషంగా కలిసి ఉండాలి. మీరు గొప్ప సైన్యం. సంఘటిత శక్తి. మీరు అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చు. ఆరోగ్యం బాగుంటేనే కదా పనిచేసేది. ఉద్యోగుల తల్లిదండ్రులకు కూడా వైద్యసౌకర్యం కల్పించాలి. కావాలంటే రూ.100 కోట్లు ఎక్కువ ఇస్తాం. కార్మికుడు టెన్షన్‌లో లేకుండా సంతోషంగా పనిచేసే వాతావరణం నెలకొల్పండి. అందరు తార్నాక హాస్పిటల్‌కు రావాల్సిన అవసరం లేకుండా రీజినల్‌స్థాయిలో సౌకర్యం ఏర్పాటుచేయండి. దవాఖానలను ఎంపికచేయండి. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌లో పెడుతారా.. ఆలోచించండి. 10-15 రోజుల్లోనే స్కీమ్ తయారుచేయండి.

నా పరంగా చేయాల్సినవి అన్ని చేస్తున్న. మనకు పోటీ ఎవరూలేరు. అలాగని సమ్మె చేస్తామంటే మంచిగ ఉండదు. జన్మలో సమ్మె చేయకూడదు. మనకు అన్నంపెట్టేవాళ్లు ప్రజలు. వాళ్లకు ఇబ్బంది రానివ్వొద్దు. సీఎం నుంచి కండక్టర్, అటెండర్‌దాకా ప్రజాసేవకులం. వారికి నష్టంచేయవద్దు. పండుగలప్పుడు, పరీక్షలున్నప్పుడు వారిని ఇబ్బందిపెట్టొద్దు. అది దుర్మార్గం.

### కనీస టిక్కెట్టు పది రూపాయలు..

'టికెట్ ధర పెరుగుతున్నది కదా.. బేస్ టిక్కెట్టు ధర రూ.8 అయితాంది.. చిల్లరలేదని ప్రజలు కండక్టర్లను తిడుతరు సార్.. దానిని పది రూపాయలు చేయండి' అని అధికారులు అడిగిన్రు. 'మీరు మమ్ముల్ని ప్రజలతో తిట్టిపిచ్చేటట్టు ఉన్నరు కదా.. తిడితే తిట్టురు ఏం చేస్తాం.. పది చేయండి' అని చెప్పా. ఆ పైసలు ఆర్టీసీకి వస్తున్నాయి కదా! ఇప్పటిదాకా యూనియన్ కల్చర్ ఉన్నది. మంచోచెడో జరిగింది. ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డు వేసుకుంటున్నం. ప్రతి డిపోకు ఇద్దరు ఉంటరు. రాష్ట్రస్థాయిలో ఒక ఉద్యోగి ఉంటరు. చీటికిమాటికి సస్పెన్షన్లు, డిపో స్పేర్లు ఉండవు. ఇంక్రిమెంట్లు ఆపేయవద్దు. ఇంక సమస్యలు ఏం వస్తాయి! 'అందరం సంతోషంగా పనిచేస్తాం. మాకు ఇబ్బందులు లేవు' అనే వాతావరణం వస్తే అయిపాయే.

### ఐదువేల పర్మిట్లు ఇస్తే మీ గతేంది?

నేను ఓ ఐదు నిమిషాలు ఇటుగాకుండా అటు నిర్ణయం తీసుకుంటే మీది ఘోరమైన గతి ఉండేది. అట్లవద్దని.. మంత్రులు, ఉన్నతాధికారులను ఏం చేద్దాం? అని అడిగిన. మిమ్మల్ని కొట్టే హక్కులేదు.. చంపే హక్కులేదు. సింపుల్‌గ ఐదువేల పర్మిట్లు ఇస్తే సరిపాయె! మీరేమో యూనియన్ల పేరు పెట్టుకొని 'మేం గింతే నడుపుతం.. గంతే నడుపుతం.. ఇప్పుడే బంజేస్తం' అన్నరు. కానీ ప్రైవేటోడు అట్లకాదు. మీరు 300 బస్సులు నడుపుతమంటే వాడు 400 నడుపుతడు. సంపాదించుకోవాలనే ఆర్తి ఉంటది కదా! వాని 5వేల బస్సులు మీ 8వేల బస్సుల సమానం తిప్పుతడు. మన బస్సు ముందే ప్రైవేటు బస్సు పెడుతరు. ఎవరు ఆపుతరు? అనుమతి తీసుకునే నడుపుతరు! ఇలా అయితే ఉంటదా ఆర్టీసీ? ప్రైవేటుకు ఇవ్వాలని కేంద్రం కానూన్ చేసింది. దేశం మొత్తం అమలుచేస్తున్నరు. నాకు మనసు ఒప్పుతలేదు. ఏం చేయాలి? నా జేబుల లేదు. ఫైనల్‌గా ప్రజలకు రవాణాసౌకర్యం ఉండాలికదా! సమ్మెలు ఏంటని ప్రజలు అడుగరా! ప్రభుత్వం అంటే ఎన్నో వింగ్స్ ఉంటయి. అందర్నీ చూడాలి. ఇల్లు నడుపుడు ఎట్లనో ప్రభుత్వం నడుపుడు గట్లనే ఉంటది. నేను మొండి ఎక్కువ. అందుకే అందరినీ పిలిచి మాట్లాడుదామని అనుకున్నా. ఆఫీసర్లను అడిగితే 'ఒక్క అవకాశం ఇవ్వండి.. ఇంకోసారి జరుగనివ్వం.. కార్మికులతో మాట్లాడుతం' అన్నరు. ఎవరూ వద్దు నేనే మాట్లాడుతా అని ఈ కార్యక్రమం ఏర్పాటుచేసిన.

### సిబ్బంది తల్లిదండ్రులకు బస్‌పాసులు

సిబ్బంది తల్లిదండ్రులకు కూడా బస్‌పాసులు ఇవ్వండి. గతంలో ఉన్నది. తిరిగి ఇవ్వండి. ఆర్టీసీ ఉద్యోగులకు పెద్దగా జీతాల్లేవు. అందుకే ఇవన్నీ చేస్తున్నా. సంస్థ లాభాల్లోకి వచ్చే దాకా ప్రభుత్వపరంగా సపోర్ట్‌చేస్త. మీరు చేయాల్సిందల్లా సంస్థను లాభాల్లోకి తేవటమే. తార్నాక దవాఖానలో చాలినన్ని మందులు పెట్టండి. బయట కొనుక్కో అని తిప్పవద్దు. ఎండీలు, ఈడీలు వెంటనే సమీక్షించి.. అవసరమైన ముందులు ఉన్నయా లేవా! చూడండి. మందులు పెట్టండి. దీనిని కూడా డిమాండ్ చేయాల్నా? ఈ ముచ్చట మళ్లీ వినపడొద్దు. సంస్థలో 10వేల మంది ఉద్యోగులు పెరగాలి.

## నాటి అర్ధాయుష్షు రాక్షసులే..

**ప్రతి** పని చేసేటప్పుడు చెడగొట్టేవాళ్ళు ఉంటారని చెప్తూ.. రామాయణ యుద్ధం గురించి ప్రస్తావించిన సీఎం కేసీఆర్.. ఆర్టీసీ ఉద్యోగులను కడుపుబ్బ నవ్వించారు. యుద్ధంలో రామబాణం వల్ల అర్ధాయుష్షుతో మరణించిన రాక్షసులు కొందరు తమ పరిస్థితి ఏమిటని రాముణ్ణి అడిగినప్పుడు.. కలియుగంలో మీరు అక్కడక్కడా పుట్టండి అన్నాడంట. అలా పుట్టిన వారే ఇప్పుడు మనుషులను పీక్కుతింటున్నారు. వారు మనలానే కనిపిస్తారు కానీ.. వారి ఆలోచనలు వేరేవిధంగా ఉంటాయి. అటువంటివారే ఆర్టీసీలో అందరినీ ఇబ్బంది పెడుతున్నరు' అని ముఖ్యమంత్రి అనడంతో సమావేశంలో ఒక్కసారిగా నవ్వులు విరిశాయి.

## సెప్టెంబర్ వేతనం నేడు



**మీరు** ఇక్కడికి వచ్చారు.. సీఎం ఏం ఇచ్చారని తోటి కార్మికులు అడుగుతరు. మీరుపోయి చెప్పాలె. మీరు సమ్మెచేశారు. లక్షల జీతాల్లేవు. సర్వీస్ చివర ఉన్నవాళ్లకు కొంచెం మంచిజీతాలు, మిగిలినోళ్లందరికీ 20 వేలు, 30 వేలు ఉంటయి. సెప్టెంబర్ జీతాలు రేపు (సోమవారం) ఉదయం ఇస్తం. (చప్పట్లు, విజిల్స్). 55 రోజుల సమ్మె జీతం కూడా నేనే ఇప్పిస్త. (చప్పట్లు.. కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు). ఇంట్ల ఎవరైన తప్పుచేస్తే ఇంటిపెద్దకే కదా బాధ! ఏదన్న చేసి మీ వాటా నింపుత. ఒకనెల వెనుకముందు వస్తయి. మీ రెండునెలల జీతం నా దగ్గర బ్యాంకుల ఉన్నట్లే. ఆ మొత్తం ఒకేసారి ఇచ్చే ఏర్పాటుచేస్తం. ఖర్చు పెట్టుకోకుండా కాపాడుకోండి. దేనికన్న ఉపయోగపడుతది. మీ ఇంక్రిమెంట్ కూడా పోదు. ఏం ఇచ్చారు ముఖ్యమంత్రి? అని అడిగితే.. ఇవన్నీ ఇచ్చారని మీరు చెప్పాలె. ఉన్నయి మీరు పోగొడితే.. మేం పట్టుకొచ్చినమని చెప్పాలె. వాళ్లకుకూడా ఇస్తున్నం. వాళ్లు కూడా బంతిల ఉన్నరు కదా!

### చీకటినుంచి వెలుగులదాకా రాష్ట్ర ప్రస్థానం

చాలా కష్టపడి రాష్ట్రం తెచ్చుకున్నం. సమస్యలు చాలా ఉండేవి. ఒక్కొక్కటీ చేసుకుంటూపోతున్నం. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లానుంచే 25 లక్షలమంది వలసపోయేవారు. కారుచీకటి. ఆదాయం, ఖర్చు లెక్కలేదు. ప్లాన్‌పై అవగాహన లేదు. పక్కరాష్ట్రమోళ్ల చికాకులు! కష్ట సమయంలో ప్రయాణం ప్రారంభించినం. అనేక నిద్రలేని రాత్రులు గడిపినం. భగవంతుడి దయవల్ల మంచి ఆదాయం వచ్చింది. పేదోళ్లను ఆదుకున్నం. ఉద్యోగస్థుల జీతాలు కొంత పెంచుకున్నం. భయంకరంగా ఉండిన కరంట్ సమస్యను తీర్చుకున్నం. మంచినీళ్ల సమస్య కూడా 99% పరిష్కరించుకున్నం. ఆడబిడ్డ బిందె పట్టుకుని రాష్ట్రంలో బజార్ల కనిపించని పరిస్థితి వచ్చింది. దిక్కులేని పరిస్థితుల్లో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నరు. వాళ్లను ఆదుకున్నం. రైతులను కొంత ఆదుకున్నం. గతంల ముసలోళ్లు చూసెటోళ్లులేక చెర్లల్ల, బాయిలల్ల పడి చచ్చిపోయేటోళ్లు. వాళ్లకు మొన్నటిదాకా వెయ్యి, తర్వాత రెండువేల పింఛను ఇస్తున్నం. ఎవ్వరి అవసరం లేకుండా వాళ్ల బతుకు వాళ్లు బతుకుతున్నరు. అదో తృప్తి ఉన్నది.

### పార్సిల్ సర్వీసులు ఎందుకు పెట్టలే?

పార్శిల్ సర్వీసులతో ప్రైవేటోడు అడ్డగోలు డబ్బులు సంపాయిస్తుండు. మరి మీరు ఎందుకు పెట్టరు? మనం రోజూ ప్రతి పల్లెకు పోతం. మనం పోని ఊరు ఉంటదా? గతంలోనే పార్సిల్ సర్వీసులు పెట్టండని చెప్తే పెట్టలేదు. కానీ పంచాయితీలు, జిందాబాద్‌లు, ముర్దాబాద్‌లు. ఎల్లయ్యకు ఎడ్లులేవు.. మల్లయ్యకు బండ్లులేవు.. వట్టిదే బొబ్బ. మొత్తం మీద మొన్న గొంతు కోసుకునేకాడికి వచ్చింది. ఎందుకీ పరిస్థితి?

## పదవీ విరమణ 60 ఏండ్లకు పెంపు

**కొత్త ఉద్దేశం,** కొత్త ఉద్వేగంతో, ఫ్రెష్‌మైండ్‌తో పోవాలి. బాగుపడే ఆర్టీసీ.. బతికే ఆర్టీసీ.. భద్రత కూడుకున్న ఆర్టీసీ ఉండాలి. మనం బతకాలి.. ప్రజల్ని బతికివ్వాలి. పట్టుబడితే, జట్టుకడితే వందశాతం ఫలితం వస్తది. టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయి అని పిలవాలి. కార్మికులని పిలవొద్దు. అనుభవమున్న అధికారులు అవసరం పడుతరని ఎన్నికల్లో ఉద్యోగులకు కొన్ని హామీలు ఇచ్చాం. ఆర్టీసీ ఉద్యోగుల సర్వీసును కూడా 58 ఏండ్లున్నది.. 60 ఏండ్లు చేసుకుందం. (ఈ సమయంలో ఉద్యోగులంతా పెద్దపెట్టున హర్షధ్వానాలు చేయడంతో.. సీఎం నవ్వుతూ..) జర్రంత సంతోషంకాంగానే పొంగిపోవుడు.. కేసీఆర్ బొమ్మ పెట్టి పాలు పోసుడు.. జర్ర ఎటమటం కాంగానే తిట్టుడు! మనం గొప్ప విజయం సాధించాలి. గొప్ప కార్యక్రమం చేయాలి. అనుకున్నకాడికి చేరాలి. మార్పును అంగీకరించే దిశలో ఉండాలి. తొందరగా ఉబ్బిపోవద్దు. కష్టం వస్తే కుంగిపోవద్దు. బెస్ట్ ఆర్టీసీ మనది. కష్టసుఖాల్లో ఒకే తరీఖన ఉండాలి. (నవ్వుతూ) నేను మాట్లాడితే సీఎం లెక్క అనిపిస్తలేదు కదా! ఉద్యమంలో ఉపన్యాసమే నాకు ఇష్టం ఉండే. ఇప్పుడు మాట్లాడుదామంటే వెనకముందు చూసుకోవాలి..ఎటన్న పోదామంటే పోలీసాయన పంచాయతీ.. ఎటుపడితే అటు పోరాదు.. బట్ట కొనుక్కోరాదు.. ఎంత గందరగోళం! బయటకి బాగానే కనపడుతది కానీ లోపల సక్కదనం ఉండదు. మీరు ఆత్మీయులు వచ్చిన్రని మాట్లాడుతున్న.

## మహిళలకు రాత్రి డ్యూటీలు వద్దు



**మహిళా** ఉద్యోగుల్లో (మహిళా కండక్టర్లనుద్దేశించి) మన బిడ్డలను చూసుకోవాలి. వారికి రాత్రివేళల్లో డ్యూటీలు వేయవద్దు. రాత్రి 7.30-8 గంటకల్లా డ్యూటీ దిగేటట్టు పెట్టాలి. ఆర్టీసీని ఎవరో వచ్చి బాగుచేయరు. ఎవరికి వారే బాగుచేసుకోవాలి. సంస్థలో పనిచేస్తున్న అందరిలో మార్పురావాలి. డిపో మేనేజర్లది పెద్దపాత్ర. అందరం కలిసి ప్రతిజ్ఞ తీసుకోవాలి. అందరిలో కమిట్‌మెంట్ రావాలి. నేను గ్యారంటీ ఇస్తున్న. ఒక్క కార్మికుడిని కూడా తీసివేయం. కలర్‌బ్లైండ్‌నెస్ ఉన్న వారిని కూడా తీసివేయం. నిష్పక్షపాతంగా డ్యూటీలు వేయాలి.

## వెయ్యి కోట్ల లాభాల్లోకి వస్తే నా జన్మ ధన్యమైనట్లే

**కార్మికులను** స్పేర్ పెట్టుడు ఉండదు. టెన్షన్ లేదు. గంట ఎక్కువ పనిచేద్దాం. చెడిపోయిన 500-600 బస్సులను పార్సిల్ సర్వీసుకు పెట్టండి. అట్ల కూడా డబ్బులు వస్తాయి. కలర్‌బ్లైండ్ ఉద్యోగులను, ఆరోగ్యం బాగాలేనివాళ్లను అందులో పెట్టండి. కుటుంబంలాగా అందరం కలిసి పనిచేస్తే ఆర్టీసీ ఏడాది.. ఏడాదిన్నరలో వెయ్యి కోట్లకుపైగా లాభంలోకి వస్తది. ఏటా కార్మికునికి లక్ష బోనస్ వస్తది. ఆ ఆర్టీసీ కావాలి నాకు. మీరు అదిచేసి చూపించండి.. నా జన్మధన్యమైనట్లే. అద్భుతంగా.. అందరు నవ్వుకుంట పనిజరుగాలి. సంతోషంగా ఉండాలి. అదీ నాకు గొప్ప. అదీ గర్వం నాకు. అందరికన్న ముందు అధికారులు మారాలి. యాజమాన్యం- కార్మికులు అనే విభజన రేఖ చెరిపేయాలి. ఇక్రిశాట్ క్యాంటీన్‌లో ఆ సంస్థ ఎండీ నుంచి అటెండర్ దాకా అందరు ఒకే దగ్గర కూర్చొని తింటరు. ఆ తర్వాత ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్లి ఎవరి పని వారు చేసుకుంటరు. అటువంటి కల్చర్ ఆర్టీసీలో రావాలి. అందరూ ఒకే కుటుంబమనే భావన రావాలి. ఉజ్వలమైన.. బ్రహ్మాండమైన ఆర్టీసీ కావాలి. బ్రహ్మాండంగా సంపాదించాలి. పదిమంది మెచ్చే బతుకు బతకాలి కానీ.. పదిమంది తిట్టే బతుకు బతుకతరా? సచ్చినా సరే ఒక్క ప్రైవేటు బస్సుకు పర్మిషన్ ఇయ్యం. కానీ మీరు పనిచేయాలి. నా మాట మీరు పొడగొట్టొద్దు. పది రూపాయలు పోయినా మా ఆర్టీసీ బస్సు మాకు ఉన్నదని ప్రజలు చెప్పుకొనే పరిస్థితి తీసుకురావాలి. ప్రైవేటువారిని రానివ్వం. నాకు కావాల్సిందల్లా బ్రహ్మాండంగా బస్సు నడపాలి. మీరు సంపాదించాలి. నెలనెలకు మార్పు రావాలి. సర్‌ప్లస్‌కు రావాలి.

### ముహూర్తం

సూర్యోదయం: 6.33 గంటలకు

సూర్యాస్తమయం: 5.32 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం షష్ఠి రాత్రి 9.00 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: శ్రవణం ఉదయం 11.44 వరకు, తదుపరి ధనిష్ఠా, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 7.55 నుంచి 9.18 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.41 నుంచి మధ్యాహ్నం 12.24 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.35 నుంచి 3.20 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.08 నుంచి 5.55 వరకు.

### లోకం పోకడ




వాళ్ళు వణికేది చలికి కాదు, వార్తలకు!

# ప్రభుత్వసంస్థల్ని రక్షిస్తున్నం

- రాష్ట్రంలో కరంటు ఉత్పత్తి జెన్‌కో చేస్తున్నది
- కుబేరులు అడిగినా ఇవ్వలేదు
- ఆర్టీసీని కాపాడాలని చూసినం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. జనహితలో ఆర్టీసీ కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఆర్టీసీ రూపంలోనా.. ఇంకో రూపంలోనా.. రవాణా సదుపాయం అందుబాటులో ఉండాలి. ఎవరో అమెరికా నుంచి వచ్చి ఎయిర్‌పోర్టులో దిగిండు. బస్సెక్కాలని పోతే.. 'బస్సు లేదు.. సమ్మె..' అంటే మన రాష్ట్రానికి ఏమైనా ఇజ్జత్ ఉంటదా? చీటికిమాటికి సమ్మెచేయడం ఎవ్వరికీ మంచిదికాదు. రిజల్ట్ ఏమీరాదు. ఏం జరుగాలో విచారించుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మన దేశంలో 'మొత్తం ప్రభుత్వసంస్థలు బంద్ పెట్టుండ్రి.. మొత్తం ప్రైవేటువాళ్లకు ఇవ్వండి' అని చెప్తున్నరు. నేను సీఎం అయిన తర్వాత కరంట్ లేదు. పక్కన ఏపీ వాళ్లు మోదీని పట్టుకొని దాదాగిరీ చేసి ఏడు మండలాలను గుంజుకున్నరు. చీప్‌గ కరంట్ వచ్చే సీలేరు ప్లాంటును కూడా తీసుకున్నరు. సరే ఏదైతే అదైంది.. వచ్చిందేదోవచ్చింది.. ఆంధ్రప్రదేశ్‌కెల్లయితే మనం బయటపడ్డమని చెప్పి.. కరంట్ ఉత్పత్తి చేసుకున్నం. దేశంలో పెద్దపెద్ద కుబేరులు వచ్చి మా మీద పడ్డరు. మీకియ్యను.. మా జెన్‌కోనే ఉత్పత్తి చేస్తదని చెప్పిన. ఎందుకు ఇయ్యవంటే.. 'లాభమొస్తది.. నీవైతే జేబుల్లో వేసుకొని పీకుతవు. మా ప్రభుత్వసంస్థకు లాభమొస్తే మా ప్రజలకు తక్కువ చార్జీలకు ఇస్త, మా ఉద్యోగులకు జీతాలిచ్చుకుంట, మా పిల్లలకు ఉద్యోగాలిచ్చుకుంట.. నీకిస్తే నాకొచ్చేదేముంది?' చెప్పిన. కేంద్రంతోటి కూడా ఒత్తిడి చేయించినరు. 'దేశమంతా ఒకదిక్కు ఉంటే నీవొక దిక్కు ఉంటవా?' అంటే.. నీవేం చేసుకుంటవో చేసుకో అని చెప్పిన. ఇట్ల ఆరువేల మెగావాట్ల కరంట్‌ను జెన్‌కో ఉత్పత్తి చేస్తున్నది. అక్కడ 25వేల మంది ఎన్‌ఎమ్మార్‌లకు మొన్న ఉద్యోగాలు క్రమబద్ధీకరించినం. బ్రహ్మాండంగా జీతాలు పెంచినం. ఐఏఎస్ అధికారులు కూడా కరంటోళ్ల మీద అసూయపడతరు. వాళ్లకు జిల్లా కలెక్టర్ కంటే జీతాలెక్కువ. డీఈకి చీఫ్ సెక్రటరీ కంటే ఎక్కువ జీతం. వాళ్లు కష్టం చేస్తరు.. డబ్బులొస్తున్నయి.. పంచుకుంటున్నరు. క్రమబద్ధీకరణ ఉన్నదగ్గర అట్ల ఉంటది. ఇదే పద్ధతిలో ప్రభుత్వరంగ సంస్థలను కాపాడే ప్రయత్నంచేస్తున్న ఒకేఒక్క రాష్ట్రం తెలంగాణ. ఆర్టీసీని కూడా కాపాడాలని చూసినం. అధికారులందరినీ పిలిచి చెప్పినం. డబ్బులిచ్చినం. ప్రభుత్వపరంగా ఏం చేయాలో అది చేసినం. మీకు కూడా కొంత జీతాలు పెంచినం. మొన్న 16% రిలీఫ్ ఇచ్చినం. దాంతోటే మొత్తం స్వర్గం అయిపోయిందని చెప్పంగానీ కొంతవరకు చేసినం. కానీ మీరు ఇంకో దిక్కుపోయి గందరగోళం చేసినరు. మరి నాకు కోపం రాదా? నేను అంతమంచిగ కూర్చోబెట్టుకొని, డబ్బులు తీసుకోమని చెప్పి, బాగుపడమని చెప్తే మీరు తగదనిపోయి పంచాయితీలు పెట్టుకున్నరు. పెద్ద లొల్లి అయింది. మొన్న గా గతి వచ్చింది.



## ఆర్టీసీకి నేనే బ్రాండ్ అంబాసిడర్

**ఆర్టీసీకి** బ్రాండ్ అంబాసిడర్‌గా నేనే పనిచేస్తా. ఆర్టీసీ బస్సులో 100% సురక్షితమైన ప్రయాణం. అందులో ఎలాంటి అనుమానం లేదు. చాలా కేర్‌ఫుల్‌గా నడుపుతాం. ఇది అందరి అభిప్రాయం. దీనిని ప్రచారం చేయాలి. బోర్డు రాసుడే కాదు.. చెప్పాలి. నెలలో ఒకసారి ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని, డ్రైవర్, కండక్టర్‌తో మాట్లాడాలని టీఆర్‌ఎస్‌లో ఉన్న ప్రతి మంత్రికి, ఎమ్మెల్యేకు, ఎంపీకి చెప్తా.. రెండునెలలకు ఒకసారైనా డీఎంతో మీటింగ్ పెట్టండి.. కార్మికులుండే సమయంలో మాట్లాడండి అని చెప్తా. ఎక్కడికక్కడ శక్తి సమకూర్చుకోవాలి. రేపే వారికి ఆదేశం ఇస్తా.

### ఆర్టీసీని అతిగా ప్రేమించేది నేనే

మొత్తం రాష్ట్రంలో ఆర్టీసీని అతిగా ప్రేమించేది ఎవరైనా ఉన్నారంటే అది నేనే. సంస్థ మునిగిపోవాలని అనుకుంట లేను. హైదరాబాద్ సిటీలో 3800 బస్సులు నడపతారా? ఇవ్వాళ నేను పరేడ్‌గ్రౌండ్ నుంచి పోతుంటే 25 బస్సులు నిలబడి ఉన్నయి. ఒక్కో బస్సుల ఇద్దరు ముగ్గురు కంటే ఎక్కువలేరు. అంతగా ఎందుకు నడపాలి? ఉదయం, సాయంత్రం ఎక్కువ అవసరం ఉంటది. హైదరాబాద్‌లో కిలోమీటరుకు రూ.16నష్టం. ముంబైలో కూడా లేవు 3800 బస్సులు. అధికారులు లెక్క చెప్తితే నేనే ఆశ్చర్యపోయిన. హైదరాబాద్‌లో వచ్చే నష్టం ఇతర అన్ని జిల్లాల్లో ఇచ్చే నష్టంతో పోలిస్తే 58% ఎక్కువ. ఎల్లమ్మ కూడబెట్టుకవస్తే మల్లమ్మ మాయం చేసినట్లు! మీ దగ్గరే మునుగుతున్నది ఆర్టీసీ అని అప్పట్లో హైదరాబాద్ మున్సిపాలిటీ వాళ్లకు చెప్తే.. వాళ్లు ఒక సంవత్సరం రూ.330 కోట్లు ఇచ్చిన్రు. మళ్ల సంవత్సరం రూ.480 కోట్లు ఇవ్వాలని పెట్టిన్రు. రూట్లు ఎక్కడ నడిపించాలి? ఎక్కడ నడిపించవద్దనేది కండక్టర్లు, డ్రైవర్లను పరిగణనలోకి తీసుకొని నిర్ణయించండి. ఎట్ల లాభం రాదో నేను చూస్తా. సమ్మె సమయంలో నా దగ్గరికి మెదక్ టౌన్ నుంచి వచ్చిన్రు. ఆర్టీసీలో తాత్కాలిక సిబ్బంది బస్సులనిండ నింపుకొని వస్తరని చెప్పిండ్రు. ఆ పని మనం కూడా చెయ్యాలె. బస్సులు ఖాళీ పెట్టుకొని పోవడం నేరం. 70% ఓఆర్‌ను 80% చేయాలి. ఆ పట్టుపట్టాలి. అది మీతోనే సాధ్యమయితది. మనిషి కనపడితే వస్తావా అని అడగాలి. ఆటోలతో పోటీ పడుతలేరు మీరు. ప్రయాణికులను సంపాదించుకోవడంలో పోటీపడాలి.



సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి వివాహానికి హాజరై శుభాశీస్సులు అందజేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, నవీన్‌కుమార్ కూడా ఉన్నారు.



సికింద్రాబాద్ సిఖ్‌విలేజీలో ఎమ్మెల్యే రేఖానాయక్ కుమార్తె వివాహానికి హాజరై ఆశీర్వదిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంపీలు కే కేశవరావు, సంతోష్‌కుమార్, మాలోత్ కవిత, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, హరిప్రియ, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ కూడా ఉన్నారు.



కొంపల్లిలోని ఆర్డీ కన్వెన్షన్ సెంటర్లో చీటి నర్సింగ్‌రావు కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం కేసీఆర్ దంపతులు. చిత్రంలో కే జానారెడ్డి, షబ్బీర్‌అలీ ఉన్నారు.



# ఆర్టీసీ సంబురం

- సీఎం కేసీఆర్ నిర్ణయాలపై హర్షం
- మనసున్న మారాజంటూ నినాదాలు
- డిపోల వద్ద పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్న కార్మికులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:**

సీఎం కేసీఆర్ వరాల జల్లులు కురిపించడంతో ఆర్టీసీలో సంబురాలు మిన్నంటాయి. అడగని వరాలిచ్చిన సీఎం కేసీఆర్ నిర్ణయాలపై ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50 వేల మంది కార్మికులు సంబురాల్లో మునిగితేలారు. ప్రతినిధులుగా ప్రగతిభవన్‌కు వచ్చిన 145 మంది కార్మికులు.. సీఎం కేసీఆర్ ఆప్యాయంగా పలుకరించిన తీరు, ఇచ్చిన హామీలు, చర్చలు తదితర వివరాలను సహచరులకు తెలియచేయడంతో ఆనందం వ్యక్తంచేశారు. తమకు ముఖ్యమంత్రిని కలువడం, ఆర్టీసీ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా కండక్టర్లు, డ్రైవర్లతో కలిసి సహపంక్తి భోజనంచేయడం వంటి అనుభూతులను పంచుకున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలతో అన్ని డిపోలతోపాటు బస్‌భవన్ పరిసరాల్లో ఉద్యోగులు స్వీట్లు పంచుకొన్నారు. పరస్పరం ఆలింగనం చేసుకొని ఆనందం వ్యక్తంచేశారు. కొన్ని డిపోల వద్ద పటాకులు కాల్చారు. మనసున్న మారాజు కేసీఆర్, సీఎం కేసీఆర్ జిందాబాద్ నినాదాలతో డిపోలు మారుమ్రోగాయి. మానవతా వాది అంటూ కేసీఆర్‌ను కీర్తించారు. ఆర్టీసీ చరిత్రలో ఇంత ఉదారంగా వరాలు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రంటూ కార్మికులు కొనియాడారు.



సీఎం కేసీఆర్‌తో సమావేశం అనంతరం సంతోషంగా ఇండ్లకు బయల్దేరిన ఆర్టీసీ ఉద్యోగులు

### జీవితాంతం రుణపడి ఉంటాం



సీఎం కేసీఆర్ మహిళా ఉద్యోగులకు వరాల జల్లు కురిపించడం ఆనందంగా ఉన్నది. రాత్రి 8 గంటల్లోపే విధులు ముగించాలనే నిబంధన బాగుంది. ప్రసూతి సెలవులు పెంచడం ప్రశంసనీయం. సీఎం కేసీఆర్ సార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

**– సునీత, నల్లగొండ డిపో కండక్టర్**

### లాభాల బాట పట్టిస్తాం



మా కష్టాలు గుర్తించి సమస్యను పరిష్కరించిన సీఎం కేసీఆర్‌కు కార్మికులు రుణపడి ఉంటారు. సమ్మె కాలానికి వేతనాలు చెల్లిస్తానని, పీఎఫ్, సీసీఎస్ డబ్బులు చెల్లిస్తానని చెప్పడం హర్షణీయం. ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చేందుకు శాయశక్తులా కృషిచేస్తాం. మాకు న్యాయంచేసిన సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోలేనిది.

**– కే కృష్ణ, కల్వకుర్తి డిపో కార్మికుడు, నాగర్‌కర్నూల్ జిల్లా**

### వరాలతో కొంగు నింపారు



మహిళా కండక్టర్లను సీఎం కేసీఆర్ బిడ్డల్లా అక్కునచేర్చుకున్నారు. ఎంతో భయంతో ప్రగతిభవన్‌కు వెళ్తే అడబిడ్డలకు వరాలతో కొంగు నింపి సాగనంపారు. మా సంరక్షణ కోసం చేసిన ప్రతిపాదనలు ఎంతో భావోద్వేగానికిలోనుచేశాయి. మహిళా ఉద్యోగులకు ఖాకీ డ్రెస్ తొలిగించి ఇష్టమైన దుస్తులు వేసుకొనే వెసులుబాటు కల్పిస్తాననడం అభినందనీయం.

**– జీ మంజుల, మెట్‌పల్లి డిపో కండక్టర్**

### కనిపించే దేవుడు సీఎం కేసీఆర్



కనిపించే దేవుడు సీఎం కేసీఆర్ సార్. ఆర్టీసీ కార్మికులపై తనకున్న అభిమానాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. అడగకముందే 21 వరాలు ఇచ్చిన సీఎం సార్‌కు రుణపడి ఉంటాం. సీఎం సార్‌ను ఎన్నో మాటలు అన్నాం. పెద్దన్నగా మా తప్పులు మన్నించి వరాలు ఇచ్చి అక్కున చేర్చుకున్నారు.

**– ఆర్ పూల, కోరుట్ల డిపో కండక్టర్**

### మహిళా కార్మికులకు గుర్తింపు



గతం సీఎంలు, మంత్రులు ఆర్టీసీ మహిళా ఉద్యోగుల సమస్యలు తీర్చేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదు. కానీ సీఎం కేసీఆర్ మా సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటించడంతోపాటు ప్రత్యేక వసతులు కల్పిస్తామని అనడం సంతోషం కలిగింది. మాకు వరాలిచ్చిన కేసీఆర్‌పై పూర్తి నమ్మకం కలిగింది.

**– శ్రీలత, సూర్యాపేట డిపో కండక్టర్**

### సీఎం కేసీఆర్ నిర్ణయం చరిత్రాత్మకం



ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు తెలుసుకొని.. వాటిని తీర్చేందుకు తీసుకున్న నిర్ణయాలు చరిత్రాత్మకం. గతంలో ఏ సీఎం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం గురించి ఇంతగా పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ మాత్రం ఉద్యోగ విరమణ వయస్సును 60 ఏండ్లకు పెంచడం మాకు ఎంతో సంతోషానిచ్చింది.

**–యాదయ్య, నల్లగొండ డిపో డ్రైవర్**

### మంచితనానికి నిదర్శనం



ఆర్టీసీ కార్మికులు తన బిడ్డలని చెప్పిన సీఎం కేసీఆర్.. ఆర్టీసీ, కార్మికుల అభివృద్ధికి పలు వరాలు ప్రకటించడం సంతోషంగా ఉన్నది. ప్రసూతి సెలవులను ప్రకటించడంతోపాటు బస్టాండ్‌లో మౌలిక వసతులు, రాత్రి 8 గంటల వరకే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవడం కేసీఆర్ మంచితనానికి నిదర్శనం.

**– సీతమ్మ, షాద్‌నగర్ డిపో కండక్టర్**

### న్యాయంచేశారు



అడగని వాటిని కూడా ఇచ్చి సీఎం కేసీఆర్ ఆర్టీసీ ఉద్యోగుల గుండెల్లో నిలిచిపోయారు. మా పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించిన సీఎం కేసీఆర్‌కు రుణ పడి ఉంటాం. సర్వీసును పెంచడం, ఉద్యోగ భద్రత కల్పించి, సంస్థను ప్రైవేట్ పరం చేయనని హామీ ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. అంకిత భావంతో పనిచేసి సంస్థను లాబాల బాటలో నడిపించి సీఎం కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇస్తాం.

**– డీవీ రెడ్డి, హయత్‌నగర్ డిపో–1 డ్రైవర్**


### కుటుంబాలకు భరోసా



మా ఉద్యోగాలు తీసేస్తాం అనే పరిస్థితి పోయి మాకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగులకు భద్రత కల్పిస్తామనడం అయన ఉదారతకు నిదర్శనం. భద్రతతో 50 వేల మంది ఆర్టీసీ కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపడంతో ఆయన మాకు దేవుడయ్యారు. ఇలాంటి నేతలు మనకు ఎంతో అవసరం.

**– సుధాకర్, సూర్యాపేట డిపో డ్రైవర్**

### ఆర్టీసీకి నిజమైన పండుగ



ఆర్టీసీకి నిజంగా పండుగరోజు. ఆర్టీసీ చరిత్రలో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం గొప్పమలుపు. మరణించినవారి కుటుంబాలకు పెద్దదిక్కుగా ఆదుకోవడమే కాకుండా సంస్థలో పనిచేసే ప్రతి ఒక్కరికీ నేను కార్మికుడిని కాదు ఉద్యోగిని అన్న భరోసా ఇచ్చారు. కార్మికవర్గ పక్షపాతి అని నిరూపించుకున్న గొప్ప దార్శనికుడు సీఎం కేసీఆర్. మనసున్న మహరాజు.

**– ఈఎస్ బాబు, వరంగల్**

### మా జీవితాల్లో వెలుగులు నింపారు



కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడు సీఎం కేసీఆర్. కోర్టు చేతులెత్తేసినప్పుడు ఎంతో మం ది కార్మికులు ఆత్మహత్యలకు పా ల్పడ్డారు. సీఎం కేసీఆర్ నిర్ణయం వల్ల కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయి. చనిపోయిన వారి కార్మికుల కుటుంబాలకు కూడా భరోసా కల్పించిన దేవుడు సీఎం కేసీఆర్ సార్.

**– ఎం లలిత, వరంగల్–1 డిపో కండక్టర్**



ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి భోజనం చేస్తూ వారు చెప్తున్న మాటలు వింటున్న సీఎం కేసీఆర్

## ఆప్యాయంగా పలకరింపు.. కొసరికొసరి వడ్డింపు

- ఉద్యోగులతో సీఎం కేసీఆర్ భోజనం
- సమస్యలు సీఎం దృష్టికి తెచ్చిన ఉద్యోగులు
- ఆత్మీయ సమావేశంతో సందడిగా ప్రగతిభవన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ ఆహ్వానంతో మొత్తం 97 డిపోల నుంచి దాదాపు 500 మంది ఉద్యోగులు, ఇతర అధికారులు ఆదివారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌కు చేరుకున్నారు. వారిని ఆప్యాయంగా పలుకరించిన సీఎం కేసీఆర్.. వారి పేర్లు.. ఏ డిపో నుంచి వచ్చారు.. వంటి విషయాలతోపాటు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనంచేస్తూ ముచ్చటించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, టాయిలెట్స్, రాత్రిళ్లు డ్యూటీలు వంటి సమస్యలను మహిళా ఉద్యోగులు సీఎంకు వివరించారు. ఈ చిన్న సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదని సీఎం అనడంతో.. అధికారులు పట్టించుకోవడంలేదని ఉద్యోగులు చెప్పారు. ఈ విషయాలను సమావేశంలో ప్రస్తావించి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. వివిధ డిపోల ఉద్యోగులు కూడా తమ ఇబ్బందులను సీఎంకు తెలిపారు.

### సీఎం కేసీఆర్‌తో కరచాలనం

భోజనానికి ముందు, తర్వాత సీఎం కేసీఆర్‌తో కరచాలనం చేసేందుకు ఉద్యోగులు ఉత్సాహం చూపారు. సీఎంతో ఫొటోలు దిగారు. ప్రయాణికులు టికెట్లు తీసుకోకుంటే అధికారులు తమను వేధిస్తున్నారని తెలిపారు. విడిభాగాలు అందుబాటులో ఉండక రిపేర్లు చేయలేకపోతున్నామని పలువురు మెకానిక్‌లు చెప్పారు.

### కార్మికులకు కొసరి కొసరి వడ్డింపు

భోజనాల సందర్భంగా ఉద్యోగులకు సీఎం కేసీఆర్ కొసరికొసరి వడ్డించారు. 'దూరం నుంచి వచ్చారు. ఏమి తిన్నారో లేదో.. మంచిగా భోజనం చేయండి' అని కోరారు. తినడానికి సిద్ధం చేసిన వంటలను చూపిస్తూ కడుపునిండా తినాలన్నారు. శాఖాహారంతోపాటు.. మాంసాహారం కూడా ఏర్పాటుచేశారు. మటన్, చికెన్, చేపలు, గుడ్లు వడ్డించారు. ప్రత్యేకంగా తయారుచేయించిన స్వీట్లను అందజేశారు.

## నేటి అర్ధరాత్రి నుంచి పెరుగనున్న బస్సు చార్జీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు పెరుగనున్నాయి. తెలంగాణ మంత్రివర్గ నిర్ణయం ప్రకారం ఏసీ, నాన్–ఏసీ, సూపర్ లగ్జరీ, లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సహా అన్నిరకాల బస్సుల్లో చార్జీలను పెంచనున్నట్టు తెలుస్తున్నది. కొత్త చార్జీల చార్టును ఇప్పటికే రూపొందించామని, సోమవారం దీనిని విడుదలచేస్తామని ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. నష్టాలతో సతమతమవుతున్న ఆర్టీసీని లాభాలబాట పట్టించేందుకు చేపడుతున్న చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగేండ్ల తర్వాత బస్సు చార్జీల పెంపునకు నిర్ణయించింది. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ ఇప్పటికే స్వయంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

## సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారు

- ఆర్టీసీ ఉద్యోగులతో సమావేశం ప్రశంసనీయం
- టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమస్యలు లేని ఆర్టీసీగా ఉండాలనే లక్ష్యంతో సంస్థలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తున్న సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని, సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చరిత్రలో లేని విధంగా ఆర్టీసీ ఉద్యోగులతో సమావేశం కావడం ప్రశంసనీయమని, ఇది సీఎం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమన్నారు. మహిళా ఉద్యోగులకు భద్రత, సంక్షేమంకోసం నిర్ణయాలు తీసుకున్నందుకు హర్షం వ్యక్తంచేశారు. ఆర్టీసీ ప్రభుత్వరంగంలో ఉంటుందని ప్రకటించడం ఉద్యోగుల స్నేహపూర్వక నిర్ణయాలకు నిదర్శనమని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులు కూడా ఆక్యుపెన్సీ రేషియో రేట్ (ఓఆర్ఆర్) పెంచాలని, సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు.

### సీఎం కేసీఆర్ నిర్ణయాలు హర్షణీయం





ఆర్టీసీ కార్మికులను ఉద్యోగులుగా చూస్తామని సీఎం కేసీఆర్ చెప్పడం హర్షణీయమని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, కార్యదర్శి మామిళ్ల రాజేందర్ ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తంచేశారు. ఉద్యోగులతో సమానంగా హక్కులు కల్పించడమే కాకుండా సమాజంలో ఒక గౌరవస్థానం కల్పిస్తానని కార్మికులకు హామీ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల పట్ల సీఎం కేసీఆర్ చూపిన ఔదార్యంతో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం ఏర్పడిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించినందుకు గ్రూప్–1 ఆఫీసర్స్ జనరల్ సెక్రటరీ హన్మంత్‌నాయక్, తెలంగాణ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మునగాల మనిపాల్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

### అక్కునచేర్చుకున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



ఆర్టీసీ కార్మికుల పట్ల సీఎం కేసీఆర్ చూపిన చొరవ అభినందనీయమని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పద్మాచారి, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులను అక్కునచేర్చుకున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ అభివృద్ధికి కార్మికులు కృషిచేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.





నాగర్‌కర్నూల్‌లో జరిగిన సామూహిక వివాహాల్లో తలంబ్రాలు పోసుకొంటున్న వధూవరులు.. హాజరై ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా ఉన్నారు.

## 'మర్రి' సామాజిక సేవ ప్రశంసనీయం

- రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు
- వైభవంగా 165 జంటలకు సామూహిక వివాహాలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సేవకు.. అధికారం, పదవులతో పనిలేదని, మంచి మనస్సుంటేచాలని నిరూపించిన గొప్ప మనిషి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అని రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు ప్రశంసించారు. ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ధనికుల ఇండ్లల్లో మాదిరిగా పేద జంటలకు సామూహిక వివాహాలు జరిపిస్తూ సామాజిక సేవచేయడం మెచ్చుకోదగ్గ విషయమని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్‌లోని జెడ్పీ మైదానంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 165 జంటలకు వైభవంగా సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి నూతన వధూవరులను ఆశీర్వదించి ప్రసంగించారు. యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆశీస్సులతో 165 జంటలకు నాలుగురోజులపాటు వివాహాలు జరిపించడం అభినందనీయమన్నారు. నవదంపతులకు కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116 విలువ చేసే చెక్కులు అందించడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెండ్లిల కోసం పడుతున్న కష్టాలను చిన్నప్పటి నుంచే చూశానని, తాను పుట్టిన గడ్డలోని పేదలకు ఆ కష్టాలు ఉండకూడదనే ఉద్దేశంతో గతంలో 321 జంటలకు వివాహాలు జరిపించానని, ఇప్పుడు 165 జంటలకు వివాహాలు చేయించారని చెప్పారు. ఈ సందర్భంగా వేల మందికి విందు భోజనం వడ్డించారు. నవదంపతులతో కలిసి ఎమ్మెల్యే మర్రి, ఆయన సతీమణి జమున, సోదరుడు వెంకట్‌రెడ్డి, మధుమతి, జక్కా రఘునందన్‌రెడ్డి భోజనం చేశారు. ఒక్కొక్కరికి రూ.లక్ష విలువైన సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పీ రాములు, ప్రభుత్వ విప్‌లు బాలరాజు, దామోదర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్లు పద్మావతి, స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, రాజేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సంగీత, నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్, మాజీ ఎంపీ మందా జగన్నాథం, జేసీ శ్రీనివాస్‌రెడ్డి, యాదాద్రి ఈవో గీత తదితరులు పాల్గొన్నారు.

## చెరువులకు పూర్వవైభవం తెచ్చాం

- ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు ఉద్ఘాటన
- సిద్దిపేట కోమటి చెరువుపై సస్పెన్షన్ బ్రిడ్జి ప్రారంభం



విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న సిద్దిపేట కోమటి చెరువుపై నిర్మించిన సస్పెన్షన్ బ్రిడ్జి

**సిద్దిపేట కలెక్టరేట్:** సమైక్య రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన తెలంగాణలోని చెరువులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పూర్వవైభవాన్ని తీసుకొచ్చామని, 'మిషన్ కాకతీయ' పథకంతో వీటిని అభివృద్ధిపర్చుకొన్నామని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ముందుకుసాగుతున్నదని తెలిపారు. ఆదివారం సిద్దిపేట కోమటి చెరువుపై రూ.6 కోట్లతో నిర్మించిన సస్పెన్షన్ బ్రిడ్జితోపాటు అడ్వెంచర్‌పార్కులోని పార్కింగ్, ఫ్లాపీ బ్యారియర్, ప్రభుత్వ వైద్యకళాశాల బోధనాసుపత్రి వద్ద ఆపిల్‌హోం 'ఫీడ్ ద నీడ్' కేంద్రం, ఎన్సాన్‌పల్లి రింగ్‌రోడ్డులో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ సీఎంగా ఉండడం వల్లే కోమటి చెరువు అభివృద్ధి సాధ్యమైందన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలోని చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధిచేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు.



సస్పెన్షన్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్

### కులవృత్తులకు చేయూత: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కులవృత్తులు బాగుపడితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందుకే టీఆర్ఎస్ ప్రభుత్వం కులవృత్తులకు చేయూతనిస్తున్నదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. ఎమ్మెల్సీలు ఫారూఖ్‌హుస్సేన్, రఘోత్తంరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు భూపతిరెడ్డి, రాజేశం గౌడ్, పర్యాటకశాక ఎండీ మనోహర్, జేసీ పద్మాకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


MSME TOOL ROOM, HYDERABAD
CENTRAL INSTITUTE OF TOOL DESIGN
(A Government of India Society, Ministry of MSME)
Balanagar, Hyderabad, PIN-500037

Admission Notice
Free Course for SC / ST Candidates
under
National SC / ST Hub Scheme

Applications are invited on first come first serve basis from intending SC/ST candidates for admission into following courses on repair and maintenance of SAMSUNG products in SAMSUNG Technical School.

| S.No. | Course | Duration | Intake | Eligibility |
|---|---|---|---|---|
| 1. | Tablets, Feature Phones, Smart Phones | 03 months | 25 | ITI, 10+2, Bachelor Degree, Diploma in Engineering, B.E./B.Tech |
| 2. | LED, LCD, Plasma TV, Home Theatre, DVD, Blu-ray Players | 03 months | 25 | |
| 3. | Refrigerators, Room Air Conditioners, Washing Machines and Microwave Ovens | 04 months | 25 | |

- Accommodation & Food will be provided in CITD campus at no cost.
- Trainees who complete the course successfully will be provided with Placement Assistance.
- Intending and interested candidates for admission shall visit Room No. 105,Diploma Block with original Educational Certificates, Aadhar Card, Caste Certificate, Two Passport Size Photograph on or before 07th December, 2019.

Contact Details : Phone No.- 9652119499, 8074067459
E-Mail-adminltrg@citdindia.org,Website-www.citdindia.org

Sd/-
PRINCIPAL DIRECTOR

# చెలిమె

కరీంనగర్ 4 నమస్తే తెలంగాణ
సోమవారం 2 డిసెంబర్ 2019


## వెన్నెలకు పొద్దెక్కడిది!

**తోడేళ్లను కప్పుకున్న తోవలో**
వెన్నెలకు పొద్దెక్కడిది
చిట్టితల్లికి నవ్వెక్కడిది
తోవెప్పుడు దుఃఖమే!

రాతి మనుషులున్న దేశంలో
రాళ్ళకు పూజలున్నయి గాని
స్త్రీలకు గౌరవాలెక్కడివి?
చట్టాలు కొవ్వున్నోళ్ళ పూలదండలై

నిందితులకు హారతులిస్తున్న కాలంలో
నిర్భయలకు న్యాయం ఎండమావే!

అమ్మకు.. అక్కకు.. తల్లికి.. చెల్లికి...
పెద్దమ్మకు.. చిన్నమ్మకు..
అమ్మమ్మకు, నాయినమ్మకు.. తేడాలు లేని తోవల
బాటసారికి భద్రతుంటదా!
బతుకుకు అవకాశముంటదా..!

తోవలో.. పూలకోసం
మదమెక్కిన పురుగులు రెప్పలార్పకుండా
సొంగకార్చుతున్నవి!
భర్త చాటునున్నా..

భూగోళం చాటునున్నా..
భల్లున భూమర్‌లా నమిలి తుపుక్కున
ఉమ్మిచ్చే మందబలం ఉన్న తోవలో
బంతిపూలు రెక్కలు విచ్చుకోవు!

అమ్మలు నడుస్తున్న చోట
మాటుగాసే అగంతకులు..
తోటి మనిషే కదాని నమ్మకమున్న చోట
విచ్చుకునే కత్తుల అంగాలు..
తెరుచుకునే మృత్యుద్వారాలు

సముద్రంలో అలలకు.. తోటలో పూలకు..
పందిరిలో తీగలకు లేదు నీడ!

గుడి, బడి, బస్సు, రైలు రహదారులు
అత్యాచార హత్యల తోవ!

తోవ దారి తప్పుతున్నది
మానవత్వం మురిగిపోతున్నది
కూరాడు మాసిపోతున్నది
రేపు అమ్మా అనే పిలుపుండదు
అక్క అనే బంధముండదు
స్నేహాల అనుబంధాలుండవు... !

**– వనపట్ల సుబ్బయ్య, 94927 65358**

**(ప్రియాంక రెడ్డికి కన్నీటితో..)**

తెలంగాణ కవులలో 'అచ్చు' కవులు కొందరైతే 'అల్లి'కవులు కొందరు. జానపదానికి అల్లిక కవులే ప్రధానం. అపారమైన భక్తి అనితర సాధ్యమైన కవితాశక్తి వెరసి అశుగంగగా వెలుగొందిన జానపద కవి బ్రహ్మ కీ|| శే|| మామిండ్ల సాయిలు పాలకుర్తి వాస్తవ్యులే. పాలకుర్తి క్షేత్ర ప్రాశస్త్యాన్ని చాటుతూ ముప్పై ఏండ్ల క్రితమే మామిం డ్ల సాయిలు 'శ్రీ పాలకుర్తి సోమేశ్వర స్వామి కుసుమాంజలి' పేరుతో పలు భక్తి గీతాలను రాసి పుస్తకంగా వెలువరించారు.

# పాలకుర్తి క్షేత్ర సాహిత్యచరిత్ర

**తెలుగు** సాహిత్య చరిత్రలో జనగామ ప్రాంతంలోని పాలకుర్తికి ఒక ప్రత్యేక చరిత్ర సంస్కృతి ఉన్నది. తిరుగుబాటు తత్త్వం అంత ర్లీనంగా ఉంటూ ఇక్కడ సాహితీ స్రవంతి సజీవమై ప్రవహిస్తున్నది. క్రీ.శ.1124 నాటి గూడూరు శాసనం తెలంగాణ శాసనాలలో ప్రముఖమైనది. కన్నడ, తెలుగు భాషలు మణిప్రవాళశైలిలో సాగిన పద్య రచనకు ఇది తార్కాణం. స్థానిక మల్లేశ్వర స్వామి ధూపదీప నైవేద్యాలకై పక్కనున్న 'బమ్మెర'ను మదిర గ్రామంగా దానం చేసినట్లు ఈ శాసనంలో ఉన్నది. కాలక్రమేణా వచ్చిన పరిణామాల మూలంగా నన్నయ్య నుంచి సంప్రదాయ బద్ధంగా వస్తున్న మార్గ కవితను కాదని దేశి కవితకు పట్టం గట్టిన ప్రజాకవి పాల్కుర్కి సోమనాథుడు. పన్నెండో శతాబ్దిలోన 21వ శతాబ్ది ఆశయాలను, ఆదర్శాలను ప్రవచించిన ప్రవర్తకుడు పాల్కుర్కి 'ద్విపద' ఛందస్సులో ప్రజలు పాడుకునే రీతిలో బసవపురాణం, పండితారాధ్య చరిత్ర వంటి ఉద్గ్రంథాలు రచించాడు. శతకం, ఉదాహరణం వంటి ఎన్నో ప్రక్రియలకు పుట్టినిల్లు తెలంగాణ. సోమనాథునికి గల బహుభాషా పాండిత్యం, అబ్బురం, అపూర్వం. సీస పద్య రచనలో శ్రీనాథునికే మార్గదర్శి. అంతటి ప్రతిభా సంపన్నుడు. వస్తువు, భాష, ఛందస్సులలో సోమనాథునిది ఉద్యమ పంథా. ఆ రకంగా దేశి కవిత్వోద్యమానికి ప్రారంభకుడు పాల్కుర్కి.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అని పేరొందిన భాగవతాన్ని తెనిగించిన పోతన ఇక్కడి బమ్మెరలో జన్మించాడు. అందుకే బమ్మెర పోతనగా నిలిచాడు. వీరభద్ర విజయం, భోగినీదండకం, భాగవతం, నారాయణ శతకం పోతన రచనలు. రాజులను 'ఇమ్మనుజేశ్వరాధముల్' అనడం, 'ధనమదాంధుల కొలువేల తాపసులకు' అనడం ఇవన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని పట్టిచూపుతాయి. పోతన పద్య పాదాలకు పాదాలే లోకుల నోళ్లలో జాతీయాలుగా, సామెతలుగా చోటు చేసుకున్నాయి. పోతన జన్మస్థలమైన బమ్మెరను సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి తెలంగాణ ప్రభుత్వ కంకణబద్ధమైంది. ముఖ్యమంత్రి స్వయంగా బమ్మెరను సందర్శించారు. పోతన ఆనవాళ్ళను భద్రపరుచాల్సిన అవసరం ఉన్నది.

తెలంగాణ కవులలో 'అచ్చు' కవులు కొందరైతే 'అల్లి'కవులు కొందరు. జానపదానికి అల్లిక కవులే ప్రధానం. అపారమైన భక్తి అనితర సాధ్యమైన కవితాశక్తి వెరసి అశుగంగగా వెలుగొందిన జానపద కవి బ్రహ్మ కీ||శే|| మామిండ్ల సాయిలు పాలకుర్తి వాస్తవ్యులే. పాలకుర్తి క్షేత్ర ప్రాశస్త్యాన్ని చాటుతూ ముప్పై ఏండ్ల క్రితమే మామిండ్ల సాయిలు 'శ్రీ పాలకుర్తి సోమేశ్వర స్వామి కుసుమాంజలి' పేరుతో పలు భక్తి గీతాలను రాసి పుస్తకంగా వెలువరించారు. సాయిలు కేవలం భక్తిగీతాలనే కాక, అక్షరాస్యత, కుటుంబ నియంత్రణ, మద్యపాన నిషేధం ఆవశ్యకత తదితర సామాజిక అంశాలపై కూడా పద్యాలు, పాటలు రాశారు.

విద్యార్థి దశలోనే కవితా రచనకు శ్రీకారం చుట్టి భక్తజనుల ఇలవేల్పయిన సోమేశ్వర స్వామిని స్తుతిస్తూ ప్రముఖ ఫార్మసిస్టు సాహితీమూర్తి డాక్టర్ రాపోలు సత్యనారాయణ 'డమరుక లయ' పేరుతో భక్తి శతకాన్ని రచించి వెలువరించారు. మహాకవి పాల్కురికి సోమనాథుని భావజాలాన్ని వ్యాప్తి చేయడానికై 1992లో 'సోమనాథ కళాపీఠాన్ని' స్థాపించి సాహిత్య సేవ చేస్తున్నారు. సోమనాథ సంబంధితంగా కృషిచేసినవారికి పాతికేళ్లుగా పురస్కారాలు అందజేస్తున్నారు. 'రసన' కాలం పేరుతో రాపోలు సత్యనారాయణ వివిధ పత్రికల్లో పలు వ్యాసాలు, కవితలు రాశారు. వృత్తి వైద్యరంగమైనా, ప్రవృత్తి సాహిత్యంగా చేసుకొని పురోగమిస్తున్న కవి పుంగవుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ.

> **'విద్యావతాం భాగవతే పరీక్షా' అని పేరొందిన భాగవతాన్ని తెనిగించిన పోతన ఇక్కడి బమ్మెరలో జన్మించాడు. అందుకే బమ్మెర పోతనగా నిలిచాడు. వీరభద్ర విజయం, భోగినీదండకం, భాగవ తం, నారాయణ శతకం పోతన రచనలు. రాజులను 'ఇమ్మనుజేశ్వరాధముల్' అనడం, 'ధనమదాంధుల కొలువేల తాపసులకు' అన డం ఇవన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని పట్టిచూపుతాయి. పోతన పద్య పాదాలకు పాదాలే లోకుల నోళ్లలో జాతీయాలుగా, సామెతలుగా చోటు చేసుకున్నాయి.**

హిందీ విశారదులైనా మాతృభాషాభిమానాన్ని విడువకుండా మహాకవి సోమనాథుని జన్మస్థలంలో జన్మించిన పెనుగొండ సుదర్శనం గారు 1981లో పాలకుర్తి గ్రామంలో 'శ్రీ పాల్కుర్కి సోమన సాహితీ సదస్సులు నిర్వహించారు. వ్యాసకర్తగా, చతుర సంభాషణా దురంధరులుగా పేరొందిన సుదర్శనం గారు హఠాత్తుగా కన్ను మూయడంతో సంస్థ కార్యక్రమాలు స్తంభించాయి. తెలంగాణ పట్ల, తెలంగాణ కవుల పట్ల వివక్ష ఉన్న కాలంలోనే ఆయన సోమనాథ స్మారక సాహితీ భవనాన్ని నిర్మింపజేయడం చరిత్రాత్మకమైనది. వీరి కుమారుడు పెనుగొండ బసవేశ్వర్ జీవిత బీమా సంస్థలో ఉద్యోగిస్తూ కవితలు, కథలు రాస్తున్నారు. తెరవే తరపున కరీంనగర్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పెనుగొండ బసవేశ్వర్ 'ఆకాశమంత పావురం' అనే పేర తన కవితా సంపుటిని వెలువరించగా ఆయన శ్రీమతి పెనుగొండ సరసిజ 'కాగితాన్ని ముద్దాడిన కల' పేర మంచి కవితా సంపుటిని వెలువరించారు. భార్యాభర్తలిరువురు పరస్పర ప్రేరితులై ఉత్తమ కవితా సంపుటులను వెలువరించటం అభినందనీయం.

గూడూరు గ్రామ వాస్తవ్యులైన ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య 'ఇంటి భాష' పేరుతో ప్రత్యేకంగా పుస్తకాన్ని వెలువరించారు. ఇదే గ్రామానికి చెందిన యల్లంభట్ల నాగయ్య ఆర్ఎస్.సుదర్శనం నవలలపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో ఉపన్యాసకులుగా, ప్రధానాచార్యులుగా పనిచేసి ఇటీవలనే పదవీ విరమణ చేశారు. డాక్టర్ యల్లంభట్ల నాగయ్య సంపాదకత్వంలో వెలువడిన గ్రంథాలు సాహిత్యరంగంలో ప్రామాణికమైనవి. సామాజిక న్యాయాన్ని సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభంజన్ కుమార్ వివిధ పత్రికల్లో పలు వ్యాసాలు, పుస్తకాలు రాశారు. 'ప్రభంజన పథం' వీరి వ్యాస సంపుటి. పాలకుర్తి మండలం మల్లంపలి గ్రామానికి చెందిన సాహితీకారుడు వ్యాసకర్త శ్రీనివాస్ 'తత్త్వ' పరుతో గతనెలలో కవితా సంపుటిని వెలువరించారు. శ్రీనివాస్ వ్యాసాలు భావగర్భితమైనవి, సిద్ధాంతపరమైనవి. ఆయన అధ్యయనం, అవగాహన లోతైనవి. ఇదే గ్రామానికి చెందిన జిలుకర వెంకన్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దర్గ్యానాయక్ జీవిత చరిత్రను వెలువరించారు. పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన యువ జర్నలిస్టు, కవి, రచయిత మామిండ్ల రమేశ్ రాజా. సృజనశీలం, పరిశోధన తత్వం, విశ్లేషణ నైపుణ్యం పుష్కలంగా కలిగిన రమేశ్ రాజా 'వికసించిన మందారా లు' పేరుతో అభ్యుదయ కవితా సంపుటిని వెలువరించారు. అలాగే తెలంగాణ వీర వనిత 'చాకలి ఐలమ్మ' జీవిత చరిత్రను సాధికారికంగా రచించి సమాజానికి అందించాడు. వివిధ పత్రికలలో పలు సామాజిక వ్యాసాలు రాశాడు. నమ్మిన సిద్ధాంతాల విషయంలో రాజీ పడని వ్యక్తిత్వంతో రచనలు చేస్తున్నాడు.

పాలకుర్తి గ్రామానికే చెందిన వీరమనేని చలపతిరావు సోమన–పోతన గురించి వివిధ పత్రికల్లో పలు వ్యాసాలు రాశారు. రెవెన్యూ శాఖలో అధికారిగా పనిచేసిన చలపతిరావు ఇటీవలనే అస్తమించారు. జిల్లా కేంద్రమైన జనగామలో న్యాయవాదిగా వృత్తిని నిర్వహిస్తున్న ఇదే గ్రామానికి చెందిన గంగు నాగ రాజేశ్వరరావు గారు కూడా సామాజిక సంబంధమైన పద్యాలు రాశారు.

పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన నవోదయ అధ్యాపకుడు డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ శతకం, విమర్శ, జీవిత చరిత్ర, పరిశోధన కథ– తదితర ప్రక్రియలలో పది పుస్తకాలు వెలువరించారు. పాల్కుర్కి సోమనకు సంబంధించి వివిధ పత్రికల్లో యాభైకి పైగా వ్యాసాలు రాశారు. పాలకుర్తి, బమ్మెర గ్రామాలకు ప్రముఖ సాహితీవేత్తల్ని రప్పించి పలు సదస్సులు నిర్వహించి ఇక్కడి సాహిత్య చైతన్యానికి తోడ్పడినారు.

పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, నవలా రచయిత అంపశయ్య నవీన్ ఇప్పటివరకు ముప్పై నవలలు రాశారు. తాను రాసిన నవల పేరే నవీన్ ఇంటిపేరుగా మారింది. ఆయన రాసిన కాలరేఖలు చెదిరిన స్వప్నాలు, బాంధవ్యాలు ట్రైలాగ్ నవలలు. అంపశయ్య నవీన్ రాసిన 'కాలరేఖలు'నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. తెలుగు విశ్వవిద్యాలయం తరపున ఉత్తమ నవలా రచయితగా గోపిచంద్ జాతీయ సాహిత్య పురస్కారాన్ని రామినేని ఫౌండేషన్ వంటి ప్రముఖ సంస్థల పురస్కారాలను అందకున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో తన పుట్టినరోజున వర్ధమాన రచయితలకు పురస్కారాలు అందజేస్తున్నారు.అలాగే శాతాపురం గ్రామానికి చెందిన సి.రాఘవాచారి గారు ప్రముఖ పాత్రికేయులు. సుమారు 25 ఏండ్ల పాటు 'విశాలాంధ్ర' దిన పత్రికకు సంపాదకులుగా విధులు నిర్వహించారు. వందలాది వ్యాసాలు రాశారు. సామాజిక విశ్లేషకులుగా నడిచే గ్రంథాలయంగా వారు పేరొందారు.

దర్దేపల్లి గ్రామానికి చెందిన అన్నావఝుల మల్లికార్జున్ వరంగల్ జానపద విజ్ఞానపీఠంలో విధుల్ని నిర్వహించి జిల్లాలోని జానపద విజ్ఞానాన్ని సేకరించారు. విస్నూరు గ్రామాన్ని కేంద్రంగా తీసుకొని అక్కడి వివిధ సామాజిక వర్గాల ఆచారాలను, వ్యవహారాలను, సంస్కృతీ నాగరికతల్ని విశ్లేషిస్తూ 'విస్నూరు జానపద విజ్ఞాన అధ్యయనం' పేరున పీహెచ్‌డీ పరిశోధన గ్రంథాన్ని వెలువరించారు. అలాగే ఇమ్మడి వెంకటేశ్వర్లు, యల్లంభట్ల శేషయ్య వెంకటేశ్వర్లు, రమేష్‌లు వివిధ సందర్భాల్లో రచనలు చేశారు. ఇలా పాలకుర్తి క్షేత్ర సాహిత్య చరిత్ర దినదినాభివృద్ధి చెందుతున్నది.

**– డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**
**99891 48305**

## అమ్మ జ్ఞాపకం

**గదిలో మంచం అంచున**
కాళ్లూపుకుంటూ కూర్చునేది మా అమ్మ
అనుకొని కూర్చున్న నాకూ ఆమెకూ
ఒక సెంటిమీటరే ఎడం

బయట చల్లగా వుంది
తనకు మంచి మాటలే
చెప్పాలని తాపత్రయం
కాని ఆమె తన సంభాషణతో
యాభై యేండ్లు వెనక్కి తీసికెళ్లేది..
ఆ గది రైలు డబ్బాగా మారి
రివర్స్‌లో వెళ్తున్నట్టు స్ఫురణ!
మా మాటల్లో
నా బాల్యం
ఆమె కొత్త కాపురం కలిసి పోతుండేవి!
రెండూ కలిసిన ఓ వెచ్చదనం
గుండెను నిమురుతుండేది!

నేను బయటికి వెళ్లినప్పుడల్లా
తాను నా నొసలు వైపు చూస్తూ
'జాగ్రత్త' అనేమాట
ఆమె నోట ప్రతిసారీ కొత్తగానే వుండేది..


పసితనంలో నుదుటి గాయం మచ్చ సైజు
ఒక సెంటిమీటరే
ఆమె ప్రేమ మాత్రం అనంతం
ఓంకార నాదంలో కూడా..!

అప్పటినుంచి నాకు
ఓంకార నాదంలో కూడా
'జాగ్రత్త' అనే
మమకార శబ్దమే ధ్వనిస్తుంది...

**– డాక్టర్ ఎన్.గోపి**

### పుస్తకాలు


## యానాం కవితలు



శిఖామణి గారికి కవిత్వం అంటే ప్రేమ, జ్ఞాపకాల ఊట. పుట్టిన ఊరుమీద తనచుట్టూ అల్లుకున్న బాంధవ్యాల మీద అల్లుకున్న కవిత కలవరింత. తన మనోఫలకం నుంచి చెరిగిపోతున్న అనేక సందర్భాలను రంగురంగుల కవిత్వ దృశ్యాలుగా చూపిన 'యానాం కవితలు' సంపుటం ఇది..

**రచన: శిఖామణి, వెల: రూ.150**
**ప్రతులకు: ప్లాట్ నెం:61, ఫ్లాట్ నెం:10, సిద్ధార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్, వెంగల్‌రావు నగర్, హైదరాబాద్-38. ఫోన్:9848202526**


## స్త్రీవాద వివాదాలు



ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయా ధోరణులకు మధ్య, ఆయా ఉద్యమాలకు మధ్య రచయితలకు నడుమ ఆసక్తికరమైన వాదవివాదాలు, చర్చలు జరిగాయి. జరుగుతున్నాయి. అనేక నూతనాంశాలు, కొత్తకోణాలు వెలుగు చూస్తున్నాయి. ఆ క్రమంలో స్త్రీవాదం నేపథ్యంగా సాగిన చర్చలు, వాద వివాదాల సమాహారమే ఈ పుస్తకం.


**సంపాదకుడు:డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ, వెల: రూ.150, ప్రతులకు: తెలుగు విశ్వవిద్యాలయం, పుస్తక విక్రయశాల, నాంపల్లి, హైదరాబాద్. అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు**

## మహాభారతంలో.. ఇవి మీకు తెలుసా?



మహాభారతంలో మనకు తెలిసిన అనేక విషయాలతో పాటు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. ధార్మధర్మ సంశయాలున్నాయి. కొన్ని ముఖ్యమైన సన్నివేశాల్లో మన సందేహాలకు సమాధానాలు చెప్తుంది ఈ పుస్తకం.

**రచన:డాక్టర్ గుంజి వెంకటరత్నం, వెల: రూ. 100, ప్రతులకు: డాక్టర్ గుంజి వెంకటరత్నం, ఇంటి నెం:16-7-263, దయానందకాలనీ, వరంగల్, సెల్:9951907390**



**2019 జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత ప్రముఖ మలయాళీ కవి అక్కితం అచ్చుతన్ నంబూద్రి...**

## పలాయనవాది ప్రేమగీతం!

**నన్ను ఉన్న పళంగా ఇక్కడ్నించి తీస్కెళ్ళవా..**
ఓ నా అసలు సిసలు ప్రేయసీ
నన్ను ఒకానొక అజ్ఞాత తీరానికి తీస్కెళ్ళవా.. !?

అక్కడ దూర దేశాల పుష్పాల పరిమళం
గాలిలో తేలివస్తుంది
సాగరంలోని లేత నీలి కెరటాలు
తీరపు బాహువులలో ఓలలాడుతాయి
మన చిన్నారి పడవ సముద్రం మధ్యన లంగరేసి
ప్రశాంత నిశ్చల నిద్రలోకి జారుకుంటుంది
తల్గొగ్గని కాలపు స్వప్న లోకంలో
ఈ ప్రపంచమంతా సేద తీరుతుంది!

అక్కడ వింతైన సీతాకోకల్లాంటి కీటకాల గుంపు
తమ రెక్కలు టపటపలాడిస్తూ విహరిస్తూ ఉంటాయి
పచ్చిక బయళ్లపై, పూల పాన్పుపై, మహావృక్ష ఛాయలో
చూసే కళ్ళకు కొత్త అనుభూతిని అద్దుతుంటాయి
అలాంటి ఏకాంత ప్రదేశంలో నేను అలసిపోయి తనువు వాలుస్తాను
నా ఛాతీని కలల దుప్పటితో కప్పుకుంటాను!

అక్కడ నా ప్రియా, నీ తేలికైన మృదు హస్తాన్ని
నా గుండెలపై నెమ్మదిగా వేయి
తేనెలు నింపుకున్న నీ స్వరం
పదాలేవీ లేని
ఓ కొత్త అపరిచిత గీతాన్ని ఆలపించనీయి..!

అక్కడ ఓ మధుర అచేతన స్థితి
సున్నితంగా చెంపలను ముద్దాడి సంబరాలు చేస్తుంది
అక్కడికి మృత్యువు తరలి వస్తుంది
నా దేహాన్ని నూతన ధవళ వస్త్రాలతో చుట్టేసి
నన్ను శాశ్వత గాఢతలోకి తీసుకెళ్లడానికి..!
అక్కడి కేవల సంపూర్ణత నన్ను ఆసాంతం
ప్రవాహంలో కరిగించి కనుమరుగు చేస్తుంది..!

నా ప్రియ ప్రేయసీ..
నన్ను ఆ అజ్ఞాత అలౌకిక తీరానికి తీస్కెళ్ళవా..!?

**– మూలం: అక్కితం అచ్చుతన్ నంబూద్రి**
**స్వేచ్ఛానువాదం: మామిడి హరికృష్ణ, 80080 05231**

# చరిత్రలో ఖాళీల పూరణ!

History is the long struggle of man, by exerc-ise of his reason, to understand his environment and to act upon it.

– Edward Hallett Carr

నిన్నటిదాకా తెలంగాణ, మహాకవి దాశరథి అన్నట్లు 'కోటి రతనాల వీణ!' ఇప్పుడది 'సకల కళల ఖజానా'! సాంస్కృతిక శోభల నజరానా!! ఇంకా లోతుల్లోకి, చరిత్ర పొరల్లోకి, సాంస్కృతిక మూలాల్లోకి తొంగిచూస్తే నాకర్థమైన సత్యం 'తెలంగాణ–ఒక అక్షయ పాత్ర!'

చరిత్ర పరంగా, గత కాలపు వైభవ పరంగా మనం ఎంత కనుక్కున్నా, ఎన్ని నూతన అంశాలను వెల్లడి చేసినా, ఇంకా పుట్లుగా పుట్టుకువచ్చే ప్రదేశాలతో క్షయం అనేది లేకుండా అక్షయ చరిత్రను నిక్షిప్తం చేసుకున్న నేల తెలంగాణ. అందుకే చరిత్రపరంగా తెలంగాణ ఒక అక్షయపాత్ర !

తెలంగాణ మట్టి దొంతరలలో దాగి ఉన్న చరిత్రను వెలికి తీసే చరిత్రకారులు ఎంతోమంది పరిశోధిస్తున్నా, ఇంకో చరిత్రకారుడు తన పరిశోధన సాగించడానికి, కావలసిన మరెన్నో ఆసక్తికరమైన అంశాలను తనలో నిక్షిప్తం చేసుకున్న చరిత్రగర్భం తెలంగాణ.

అందుకే తెలంగాణ చరిత్ర, ప్రాచీన, మధ్యయుగ కాలపు విశేషాల మీద సురవరం ప్రతాపరెడ్డి, కొమర్రాజు లక్ష్మణరావు, పి.వి పరబ్రహ్మ శాస్త్రి, బి.ఎన్.శాస్త్రి, గులాం యజ్దాని, అడపా సత్యనారాయణ, దేమే రాజారెడ్డి, కుర్రా జితేంద్రబాబు ఇంకా చాలామంది తెలంగాణకు సంబంధించి అనేక చారిత్రక విశేషాలను ప్రపంచానికి వెల్లడి చేశారు. తెలంగాణ ప్రాంతం ప్రస్తుత వర్తమానకాలంలోనే కాదు, ప్రాచీన కాలంలో కూడా అత్యున్నత ప్రాభవ, వైభవాలను కలిగి ఉన్నదనే విషయాన్ని ఆధారాలతో సహా నిరూపించారు.

తెలంగాణ ప్రాంతం భౌగోళికంగా పీఠభూమిగా ఉండటం, ప్రాచీన గోండ్వానలో భాగంగా ఉండటం వల్ల ప్రాచీన చారిత్రక అవశేషాలు, విశేషాలు మాత్రమే గాక ప్రాక్ చరిత్ర మూలాలను ఎన్నింటికో ఈ నేల మౌన సాక్షిగా మిగిలింది. మెసోజాయిక్ యుగం నాటి (అంటే 65 మిలియన్ సంవత్సరాల క్రితం) ఆనవాళ్ళను సైతం తన గర్భంలో దాచుకుని ఉంది. అలా తెలంగాణ మట్టిపొరలలో గొప్ప చారిత్రక సంపద నిద్రాణమై ఉంది. మృణ్మయపాత్రలు, లోహ వస్తువులు, శిలలు, శిల్పాలు, ఆలయాలు, కోటలు, వర్ణచిత్రాలు, రాతి సూచికలు, నిర్మాణాలు ఎన్నో చరిత్రను కొత్తగా నిర్మించడానికి, కొత్తగా రాయడానికి, పునర్ నిర్మించడానికి కావలసిన ఆధారాలను అందిస్తున్నాయి.

అయితే ఉమ్మడి రాష్ట్ర కాలంలో తెలంగాణ ప్రాంత ప్రాచీన చరిత్ర పరిశోధన దిశగా చేయాల్సినంత కృషి జరుగకపోవడం శోచనీయం. అటు ప్రభుత్వ సంస్థలు కానీ, ప్రయివేటు వ్యక్తులు, చరిత్ర పరిశోధకులు కానీ తెలంగాణ ప్రాంతం మీద అంతగా దృష్టి పెట్టలేదు. కానీ తెలంగాణ ఉద్యమం మొదలై జ్వలిస్తున్న కాలం (2000–2014)లో తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని రగిలించడం కోసం చారిత్రక వైభవ పునాదులలోకి అన్వేషణ చేయడం వల్ల విస్తృతమైన ఆలోచన మొదలైంది. అయినప్పటికీ అప్పటి వరకూ తెల్సిన చరిత్ర మాత్రమే ప్రజల్లోకి విస్తరించింది.

అయితే తెలంగాణ చరిత్ర 2014 వరకూ వెల్లడైన విషయాలకే పరిమితమా? తెలంగాణ చరిత్ర అంతమాత్రమేనా? ఎంత మాత్రమూ కాదు. తవ్వుతున్న కొద్దీ ఊరే చెలిమె లాంటిది తెలంగాణ అని 2014 నుంచి తెలంగాణ నేల అంతటా ఔత్సాహిక చరిత్ర పరిశోధకులు చేస్తున్న అన్వేషణలు, వారు వెల్లడి చేస్తున్న విషయాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇప్పటివరకు పురావస్తు శాఖకు, ప్రపంచానికి తెలియని ఎన్నెన్నో వింతైన, వినూత్నమైన, చారిత్రక విశేషాలు ఇప్పుడు వెలుగుచూస్తున్నాయి. ఒక దేశం, ఒక భూమి, ఒక జాతి తన తోటి మనుషులకు ఇంతకన్నా ఏమివ్వాలి ?

ప్రస్తుతం తెలంగాణ మూలమూలల్లోకి సంచరించి పొరల లోకి, అరలలోకి తరచి తరచి చూస్తుంటే తెలంగాణ కొత్త కొత్త వెలుగులతో మనముందు ప్రత్యక్షం అవుతున్నది. అలాంటివాటిలో కొన్ని.. ప్రాచీన రాతియుగంలోనే తెలంగాణ ప్రాంతంలో మానవుల ఉనికిని నిరూపించే దామరవాయి గ్రామంలోని సమాధులు. ఇటుకలను మాత్రమే వాడి నిర్మాణం చేసిన 65 అడుగుల ఎత్తయిన గొల్లత్త గుడి. హనుమకొండలో బ్రహ్మ దేవుడి విగ్రహం లభించడం. కాకతీయుల కాలం నాటి మెట్లబావుల విశిష్టత. హన్మకొండలో అష్టభైరవులు కొలువై ఉన్న ప్రదేశం. కాకతీయుల కాలం నాటి కోటలు, జల, గిరి, వన, దుర్గంగా ఉన్న ప్రతాపగిరి కోట, అడవిలో సైనిక పహారా కోసం నందిగామ, కాపురం, మల్లూరు లాంటి ఎన్నో కోటలు. ప్రఖ్యాత కాకతీయ కీర్తితోరణం కన్నా ప్రాచీనమైన అనుమకొండ కోట తోరణాలు, గొడిశాల తోరణం, నంది కంది, కొలనుపాక లాంటి తోరణాలు. ప్రపంచంలోనే అత్యంత ఆరుదైన దేవుడి గుట్ట ఆలయం.

అడవి సోమనపల్లిలోని గుహలయాలు, శాసనాలు, వర్ణచిత్రాలు. ఇలా ఎన్నో ఎన్నెన్నో ఇదంతా ఇప్పటిదాకా మనకు తెలియని తెలంగాణ! తెలుసుకోవడానికి ఇంకా ఎంతో మిగిలి ఉన్న తెలంగాణ! అందుకే తెలంగాణ చరిత్ర ఆవిష్కరణ విషయంలో ప్రస్తుతానికి ఫుల్ స్టాప్‌లు లేవు. కేవలం కామాలు మాత్రమే.

ఈ అసంపూర్ణతే నికార్సయిన చరిత్రకారుడికి సవాలు విసురుతుంది. అతనిలోని అన్వేషణాకాంక్షకు ప్రోత్సాహాన్నీ అందిస్తుంది. అతనిలోని విషయవాంఛకు స్ఫూర్తినిస్తుంది .

రాబర్ట్ స్టోన్ అనే పాశ్చాత్య పరిశోధకుడు అన్నట్లు History is perceived as a rational process, the unfolding of a design, something with a dynamic to be uncovered. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రాంతపు ప్రాచీన చరిత్రను, ఇప్పటివరకూ వెల్లడికాని తెలంగాణ చారిత్రక వైభవాన్ని సప్రామాణికంగా అందించే పరిశోధనలకు ఊతం ఇవ్వాలని భాషా సాంస్కృతిక శాఖ భావించింది. తెలంగాణ సాంస్కృతిక మూలాల అన్వేషణకు చరిత్ర మాత్రమే దారి చూపుతుందని భావించింది. అందుకే ఆ దిశగా పరిశోధన చేస్తున్న చరిత్రకారుల గురించి అన్వేషిస్తే నవ తరంలో కొత్త ఆలోచనలతో, అమిత సాహసంతో పరిశోధన చేస్తున్న కొంతమంది యువ చరిత్రకారులు దృష్టిలోకి వచ్చారు. వారిలో సీరియస్‌గా పనిచేస్తూ తన జీవిత పరమావధిగా చరిత్రను అన్వేషిస్తున్న అరవింద్ ఆర్య కనిపించాడు. ఏ ఫలితం గురించీ, ప్రయోజనం గురించీ ఆలోచించకుండా గత ఐదేండ్లుగా నిరంతరం చరిత్ర పరిశోధనకే తన సమయాన్ని, శక్తినీ వినియోస్తున్న యువకుడు అరవింద్ ఆర్య.

Anybody can make history. But only a great man can write it అని ప్రఖ్యాత రచయిత ఆస్కార్ వైల్డ్ అన్నట్లు చరిత్ర పరిశోధన ఒకెత్తు అయితే, ఆ పరిశోధనలో వెల్లడి అయిన అంశాలను సప్రమాణాలతో రాయడం, శాస్త్రీయంగా నమోదుచేయడం మరొక ఎత్తు. అరవింద్ అన్వేషించిన చారిత్రక ప్రదేశాల ఛాయాచిత్రాలతో The Untold Telangana పేరుతో ఒక ఛాయాచిత్ర ప్రదర్శనను 2019 ఫిబ్రవరిలో ఐసీసీఆర్ ఆర్ట్ గ్యాలరీలో భాషా సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసింది. అప్పటివరకు బాహ్య ప్రపంచానికి తెలియని ఎన్నో చారిత్రక ప్రదేశాలు, వాటి వివరాలు ఈ ఎగ్జిబిషన్ ద్వారా ప్రపంచానికి తెలిశాయి. ఆ ఎగ్జిబిషన్ ఫోటోలతోనే 'మనకు తెలియని తెలంగాణ' పుస్తకం రూపుదిద్దుకున్నది. మహోన్నత వైభవం, మహోజ్వల వారసత్వ ప్రాభవం చరిత్ర పరిశోధకులకు స్వర్గధామం లాంటి ప్రాచీన జ్ఞానం ఉన్న తెలంగాణను కొన్ని కొంగొత్త అన్వేషణలతో ఆవిష్కరించడం ఈ పుస్తకం ఉద్దేశం. భాషా సాంస్కృతిక శాఖ గతంలో కూడా ప్రముఖ జర్నలిస్ట్ నగేష్ బీరెడ్డి రాసిన 'కాకతీయ ప్రస్థానం' పేరుతో ఒక పరిశోధనా గ్రంథాన్ని ప్రచురించి తెలంగాణ చరిత్రకు నీరాజనం పట్టింది. అయితే చరిత్ర ఎప్పుడూ నిర్మాణమవుతూనే ఉంటుంది. కొత్త అన్వేషణలు, కొత్త పరిశోధనలు జరిగిన ప్రతిసారి చరిత్రకు తోడవుతాయి. చారిత్రక విశేషాల జ్ఞానాన్ని సంపన్నం చేస్తాయి. అందుకే చరిత్రకు ఎప్పుడూ అంతం లేదు.

> **అరవింద్ అన్వేషించిన చారిత్రక ప్రదేశాల ఛాయాచిత్రాలతో The Untold Telangana పేరుతో ఒక ఛాయాచిత్ర ప్రదర్శనను 2019 ఫిబ్రవరిలో ఐసీసీఆర్ ఆర్ట్ గ్యాలరీలో భాషా సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసింది. అప్పటివరకు బాహ్య ప్రపంచానికి తెలియని ఎన్నో చారిత్రక ప్రదేశాలు, వాటి వివరాలు ఈ ఎగ్జిబిషన్ ద్వారా ప్రపంచానికి తెలిశాయి. ఆ ఎగ్జిబిషన్ ఫోటోలతోనే 'మనకు తెలియని తెలంగాణ' పుస్తకం రూపుదిద్దుకున్నది**




అలా చరిత్ర ఎప్పుడూ అసంపూర్ణంగాను, అసమగ్రంగానూ ఉంటుంది. చరిత్రకారుడి నైపుణ్యం వాటిని సంపూర్ణంగా, సమగ్రంగా రచించడంలోనే బయటపడుతుంది. ఆ ప్రయత్నం ఈ పుస్తకంలో జరిగింది. అయినా ఈ పుస్తకమే సమస్తం అని చెప్పే సాహసం మాకు లేదు. ఇది ఒక ప్రయత్నం మాత్రమే. చరిత్రను మరింతగా సారవంతం, అర్థవంతం చేసే దిశగా ఎవరు ప్రయత్నించినా హర్షణీయమే. అందుకే.. For nothing ever ends, really; stories lead to other stories, journ-eys across a thousand miles of ocean lead to journeys across a continent, and the meanings and interpretations of these stories are legion అని జె.హెచ్ ఆర్నాల్డ్ అన్నమాటలు తెలంగాణ చరిత్రకు అతికినట్టుగా సరిపోయే అక్షరసత్యాలు.

**– మామిడి హరికృష్ణ, 80080 05231**

('మనకు తెలియని తెలంగాణ' పుస్తకానికి రచయిత రాసిన ముందుమాట సంక్షిప్తంగా..)

### ప్రకటన

## ఆవిష్కరణ సభ

సీహెచ్ ఆంజనేయులు కవితా సంపుటి 'ఆశల గాలిపటాలు' ఆవిష్కరణ సభ 2019 డిసెంబర్ 8న సాయంత్రం 6 గంటలకు, హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రం షోయబ్‌హాల్‌లో జరుగుతుంది. ఆచార్య పి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా కె.శివారెడ్డి, అమ్మంగి వేణుగోపాల్, కె.ఆనందాచారి, కందుకూరి శ్రీరాములు హాజరవుతారు. డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

**- పాలపిట్ట బుక్స్**


Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

## ‘నిర్భయ’ దోషి క్షమాభిక్షను తిరస్కరించండి

### లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఢిల్లీ ప్రభుత్వం సూచన

**న్యూఢిల్లీ:** ‘నిర్భయ’ కేసులో ఉరిశిక్ష పడిన దోషుల్లో ఒకరైన వినయ్ శర్మ దాఖలు చేసిన క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించాలని ఢిల్లీ ప్రభుత్వం పేర్కొంది. సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని సర్కార్ ఈ మేరకు లెఫ్టినెంట్ గవర్నర్‌కు సూచించింది. ‘పిటిషన్ దారుడు (వినయ్ శర్మ) చాలా క్రూరమైన నేరానికి పాల్పడ్డాడు. మరొకరు ఇలాంటి దారుణాలకు పాల్పడకుండా ఉండేందుకు ఈ కేసు ఒక ఉదాహరణ కావాలి. ఈ క్షమాభిక్ష పిటిషన్‌కు ఎలాంటి యోగ్యత లేదు. దీన్ని తిరస్కరించాలని గట్టిగా సిఫార్సు చేస్తున్నాం’ అని అందులో పేర్కొన్నట్లు సమాచారం. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ పరిశీలన అనంతరం ఆయన చేసిన సూచనలతో ఈ ఫైలు కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చేరుతుంది. మరోవైపు ఈ కేసులో మరో దోషి అయిన ముఖేశ్ క్షమాభిక్ష పిటిషన్‌ను ఇప్పటికే తిరస్కరించారు.

## తమిళనాడులో భారీ వర్షాలు

- ఐదుగురు మృతి
- రెడ్ అలర్ట్ జారీచేసిన ఐఎండీ
- పుదుచ్చేరిలోనూ వానలు
- రెండు రాష్ట్రాల్లో నేడు విద్యా సంస్థలకు సెలవు


రామేశ్వరంలో నీట మునిగిన ఓ ఇల్లు

**చెన్నై:** ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరిల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తమిళనాడులో గతరెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఐదుగురు మరణించారు. వీరిలో ఇంటి గోడ కూలి ముగ్గురు, ప్రమాదంలో ఒకరు, నీటిలో కొట్టుకుపోయి మరొకరు మరణించారు. వర్షాల వల్ల చెన్నై శివారులోని నివాసాల్లో దాదాపు 100 ఇండ్లు పాక్షికంగా నీట మునిగాయి. కడలూరు, నాగపట్టణం, తూత్తుకుడి జిల్లాల్లోనూ చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. కేవలం కడలూరులో దాదాపు 5000 ఇండ్లు నీటమునిగాయి. రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఐదు జిల్లాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంటుందంటూ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. పుదుచ్చేరిలోనూ వర్షాలు కురియడంతో జనజీవనం స్తంభించింది. ఐఎండీ హెచ్చరిక నేపథ్యంలో తమిళనాడు, పుదుచ్చేరిలో సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు.

## నాడు వీధికుక్క.. నేడు పోలీస్ జాగిలం!



**డెహ్రాడూన్, డిసెంబర్ 1:** ఉత్తరాఖండ్ పోలీసులు ఒక వీధి కుక్కకు శిక్షణ ఇచ్చి తమ జాగిలాల దళంలో చేర్చుకున్నారు. ఇటీవల పోలీస్ డే సందర్భంగా డెహ్రాడూన్‌లో నిర్వహించిన పరేడ్‌లో ఆ శునకం చేసిన విన్యాసాలు చూసి అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు. రింగ్ మధ్యలోంచి దూకడం తదితర విన్యాసాలను అది అత్యంత కచ్చితత్వంతో చేయడం చూసి ముక్కున వేలేసుకున్నారు. ఆ శునకానికి థెంగా అని పేరుపెట్టారు. స్క్వాడ్‌లోని జర్మన్ షెపర్డ్, లాబ్రడోర్ వంటి విదేశీ జాతి జాగిలాలు చేసే పనులన్నీ థెంగా కూడా చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ‘తొలి మూడు నెలల శిక్షణలో థెంగా అద్భుత ఫలితాలను కనబరిచింది. జర్మన్ షెపర్డ్స్, లాబ్రడోర్స్ జాతి శునకాలే స్నిఫర్ స్క్వాడ్‌కు సరైనవనే భ్రమలను థెంగా తొలిగించింది’ అని ఐజీపీ సంజయ్ గుంజ్యాల్ పేర్కొన్నారు.



# కఠిన శిక్షతో గట్టి సందేశమివ్వాలి

- హైదరాబాద్‌లో వైద్యురాలిపై లైంగికదాడిని ఖండించిన ఆధ్యాత్మికవేత్తలు


ఢిల్లీలో ముస్లింలకు భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న ఇలియాసీ, మోహన్ భాగవత్. చిత్రంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్రమంత్రి స్మృతి ఇరానీ, హర్యానా సీఎం ఖట్టర్ తదితరులు

**న్యూఢిల్లీ:** హైదరాబాద్ నగర శివారుల్లో వైద్యురాలిపై లైంగికదాడి, హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించి సమాజానికి గట్టి సందేశం ఇవ్వాలని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు డిమాండ్ చేశారు. ‘భగవద్గీత ప్రాముఖ్యత-హిందువులతో అనుబంధం’ అనే అంశంపై ఆదివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్, అఖిల భారత ఇమామ్‌ల సంఘం అధినేత ఉమెర్ అహ్మద్ ఇలియాసీ, సాధ్వి రితంబర, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇలియాసీ మాట్లాడుతూ నిందితులను పట్టపగలు ప్రజల మధ్య బహిరంగంగా ఉరితీసి, సమాజానికి గట్టి సందేశం పంపాలని డిమాండ్ చేశారు. మోహన్ భాగవత్ మాట్లాడుతూ మహిళలను గౌరవించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. మహిళల భద్రతపై నిర్లక్ష్యం వీడి, కఠిన చట్టాలు తేవాలని కోరారు. పిల్లలకు నైతిక విలువలను బోధించాలని సూచించారు. సాధ్వి రితంబర మాట్లాడుతూ సమాజంలో మహిళలను గౌరవించడం కష్టంగా మారిందన్నారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతూ సమాజంలో మహిలకు వ్యతిరేకంగా నేరాలు ఎందుకు జరుగుతున్నాయో సమాజానికి తెలియజేయడంలో సాధువులు, యోగులు ముఖ్య పాత్ర పోషించాలని కోరారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్, కాంగ్రెస్ సీనియర్ నేత జనార్దన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవైపు పనాజీలో గోవా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రతిమా కౌంటిన్హో మాట్లాడుతూ నిందితులను బహిరంగంగా కాల్చివేయాలని లేదా ఉరితీయాలని డిమాండ్ చేశారు.

## ఆరేండ్ల బాలికపై లైంగికదాడి, హత్య

### రాజస్థాన్‌లో దారుణం

**జైపూర్, డిసెంబర్ 1:** కొందరు దుండగులు ఆరేండ్ల బాలికపై లైంగికదాడి చేసి హత్య చేశారు. ఈ దారుణ ఘటన రాజస్థాన్‌లోని టోంక్ జిల్లాలో చోటుచేసుకుంది. శనివారం పాఠశాలకు వెళ్లిన బాలిక సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఖేల్‌ది గ్రామంలోని నిర్మానుష్య ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా.. బాలికపై లైంగికదాడి చేసి గొంతు నులిమి హత్య చేసినట్లు తేలింది. నిందితులను పట్టుకోవడానికి పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు మాట్లాడుతూ మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపామని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

# సిగరెట్లపైనా నిషేధం విధించాలి

- 60 లక్షల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి
- మూడు లక్షల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి
- సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేయనున్న రెండు ఎన్జీవోలు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:** ఎలక్ట్రానిక్ సిగరెట్ల (ఈ సిగరెట్లు) కన్నా సంప్రదాయ సిగరెట్లు ఆరోగ్యానికి ఎంతో హానికరమని, వీటిపైనా నిషేధం విధించాలంటూ రెండు ఎన్జీవో సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నాయి. దీనిపై ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయనున్నట్టు ఢిల్లీ కేంద్రం గా పని చేసే ఉర్జా (యూనైటెడ్ రెసిడెంట్స్ జాయింట్ యాక్షన్), హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే వీచేంజ్‌యూ పేర్కొన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఈ-సిగరెట్లపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. 2018 సెప్టెంబర్‌లో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ప్రవేశపెట్టిన బిల్లును బుధవారం లోక్‌సభ ఆమోదించింది. పొగతాగటం వల్ల ప్రతి ఏటా సుమారు 12 లక్షల మంది ప్రజలు మరణిస్తున్నారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ సిగరెట్ల కన్నా ఆరోగ్యానికి ఎక్కువ హానికరమైన సంప్రదాయ సిగరెట్లపైనా నిషేధం విధించాలని వీచేంజ్‌యూ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వై విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సిగరెట్లపై నిషేధం వల్ల ప్రజలు, ముఖ్యంగా యువత సంప్రదాయ సిగరెట్లకు బానిసలవుతున్నారని, ఈ నేపథ్యంలో వీటి తయారీ, అమ్మకాలు, మార్కెటింగ్, ప్రకటనలపై నిషేధం కోసం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలుకు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషన్‌ను సంప్రదించగా ఆయన అంగీకరించినట్లు ఉర్జా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అతుల్ గోయల్ తెలిపారు. సిగరెట్ల అమ్మకాలవల్ల ప్రభుత్వానికి ఆదాయం వస్తున్న నేపథ్యంలో దీని బారిన పడిన రోగులకు, మరణించిన బాధిత కుటుంబాలకు సామాజిక బాధ్యత కింద పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ఐదేండ్లలో పొగతాగడంవల్ల 60 లక్షల మంది ప్రజలు చనిపోయారని, వీరికి పరిహారం చెల్లించడంతోపాటు బాధితుల కోసం రూ. మూడు లక్షల కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని ప్రజావ్యాజ్యం ద్వారా ప్రభుత్వాన్ని కోరతామని గోయల్ తెలిపారు.

# ‘హిందుత్వ’ను వదలను

- స్పష్టంచేసిన మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే
- స్పీకర్‌గా నానా పటోలే ఏకగ్రీవ ఎన్నిక.. ప్రతిపక్ష నేతగా ఫడ్నవీస్
- ‘నేను మళ్లీ వస్తా’ అన్న వ్యాఖ్యలపై ఆసక్తికర చర్చ
- వ్యంగ్యాస్త్రాలు విసురుకున్న సీఎం, మాజీ సీఎం


అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సీఎం ఉద్ధవ్ ఠాక్రే


మాట్లాడుతున్న దేవేంద్రఫడ్నవీస్

**ముంబై, డిసెంబర్ 1:** కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేయడంతో శివసేన ‘హిందుత్వ’ నినాదాన్ని తాత్కాలికంగా పక్కనబెడుతుందని భావించినవారికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే స్పష్టత ఇచ్చారు. తాను ఇప్పటికీ ‘హిందుత్వ’ సిద్ధాంతాలకే కట్టుబడి ఉన్నానని, ఎప్పటికీ విడిచిపెట్టనని స్పష్టంచేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా కాంగ్రెస్ నేత నానా పటోలే ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ ఎన్నిక ప్రక్రియ శనివారం ప్రారంభం కాగా మహారాష్ట్ర వికాస కూటమి తరఫున నానా పటోలే, బీజేపీ తరఫున కిషన్ కథోరే నామినేషన్ దాఖలు చేశారు. అయితే కిషన్ కథోరే ఆదివారం తన నామినేషన్‌ను వెనక్కి తీసుకోవడంతో పటోలే ఎన్నిక ఏకగ్రీవమైంది. నానా పటోలే స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాజీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ప్రకటించారు. ‘ప్రతిపక్షం లేకుండా చేయాలని చూసినవారే ఇప్పుడు ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్నారు’ అని బీజేపీనుద్దేశించి ఎద్దేవా చేశారు.

**అర్ధరాత్రి రాజకీయాలు చేయను**

అసెంబ్లీ ఎన్నికలకు కొన్నిరోజుల ముందు అప్పటి సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ.. ‘నేను మళ్లీ వస్తా’ అని వ్యాఖ్యానించారు. దీనిపై ఆదివారం అసెంబ్లీలో ఆసక్తిక సంభాషణ జరిగింది. సీఎం ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ.. ‘మళ్లీ వస్తా అంటూ నేను ఎప్పుడూ చెప్పలేదు. కానీ.. ఇప్పుడు ఈ సభకు వచ్చాను. ఈ సందర్భంగా సభ్యులకు, మహారాష్ట్ర ప్రజలకు ఒక హామీ ఇస్తున్నా. నేను అర్ధరాత్రి (దొంగచాటుగా) రాజకీయాలు చేయను. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మాత్రమే పనిచేస్తాను’ అని పేర్కొన్నారు. ఫడ్నవీస్‌ను తాను ప్రతిపక్ష నేత అని పిలువబోనని, బాధ్యతాయుతమైన నేతగా సంబోధిస్తానని అన్నారు. ఫడ్నవీస్ నుంచి చాలా నేర్చుకున్నానని, తామెప్పుడూ మంచి స్నేహితులమేనని పేర్కొన్నారు. తనలో ఇప్పటికీ ‘హిందుత్వ’ భావజాలమే ఉన్నదని, ఆ సిద్ధాంతాన్ని ఎప్పటికీ వదలబోనని స్పష్టం చేశారు. గత ఐదేండ్లలో తాను ప్రభుత్వానికి (బీజేపీ-శివసేన) ఎన్నడూ నమ్మకద్రోహం చేయలేదన్నారు. నానా పటోలే స్పీకర్‌గా ఎన్నిక కావడంపై ఉద్ధవ్ హర్షం వ్యక్తం చేశారు. రైతు బిడ్డ ఉన్నతస్థానంలో కూర్చున్నందుకు తనకు సంతోషంగా ఉన్నదన్నారు. ఎన్సీపీ మంత్రి జయంత్ పాటిల్ సైతం ఫడ్నవీస్‌పై విమర్శలు గుప్పించారు. ‘ఆయన (ఫడ్నవీస్) మళ్లీ వస్తానని చెప్పారు. కానీ.. ఏ కుర్చీలో కూర్చుంటారో మాత్రం చెప్పలేదు. ఇప్పుడు ఆయన తిరిగొచ్చి సీఎంకి సమానమైన స్థానంలో (ప్రతిపక్ష నేత) కూర్చున్నారు’ అని ఎద్దేవా చేశారు.

**నేను సముద్రంలాంటోడిని: ఫడ్నవీస్**

తనపై వస్తున్న విమర్శలకు ఫడ్నవీస్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. ‘కెరటం వెనక్కి వెనక్కి వెళ్లిందని.. తీరంలో ఇల్లు కట్టుకోవాలని చూడొద్దు. నేను సముద్రంలాంటివాడిని. కచ్చితంగా తిరిగివస్తా’ అని ఓ పద్యాన్ని చదవి వినిపించారు. ‘నేను తిరిగి వస్తానని చెప్పా. కానీ.. మీకు ఎప్పుడొస్తానని చెప్పడం మర్చిపోయా. ఒక్కటి మాత్రం నిజం. నా రాక కోసం మీరు కొన్నాళ్లపాటు ఎదురుచూడక తప్పదు. నేను సీఎంగా ఉన్నప్పుడు అనేక ప్రాజెక్టులు ప్రకటించా. వాటిలో కొన్నింటికే ప్రారంభోత్సవాలు చేశా. నేను మళ్లీ వచ్చి వాటికి శంకుస్థాపన చేస్తానని మీరు కలలో కూడా ఊహించలేరు’ అని ఫడ్నవీస్ పేర్కొన్నారు. ‘బీజేపీకి ప్రజల ఆశీస్సులు ఉన్నాయి. అందుకే అతిపెద్ద పార్టీగా నిలిచాం. 70 శాతం మార్కులతో పాసయ్యాం. కానీ.. కొన్ని రాజకీయ సమీకరణాలు మమ్మల్ని ఓడించాయి. కేవలం 40% మార్కులు తెచ్చుకున్నవారు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు’ అని త్రిపక్ష కూటమిని ఎద్దేవా చేశారు.

**ప్రైవేట్ ఉద్యోగాల్లో 80 శాతం స్థానికులకే..**

ప్రైవేట్ రంగంలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే కేటాయించేలా చట్టాన్ని రూపొందించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారీ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన అసెంబ్లీ, మండలి సభ్యుల సంయుక్త సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల సానుభూతితో ఉన్నదని చెప్పారు. కనీస ఉమ్మడి ప్రణాళికలో ప్రకటించిన అన్ని అంశాలను ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు.

### ఎన్సీపీకి డిప్యూటీ సీఎం, హోం శాఖ?

ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి క్యాబినెట్ పదవుల్లో కీలక శాఖలు దక్కనున్నట్టు సమాచారం. మొత్తం 43 పదవులకుగానూ ఎన్సీపీకి 16 పదవులు కేటాయించనున్నట్టు తెలిసింది. శివసేన 15, కాంగ్రెస్ 12 పదవులు తీసుకోనున్నట్టు సమాచారం. శివసేనకు సీఎం పదవి, కాంగ్రెస్‌కు స్పీకర్ పదవిని కేటాయించిన నేపథ్యంలో ఎన్సీపీకి అదనంగా ఒక మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఒక డిప్యూటీ సీఎంతోపాటు హోంమంత్రి పదవికూడా ఎన్సీపీకే కేటాయించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. డిప్యూటీ సీఎం పదవికి అజిత్‌పవార్, హోంమంత్రి పదవికి జయంత్‌పాటిల్ పేర్లను పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నాయి. రెవెన్యూశాఖను కాంగ్రెస్‌కు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. దీనికి బాలాసాహెబ్ థోరాట్, అశోక్ చవాన్ పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. ‘పట్టణాభివృద్ధి’ని శివసేనకు ఇస్తారని, దీనికి ఏక్‌నాథ్ షిండే, సుభాష్ దేశాయ్ పేర్లను పరిశీలిస్తున్నారని వార్తలు వస్తున్నాయి.

## బస్సు లోయలో పడి 24 మంది మృతి

### ట్యూనీషియాలో ఘటన


**ట్యూనిస్, డిసెంబర్ 1:** ట్యూనీషియా దేశంలో పర్యాటకుల బస్సు లోయలో పడటంతో 24మంది మరణించారు. 18 మంది గాయపడ్డారు. ఈ ఘోర దుర్ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ట్యూనిస్ నుంచి ప్రముఖ పర్యాటక ప్రదేశం ఏయిన్ డ్రాహమ్‌కు బయలుదేరిన బస్సు కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో అదుపు తప్పి కంచెను ఢీకొని లోయలో పడిపోయింది. దీంతో 24 మంది ప్రాణాలుకోల్పోగా.. 18మంది గాయపడ్డారు. ప్రమాదంలో బస్సు తునాతునకలైంది.



## లోక్‌పాలా.. జోక్‌పాలా?

### ఆఫీసుకు రూ.50 లక్షల అద్దెపై కాంగ్రెస్ ఎద్దేవా

**న్యూఢిల్లీ:** దేశ అత్యున్నత అవినీతి నిరోధక సంస్థ ‘లోక్‌పాల్’ కార్యాలయ అద్దె నిమిత్తం ఢిల్లీలోని అశోకా హోటల్‌కు ప్రతి నెలా రూ.50 లక్షలు చెల్లిస్తున్నట్లు వచ్చిన వార్తలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా స్పందిస్తూ ‘లోక్‌పాలా లేదా జోక్‌పాలా. ఏడు నెలలుగా లోక్‌పాల్‌కు హోటల్ కార్యాలయంగా మారింది. కార్యాలయం అద్దె కింద రూ.50 లక్ష లు ఖర్చుపెట్టారు. ఈ ఏడాది అక్టోబర్ వరకు అవినీతిపై లోక్‌పాల్ 1,116 ఫిర్యాదులు స్వీకరించింది. ఒక్కదానిపైనా ప్రాథమిక విచారణ ప్రారంభించలేదు’ అని ట్వీట్ చేశారు. ఇందుకేనా లోక్‌పాల్ కోసం జరిగిన ఉద్యమానికి బీజేపీ సారథ్యం వహించింది? అని ప్రశ్నించారు.


కాల్పుల్లో ధ్వంసమైన విల్లాయూనియన్ మున్సిపల్ భవనం.. (ఇన్‌సెట్) దుండగులు ఉపయోగించిన కారు


# మెక్సికో రణరంగం

### డ్రగ్స్ ముఠా, పోలీసుల మధ్య భారీగా కాల్పులు.. 21 మంది మృతి

**మెక్సికో సిటీ:** మెక్సికోలో డ్రగ్స్ ముఠా, భద్రతాబలగాల మధ్య రెండుసార్లు జరిగిన భారీ కాల్పుల్లో 21 మంది మరణించారు. మృతుల్లో 17 మంది డ్రగ్స్ ముఠా సభ్యులు, నలుగురు పోలీసులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అమెరికా సరిహద్దుకు సమీపంలోని విల్లా యూనియన్ పట్టణంలో ఈ ఘటన జరిగింది. ఈశాన్య సరిహద్దు ప్రాంతానికి చెందిన డ్రగ్స్ ముఠా శనివారం భారీ ఆయుధాలతో కూడిన వాహనాల్లో మరో పట్టణానికి వెళ్తుండగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువైపులా సుమారు గంటర్నకుపైగా కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో పది మంది డ్రగ్స్ రవాణా ముఠా సభ్యులతోపాటు నలుగురు పోలీసులు చనిపోయారని, ఆరుగురు పోలీసులు గాయపడ్డారు. మున్సిపల్ భవనం ధ్వంసమైందని, పలువురు సిబ్బంది, కొందరు స్థానికులు అదృశ్యమయ్యారని అధికారులు చెప్పారు. ముఠాకు చెందిన 14 వాహనాలను గుర్తించారు. మరోవైపు ఆదివారం జరిగిన కాల్పుల్లో మరో ఏడుగురు దుండగులు చనిపోయినట్లు చెప్పారు. నవంబర్‌లో అమెరికాకు చెందిన ముగ్గురు మహిళలతోపాటు ఆరుగురు చిన్నారులను మెక్సికో డ్రగ్స్ ముఠా దారుణంగా హత్య చేసింది. దీంతో మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యువల్ లోపేజ్ ఆదేశాలమేరకు భద్రతా బలగాలు ప్రత్యేక ఆపరేషన్ చేపడుతున్నాయి.

## అమెరికాలో మళ్లీ తుపాకీ మోత

- న్యూ ఆర్లీన్స్ నగరంలో కాల్పులు
- 11 మందికి గాయాలు..


ఘటనాస్థలంలో అధికారుల తనిఖీలు

**వాషింగ్టన్:** అమెరికాలో మళ్లీ కాల్పులు కలకలం సృష్టించాయి. న్యూ ఆర్లీన్స్ నగరంలోని పర్యాటక హబ్ అయిన ఫ్రెంచ్ క్వార్టర్‌లో ఆదివారం కాల్పుల మోత మోగింది. ఈ ఘటనలో 11 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నదని పోలీసులు వెల్లడించారు. అత్యంత రద్దీ ఉండే కెనాల్ వీధిలో వేకువజామున 3 గంటలకు కాల్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. ఏటా నిర్వహించే థ్యాంక్స్‌గివింగ్ వీకెండ్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం అదనపు గస్తీ బలగాలను మోహరించిన నేపథ్యంలో కాల్పుల ఘటనకు తాము వెంటనే స్పందించామని వివరించారు. ఆ బ్లాక్‌లో ఉన్న తమ పోలీస్ అధికారులపైకి కాల్పులు జరిపారేమోనని తొలుత భావించామని పోలీస్ సూపరింటెండెంట్ షాన్ ఫెర్గూసన్ తెలిపారు. అయితే, అక్కడ చాలా మంది ప్రజలు బయట ఉండడంతో ఎవరు కాల్పు లు జరిపారో తాము గుర్తించలేకపోయామని చెప్పారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని, దర్యాప్తు కొనసాగుతున్నదని పేర్కొన్నారు.

# కశ్మీర్‌కు చర్చలే మార్గం

- వివాదానికి శాంతియుత పరిష్కారం కనుగొనాలి
- ఆర్సీఈపీపై భారత్ లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు
- జపాన్ విదేశాంగ అధికార ప్రతినిధి అత్సుషి కైపు వెల్లడి

**న్యూఢిల్లీ:** కశ్మీర్ వివాదానికి చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం కనుగొనాలని జపాన్ ఆకాంక్షించింది. ‘టూ ప్లస్ టూ’ కార్యాచరణ కింద తొలిసారిగా ఇరు దేశాల విదేశాంగ, రక్షణ శాఖ మంత్రులు శనివారం ఢిల్లీలో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జపాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అత్సుషి కైపు ఆదివారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. మంత్రుల భేటీ సందర్భంగా కశ్మీర్ అంశం చర్చకు వచ్చిందా అని విలేకరులు ప్రశ్నించగా.. ‘ఈ అంశంపై మంత్రులు లోతుగా చర్చించారా లేదా అన్నది నాకు గుర్తు లేదు. అయితే కశ్మీర్‌లో పరిస్థితిని మేం జాగ్రత్తగా పరిశీలించామని మాత్రం చెప్పగలను. కశ్మీర్‌పై దీర్ఘకాలంగా భేదాభిప్రాయాలున్న విషయం మాకు తెలుసు. చర్చల ద్వారా సమస్యకు శాంతియుత పరిష్కారం లభిస్తుందని మేం భావిస్తున్నాం’ అని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలో కొత్త సర్కార్ కొలువుదీరిన నేపథ్యంలో జపాన్ సహకారం అందిస్తున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుపై నెలకొన్న అస్థిరతపై ప్రశ్నించగా.. ఈ విషయంపై రెండు దేశాల అధికారులు కసరత్తు చేస్తున్నారని బదులిచ్చారు. వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడుపై ఆయన స్పందిస్తూ.. చైనాతో తమకు సుహృద్భావ సంబంధాలు ఉన్నాయని, అయితే సముద్ర భద్రత విషయంలో రాజీపడబోమన్నారు.

**భారత్ ఆందోళనల పరిష్కారానికి ప్రయత్నాలు..**

ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఆర్సీఈపీ)లో భారత్ చేరికపై ప్రయత్నాలు జరుగుతున్నట్లు జపాన్ సంకేతాలు ఇచ్చింది. భారత్ లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు భాగస్వామ్య పక్షాలన్నీ ప్రయత్నిస్తున్నాయని జపాన్ అధికార ప్రతినిధి అత్సుషి కైపు తెలిపారు. ప్రస్తుత రూపంలోని ఈ ఒప్పందం భారతీయుల ప్రయోజనాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటూ ఆర్సీఈపీలో చేరేందుకు భారత్ నిరాకరించిన విషయం తెలిసిందే. మరోవైపు, అరుణాచల్ ప్రదేశ్‌లో జపాన్ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టనుందా అని విలేకరులు ప్రశ్నించగా.. ఆ రాష్ట్రంలో కనెక్టివిటీ ప్రాజెక్టులను చేపట్టేందుకు ఇరుదేశాలు కసరత్తు చేస్తున్నట్లు కైపు వివరించారు. అరుణాచల్ తమ భూభాగమని పేర్కొంటున్న చైనా.. ఆ రాష్ట్రంలో విదేశాలు అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నది.

# బలుచిస్థాన్‌లో ఉద్ధృతంగా ఉద్యమం

- పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత పోరాటం
- జాతీయ భద్రతా సలహా బోర్డు సభ్యుడు తిలక్ దేవేశర్


తిలక్ దేవేశర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బలుచిస్థాన్ తిరుగుబాటు ఉద్యమం మరింత ఉద్ధృతం అయ్యే అవకాశం ఉన్నదని, పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేటితరం యువత ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నదని భారత జాతీయ భద్రతా సలహా బోర్డు సభ్యుడు తిలక్ దేవేశర్ అన్నారు. ‘పాకిస్థాన్-బలుచిస్థాన్ చిక్కుముడి’ అన్న అంశంపై ఆదివారం హైదరాబాద్‌లో సోషల్ కాజ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేశర్ మాట్లాడుతూ.. బలుచిస్థాన్ సమస్యకు రాజకీయ పరిష్కారం కనుగొనడానికి బదులుగా, సైనిక బలంతో ఉద్యమాన్ని అణచివేసేందుకు పాక్ ప్రయత్నిస్తున్నదన్నారు. తిరుగుబాటు పెద్ద సమస్య కాదని, బలూచీల జాతీయవాదమే పాక్ ప్రభుత్వం, ఆ దేశ సైన్యం ముందున్న అతి పెద్ద సవాల్ అని చెప్పారు. బలూచ్ ప్రజలు ఆర్థిక దోపిడీకి, మానవహక్కుల ఉల్లంఘనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గత దశాబ్ద కాలంగా పెద్ద సంఖ్యలో యువ ఆందోళనకారులు అదృశ్యమయ్యారని, వారి మృతదేహాలు మాత్రం బయట పడుతున్నాయని చెప్పారు. దేశ స్వాతంత్ర్య సమయంలో తమను బలవంతంగా విలీనం చేసుకోవడానికి పాక్ ప్రయత్నం చేసినప్పుడు బలూచ్ పాలకులు భారత్ సాయం కోరారని చెప్పారు. అయితే బలుచిస్థాన్ స్వతంత్ర దేశంగా కొనసాగడంలో వ్యూహాత్మకంగా భారత్‌కున్న ప్రాధాన్యాన్ని నాటి నెహ్రూ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత షకూర్ అహ్మద్ వణి, సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్, సోషల్ కాజ్ అధ్యక్షుడు దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

## కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబ్‌ల ఆధునీకరణ

**న్యూఢిల్లీ:** దేశంలో రోజురోజుకు నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. నేరాల నిర్ధారణలో కీలకమైన ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలను ఆధునీకరించాలని నిర్ణయించింది. డైరెక్టరేట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ సర్వీసెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్, చండీగఢ్, కోల్‌కతా, భోపాల్, పుణె, గువాహటిల్లో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలు ఉన్నాయని, వీటిని అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించిందని ఓ అధికారి తెలిపారు. వాటి సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ఆధునిక సాంకేతికతను సమకూర్చనున్నామని చెప్పారు. అలాగే ఫోరెన్సిక్ సైకాలజీ, న్యూరో సైకలాజికల్, నేర ప్రవృత్తికి పాల్పడేవారి ప్రవర్తన తదితరాలపై పరిశోధన చేయడానికి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి ఇటీవల డైరెక్టరేట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సర్వీసెస్, గుజరాత్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిహేవియర్ సైన్సెస్ మధ్య ఒప్పందం కుదిరిందని అధికారి వివరించారు.


## సరిహద్దులో పాక్ కాల్పులు

### పౌరుడికి గాయాలు

**జమ్ము:** పాకిస్థాన్ వరుసగా మూడో రోజు కూడా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. పూంచ్ జిల్లాల్లో నియంత్రణ రేఖ వెంట ఉన్న రెండు సైనిక శిబిరాలు, గ్రామాలు లక్ష్యంగా ఆదివారం కాల్పులకు తెగబడింది. దీంతో జమాలోద్దీన్ (65) అనే పౌరుడు గాయపడ్డారు. మరో వైపు పాక్ కాల్పులకు భారత్ దీటుగా బదులిచ్చింది. ఎదురుకాల్పులు జరుపడంతో ఇద్దరు పాక్ సైనికులు గాయపడ్డారు.

## హాంకాంగ్‌వాసుల్లో చల్లారని ఆగ్రహం

- మళ్లీ నిరసనలతో హోరెత్తించిన ఆందోళనకారులు
- బాష్పవాయువు, పెప్పర్‌స్ప్రే ప్రయోగించిన పోలీసులు


హాంకాంగ్‌లోని మెట్రో రైల్వేస్టేషన్ ప్రవేశ మార్గం వద్ద నిప్పు పెడుతున్న నిరసనకారుడు

**హాంకాంగ్, డిసెంబర్ 1:** హాంకాంగ్‌లోని స్థానిక సంస్థలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజాస్వామ్య అనుకూలవాదులు ఘనవిజయం సాధించినప్పటికీ చైనా నియంతృత్వ పోకడలపై అక్కడి ప్రజల్లో ఇంకా ఆగ్రహం చల్లారలేదు. దీంతో స్థానిక ఎన్నికలు ముగిసి వారంరోజులు తిరక్కుండానే మళ్లీ నిరసనలు హోరెత్తాయి. నల్లదుస్తులు ధరించిన వేలాదిమంది ఆందోళనకారులు ఆదివారం నగర వీధుల్లోకి పోటెత్తి చైనా నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువును, పెప్పర్‌స్ప్రేను ప్రయోగించారు. హాంకాంగ్ హక్కులను హరించేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలపై భయాందోళన వ్యక్తంచేస్తున్న హాంకాంగ్‌వాసులు గత ఆరు నెలల నుంచి ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం విదితమే. ఆదివారం జరిగిన మూడు నిరసన ప్రదర్శనల్లో సిమ్ షా సుయిలో జరిగిన ర్యాలీ ప్రధానమైనది. జిల్లాస్థాయి స్థానిక సంస్థలకు గత నెల 24న జరిగిన ఎన్నికల్లో ప్రజాస్వామ్య అనుకూలవాదులు ఘనవిజయం సాధించడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆందోళనకారులు ఈ నిరసన ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు సహా అనేకమంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ‘ప్రభుత్వం ఇప్పటికీ మా గోడును పట్టించుకోవడంలేదు. కనుక మా నిరసనలు కొనసాగుతాయి. వాటిని ఆపే ప్రసక్తేలేదు. మున్ముందు ఏమి జరుగుతుందో అంచనా వేయలేం. కానీ ప్రజలు ఇప్పటికీ ఆగ్రహంతో రగిలిపోతున్నారు. వారు మార్పును కోరుకొంటున్నారు’ అని ఓ విద్యార్థి పేర్కొన్నాడు.




చెన్నూరు- కోటపల్లి అటవీ ప్రాంతాల్లో లభించిన జంతు పాదముద్ర, పత్ర శిలాజాలు

## శిలాజాల అన్వేషణలో కొత్త చరిత్ర

- జాగృతి చరిత్ర బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శిలాజాల అన్వేషణలో కొత్త చరిత్రను నెలకొల్పినట్టు జాగృతి చరిత్ర బృందం ప్రతినిధి శ్రీరామోజు హరగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశోధకుడు సుముద్రాల సునీల్.. అవక్షేప శిలలు, పొరల నాపరాళ్లు, బంకమట్టి నేలలున్న మంచిర్యాల ప్రాంతంలో డైనోసార్ల శిలాజాలను సేకరించినట్టు ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో సేకరించిన పత్ర శిలాజాల ముద్రలు విలువైనవని, ఇవి ప్రాచీన వృక్ష జాతి గ్లాస్సొప్టెరిస్‌కు చెందనవని ఓ పెలియో-బొటానిస్ట్ అభిప్రాయపడ్డారని, వీటిలో నారవేప, తిరుమణి తదితరాలు ఉంటాయని తెలిపారు. సునీల్ సేకరించిన పత్రశిలాజాల ముద్రలు 10 కోట్ల సంవత్సరాలకు ముందు నాటివని, వీటిని చెన్నూరు- కోటపల్లి అటవీ ప్రాంతాల్లో గుర్తించినట్టు హరగోపాల్ వెల్లడించారు. కొన్ని జంతువుల అస్థి శిలాజాలను



రామగుండం ఎన్టీపీసీ ప్రాంతంలో సేకరించిన చేప శిలాజం

కూడా సేకరించారని, మంచిర్యాల జైపూర్ ప్రాంతం నుంచి ఒక జంతువు పాదముద్రల అచ్చు శిలాజాన్ని, ఈ ప్రాంతంలో వందలఎకరాల్లో విస్తరించిన వృక్ష శిలాజాలను గుర్తించినట్టు తెలిపారు. రామగుండం ఎన్టీపీసీ ప్రాంతంలో సేకరించిన చేప అచ్చు శిలాజం అరుదైనదని, ఇది 12 కోట్ల నుంచి ఆరున్నర కోట్ల సంవత్సరాల మధ్యకాలానికి చెందినదని చెప్పారు. తెలంగాణ చరిత్ర ఎంత ప్రాచీనమైనదో ఇవి చాటిచెప్తాయని తెలిపారు.

## ‘జస్టిస్ ఫర్ దిశ’ కేసు దర్యాప్తు వేగవంతం

- షాద్‌నగర్ ఏసీపీకి బాధ్యతలు
- యాభై మంది అధికారులు వివిధ కోణాల్లో పరిశోధన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జస్టిస్ ఫర్ దిశ కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. కేసు దర్యాప్తు అధికారిగా షాద్‌నగర్ ఏసీపీ సురేందర్‌కు బాధ్యతలు అప్పగించారు. నిందితులకు కఠినశిక్షపడేలా ప్రతీ ఆధారాన్ని సేకరిస్తున్నారు. దాదాపు 50 మందికిపైగా అధికారులు వివిధ కోణాల్లో పరిశోధిస్తున్నారు. సోమవారం నిందితులను కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉన్నది. పోలీసులకు బాధితురాలి ఫోన్ దొరికినప్పటికీ దర్యాప్తులో సున్నితమైన అంశాలను దృష్టిలోపెట్టుకుని ఆ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించడంలేదని తెలిసింది. డీజీపీ మహేందర్‌రెడ్డి, సైబరాబాద్ సీపీ సజ్జనార్ జస్టిస్ ఫర్ దిశ కేసు దర్యాప్తును నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి దోషులకు త్వరగా శిక్ష విధించే అవకాశం ఉండటంతో చార్జిషీటును వీలైనంత త్వరగా రూపొందించే పనిలో పోలీసులు ఉన్నారు. నిందితుల నుంచి ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు దానిని విశ్లేషించేందుకు ఫోరెన్సిక్‌కు పంపించారు. నిందితుల గత నేరచరిత్రపై కూడా వివరాలు సేకరిస్తున్నారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దర్యాప్తు అంశాలను బహిరంగపర్చొద్దని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

## రాష్ట్రంలో రెండ్రోజులు తేలికపాటి వానలు

- వాతావరణశాఖ అధికారుల వెల్లడి

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తమిళనాడు, శ్రీలంక తీరాలకు దగ్గరలో నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి బలహీనపడింది. దీని ప్రభావంతో తెలంగాణలో ఆకాశం మేఘావృతమై రాగల రెండురోజుల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణశాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు ఆగ్నేయ దిశ నుంచి రాష్ట్రం వైపు చలిగాలులు వీస్తాయని పేర్కొన్నారు.

**24 గంటల్లో గ్రేటర్‌కు వర్షసూచన**

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ద్రోణి ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 29.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 20.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. గాలిలో తేమ 67 శాతంగా రికార్డయింది.

# ఇది అమానుషం

మొదటిపేజీ తరువాయి...

సత్వర తీర్పు రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. బాధితురాలి కుటుంబానికి అవసరమైన అన్నిరకాల సహాయసహకారాలు అందిస్తుందని తెలిపారు. మహిళలు అంతా మనఇంటి ఆడబిడ్డలేనని, మహిళా ఉద్యోగులకు రాత్రిపూట డ్యూటీలు వేయవద్దని అధికారులను ఆదేశించారు. మహిళా ఉద్యోగుల డ్యూటీలు రాత్రి 7.30– 8గంటల వరకే ముగించేలా చూడాలని స్పష్టంచేశారు. అధికారులు ప్రతి మహిళను తమ ఇంటి ఆడపడుచుగా చూడాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జస్టిస్ ఫర్ దిశ కేసు సత్వర విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుపై హైకోర్టుకు ప్రతిపాదనలు పంపనున్నట్టు న్యాయశాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన న్యాయశాఖ కార్యదర్శి సంతోష్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు కిరాతకుల చేతిలో దారుణంగా హత్యకు గురైన బాధితురాలి పేరును ఎక్కడా వాడొద్దని.. జస్టిస్ ఫర్ దిశగా సంబోధించాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ స్పష్టంచేశారు.



ఆదివారం జస్టిస్ ఫర్ దిశ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

**లైంగికదాడికి పాల్పడితే ఉరిశిక్ష విధించాలి**

మహిళలపై లైంగికదాడుల ఘటనలు జరగకుండా కఠినచట్టాలు తీసుకొచ్చేలా పార్లమెంట్‌లో చర్చించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు విజ్ఞప్తిచేశారు. దేశంలో జరుగుతున్న లైంగికదాడుల కేసుల్లో నిందితులు పట్టుబడినప్పటికీ, వారికి వేసిన శిక్షల అమలులో తీవ్ర జాప్యం జరుగుతున్నదని.. ఏడేండ్ల కింద జరిగిన నిర్భయ ఘటనలో నిందితులకు ఇప్పటికీ ఉరిశిక్ష అమలుకాలేదని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో జస్టిస్ ఫర్ దిశ ఘటనలోనూ నిందితులను పోలీసులు వెంటనే పట్టుకున్నారని.. అయితే తమ బిడ్డను కోల్పోయిన తర్వాత దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి ఏవిధంగా సాంత్వన చేకూర్చాలో అర్థం కావడం లేదన్నారు. ‘న్యాయం ఆలస్యమైతే.. అన్యాయం జరిగినట్టే’ అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి క్రూరమైన ఉదంతాల్లో అమలుచేయాల్సిన చట్టాలపై, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో చర్చచేపట్టాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తిచేశారు. అత్యంత హీనమైన నేరాలకు పాల్పడిన నీచులకు కఠినశిక్ష విధించాల్సిన అవసరం ఉన్నదన్నారు. మహిళలు, పిల్లలపైన అఘాయిత్యానికి పాల్పడేవారికి ఎలాంటి ఆలస్యం లేకుండా ఉరిశిక్ష విధించాలని సూచించారు.



చర్లపల్లి జైలులో ఉన్న జస్టిస్ ఫర్ దిశ కేసులోని నిందితులు మహ్మద్ పాషా, నవీన్, కేశవులు, శివ

**హైసెక్యూరిటీ బ్యారక్‌లోకి ఆ నలుగురు**

జస్టిస్ ఫర్ దిశ నిందితులను చర్లపల్లి జైలులో ఖైదీలు అసహ్యించుకుంటున్నట్టు సమాచారం. దీంతో అప్రమత్తమైన జైలు అధికారులు నిందితులను హై సెక్యూరిటీ బ్యారక్‌లోకి మార్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. నలుగురినీ ఒకేచోట కాకుండా ఒక్కొక్కరినీ ఒక్కో గదిలో ఉంచారు. గదుల నుంచి బయటకు వస్తే ఖైదీలనుంచి సమస్యలు వస్తాయనే అనుమానంతో వారి గదులలోకే భోజనం అందిస్తున్నారు. ఆ నలుగురు చేసిన పైశాచిక అఘాత్యంపై జైలులో ఖైదీలు ఆగ్రహంగా ఉన్నారని అధికారులు ధ్రువీకరించకపోయినా.. నిందితులను హై సెక్యూరిటీ బ్యారెక్‌లో పెట్టామని స్పష్టంచేశారు.


**ఘటనా స్థలాలను పరిశీలించిన డీజీపీ**

జస్టిస్ ఫర్ దిశ కుటుంబాన్ని డీజీపీ మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట సీపీ సజ్జనార్, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి ఉన్నారు. బాధితురాలి కుటుంబానికి డీజీపీ ధైర్యం చెప్పారు. నిందితులకు త్వరగా శిక్ష పడేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి వద్ద హత్య జరిగిన ప్రదేశంతోపాటు, మృతదేహాన్ని దహనం చేసిన షాద్‌నగర్ పరిధిలోని చటాన్‌పల్లి ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.

## దండనీతి లోపంతో దోషాలు పెరుగుతాయి

- త్రిదండి చినజీయర్‌స్వామి

తప్పుచేసిన వ్యక్తికి పాలకులు తగిన దండన విధించకపోతే.. అలాంటి తప్పును మరో పదిమంది చేసేలా ప్రోత్సహించినట్టవుతుందని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. ఆదివారం మైహోం అవతార్ ప్రాజెక్టులో జరిగిన భూవరాహస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సమాజంలో దండనీతిలో లోపం ఏర్పడితే దోషాలు పెరుగుతాయని చెప్పారు. మనదేశంలో దోషంచేసిన వ్యక్తి దొరికినా దండించే వ్యక్తి దురదృష్టవశాత్తు తగినవిధంగా శిక్షించే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. వ్యక్తిని హింసించడమే కాకుండా.. దారుణమైన మారణకాండకు గురిచేసే స్థితి నెలకొన్నదని అన్నారు. ‘అరబ్ దేశాల్లో చిన్న దొంగతనమైతే నలుగురిలో వేళ్లు తీసేస్తారు.. అంతకంటే మించిన దోషం చేస్తే నడిరోడ్డులో ఉరితీస్తారు. తప్పుచేసిన వ్యక్తిని జైలులో పెట్టడం, పది పదిహేనురోజులు రిమాండ్ విధించడం కరెక్టు కాదు. అలాంటివారికి తగిన దండన విధించితీరాలి. అదీ ఎక్కడో సీక్రెట్‌గా కాకుండా.. పదిమంది చూసేట్టుగా, పదిమందికి తెలిసేట్టుగా చేయాలి. ఇంకెవరైనా అలాంటి ఆలోచన చేయాలన్నా.. ఖబడ్దార్ అనే వార్నింగ్ ఇవ్వగలిగినట్టుగా దండన ఉన్నప్పుడే ఇలాంటివి తగ్గుతాయి’ అని పేర్కొన్నారు.



## బాధితురాలి పేరును వెంటనే తొలగించాలి

కిరాతకుల చేతిలో హత్యకు గురైన వెటర్నరీ వైద్యురాలు పేరు ఎక్కడ వాడొద్దని సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ స్పష్టంచేశారు. సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఇకనుంచి బాధితురాలి పేరు కానీ, వారి కుటుంబసభ్యుల పేర్లు కానీ ప్రచారం చేయొద్దని సూచించారు. బాధితురాలి కుటుంబసభ్యులతో మాట్లాడిన పోలీసులు ఇకనుంచి పేరును జస్టిస్ ఫర్ దిశగా సంబోధించాలని కోరారు. బాధితురాలు, కుటుంబసభ్యుల పేర్లను నేరుగా వాడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. సోషల్ మీడియా, ఇతరవాటిల్లో ఎక్కడైనా బాధితురాలి పేరుఉంటే వాటిని తొలగించాలని సూచించారు. తమ కూతురుతోపాటు, కుటుంబసభ్యుల పేర్లను సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో నిరంతరం వాడుతుండటం తమను మానసిక వేదనకు గురిచేస్తున్నదంటూ బాధిత కుటుంబం సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. బాధితురాలు, వారి కుటుంబసభ్యుల పేర్లను వాడొద్దనే సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు.



జస్టిస్ ఫర్ దిశ ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం శంషాబాద్‌లో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



జస్టిస్ ఫర్ దిశ కేసులోని నిందితులను శిక్షించాలని డిమాండ్‌చేస్తూ చర్లపల్లి జైలు వద్ద ఆందోళన చేస్తున్న యువత



ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జస్టిస్ ఫర్ దిశ కేసులోని నిందితులను కఠినంగా శిక్షించాలని ర్యాలీ నిర్వహిస్తున్న నగరవాసులు

## బాలిక కిడ్నాప్‌నకు యత్నం

- గుర్తించి వెంబడించిన బంధువు
- బైక్‌తోపాటు బాలికను వదిలేసి పరారైన దుండగులు
- జియాగూడలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన




బాలిక కిడ్నాప్‌కు ఉపయోగించిన బైక్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ / కార్వాన్ / జియాగూడ:** హైదరాబాద్‌లో ఓ బాలికను ఇద్దరు యువకులు కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశారు. బాలికను గుర్తించిన బంధువొకరు వారిని నిలువరించే ప్రయత్నంచేయడంతో.. బాలికతోపాటు బైక్‌ను కూడా అక్కడే వదిలేసి పరారయ్యారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలిలా ఉన్నాయి. జియాగూడ లక్ష్మీనగర్ ప్రాంతంలో నివాసముండే బాలిక (16) శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి దగ్గర్లో ఉన్న మెడికల్‌షాప్‌కు వెళ్లింది. ఇంటికి తిరిగి వస్తుండగా కరిజ్మా బైక్ (ఏపీ28డీఎం4812) పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమెను అడ్డగించారు. బలవంతంగా బైక్‌పై కూర్చొబెట్టుకొని లంగర్‌హౌస్ వైపు బయల్దేరారు. ఇదే సమయంలో అటువైపు నుంచి వస్తున్న బాలిక బంధువొకరు.. బలవంతంగా తీసుకెళ్తున్నది గుర్తించి వారిని వెంబడించారు. గట్టిగా అరుస్తూ వెంటపడటంతో దుండగులు బైక్ నిలిపి బాలికను దింపి పరారయ్యారు. అనంతరం బాలికను ఇంటికి తీసుకెళ్లి ఆమె తల్లికి అప్పగించారు. భయపెట్టి తనను ఇద్దరు యువకులు తీసుకెళ్లారని చెప్పడం తో.. అదేరోజు రాత్రి కుల్సుంపురా పోలీసులకు తల్లి ఫిర్యాదుచేశారు. రోడ్డుపై వదిలేసిన బైక్‌ను స్వాధీనంచేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు. బాలికకు మతిస్థిమితం సరిగ్గా లేదని తెలుస్తున్నదని పోలీసులు చెప్పారు. ఒకపక్క శంషాబాద్ ఘటన కలకలం రేపుతుండగా.. కుల్సుంపురా పోలీసులు సరైన రీతిలో స్పందించలేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఫిర్యాదుచేసిన మరుసటిరోజు కేసు నమోదుచేయడం.. కిడ్నాప్ కేసును పోలీసులు తేలికగా తీసుకొన్నట్టు కనిపిస్తున్నదని బాలిక తల్లి ఆరోపించారు. కాగా, బైక్ నంబర్, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

## నిజాంపేట నిందితుడి కోసం గాలింపు

- పెండ్లి సంబంధం పేరుతో పరిచయం
- డబ్బు కోసం వేధించాడని సమాచారం

**దుండిగల్:** నిజాంపేటలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని పట్టుకొనేందుకు పోలీసులు గాలింపును మమ్మురం చేశారు. వీలైనంత త్వరగా నిందితుడిని పట్టుకొనేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నిజాంపేటలోని ఈశ్వర్‌విల్లాస్ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే యువతి శనివారం సాయంత్రం లైంగికదాడికి గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం బాధితురాలు గాంధీ దవాఖానలో కోలుకొంటున్నది. విశ్వసనీయ సమాచారంమేరకు.. టీచర్‌గా పనిచేస్తున్న తన అక్కకు రెండో పెండ్లి సంబంధం కుదిర్చేందుకు బాధిత యువతి 20 రోజులక్రితం మ్యాట్రిమోనీలో ప్రొఫైల్ పోస్ట్‌చేసింది. దీన్ని చూసిన జయ్‌చంద్ (28) అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి వారితో పరిచయం పెంచుకొన్నాడు. వారంక్రితం కూకట్‌పల్లిలోని ఓ మల్టిప్లెక్స్‌లో ముగ్గురూ కలిసి సినిమా చూశారు. శనివారం ఉదయం అక్కాచెల్లెళ్లు ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు వచ్చిన జయ్‌చంద్.. అత్యవసరంగా తనకు రూ.2 లక్షలు ఇవ్వమని బాధితురాలి అక్కను అడిగాడు. తన వద్ద అంత డబ్బు లేదని చెప్పి పంపించివేసింది. అనంతరం ఆమె యథావిధిగా స్కూల్‌కు వెళ్లిపోయింది. రాత్రి ఏడుగంటల సమయంలో ఇంటికి రాగా బయటి నుంచి తాళంవేసి ఉండటం, మంచంపై సోదరి అపస్మారకంగా పడివుండటంతో భయాందోళనకు గురై 100కు సమాచారం అందించింది. దాంతో బాచుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. పరారీలో ఉన్న నిందితుడు జయ్‌చంద్ ఆచూకీ కోసం పోలీసులు మమ్మురంగా గాలిస్తున్నారు.



పడవ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన బీట్ ఆఫీసర్ సద్దాంకు నీళ్లు తాగిస్తున్న అధికారులు

## ప్రాణహితలో పడవ మునక

మొదటిపేజీ తరువాయి...

లభించలేదు. సోమవారం తిరిగి మళ్లీ గాలింపు చర్యలు ముమ్మరం చేయనున్నట్టు పోలీస్ అధికారులు చెప్పారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబసభ్యులు ఘటనాస్థలికి చేరుకొని రోదించడం అందరినీ కలిచివేసింది. అటవీ, పర్యావరణశాఖల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఘటనపై పీసీసీఎఫ్ ఆర్ శోభ, సీసీఎఫ్ వినోద్, జిల్లా ఎస్పీ మల్లారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తి సహాయ చర్యలు చేపట్టాలని ఎస్పీని ఆదేశించారు. కాగా, గల్లంతైన ఇద్దరు ఎఫ్‌బీవోలు మూడు నెలల క్రితమే విధుల్లోచేరారు.

## పబ్‌లో గూండాగిరీ

మొదటిపేజీ తరువాయి...

ఆ యువతులను దుర్భాషలాడటంతోపాటు చేతిలో ఉన్న గ్లాసును నేలకేసి కొట్టి బెదిరించాడు. ఈ తతంగాన్ని ఆపాల్సిన బౌన్సర్ అజర్ కూడా యువతులనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని కేకలేసి వారిని అవమానపర్చాడు. ఆశిష్‌గౌడ్ దుశ్చర్యతో తీవ్ర మనోవేదనకు గురైన ఆ సినీనటి అర్ధరాత్రి 2 గంటల సమయంలో మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఆశిష్‌గౌడ్‌తోపాటు మరో ఇద్దరు నిందితులపై ఐపీసీ 354. 354ఏ, 509 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదుచేసుకొని ఆ పబ్‌లోని సీసీ కెమెరాల వీడియో ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని పట్టుకొంటామని మాదాపూర్ పోలీసులు తెలిపారు. ఆశిష్‌గౌడ్ గతంలోనూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి.

## ఓదార్పు వద్దు.. న్యాయం కావాలి

- శంషాబాద్ నక్షత్ర కాలనీవాసుల డిమాండ్
- కాలనీలోకి మీడియా, నేతలు రాకుండా గేట్లుమూత

**శంషాబాద్:** తమకు పరామర్శలు, ఓదార్పు వద్దని.. తమ కాలనీ బిడ్డకు న్యాయం జరుగాలంటూ శంషాబాద్ నక్షత్ర కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సానుభూతి పేరుతో రాజకీయ నేతలు, మీడియా ఎవరూ రావద్దంటూ కాలనీ గేట్లు మూసివేశారు. దీంతో కాలనీ వద్ద ఆదివారం ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. జస్టిస్ ఫర్ దిశ ఘటన జరిగిన నాటినుంచి ఆమె కుటుంబాన్ని పరామర్శించేవారి తాకిడి పెరిగింది. వచ్చిపోయే వాహనాలు, రాజకీయనేతల కాన్వాయ్‌లతోపాటు నక్షత్రకాలనీ కోలాహలంగా మారింది. దీంతో ఇటు జస్టిస్ ఫర్ దిశ కుటుంబసభ్యులతోపాటు, కాలనీవాసులు విసిగిపోయారు. పరామర్శలు, ఓదార్పు, సానుభూతి వద్దు.. న్యాయంకావాలి అంటూ నినాదాలు చేశారు. కాలనీలోకి మీడియా, పోలీసులు, నేతలను ఎవరికీ అనుమతిలేదంటూ బోర్డులు పెట్టారు. దీంతో కాలనీ ఎదుట ఉద్రిక్తత చోటుచేసుకున్నది.




పరామర్శలు వద్దని న్యాయంకావాలని గేటుమూసి నిరసన తెలుపుతున్న నక్షత్ర కాలనీవాసులు

కొద్దిసేపటి తర్వాత కొద్దిమంది నేతలకు అనుమతిచ్చారు. మీడియా ప్రతినిధులు గేట్ బయట మీడియా పాయింట్‌ను ఏర్పాటుచేసుకున్నారు.

**నిందితులను కఠినంగా శిక్షించాలి: ఐఎంఏ అధ్యక్షుడు శంతనుసేన్**

జస్టిస్ ఫర్ దిశ నిందితులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షుడు, ఎంపీ శంతనుసేన్ డిమాండ్‌చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఐఎంఏ వార్షిక సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటన అత్యంత బాధాకరమన్నారు. నిందితులకు కఠినశిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఐఎంఏ తరపున అభ్యర్థన లేఖను సమర్పించాలని తెలంగాణశాఖకు సూచించారు.

## భయం వీడు.. ధైర్యంగా ఉండు

- ఏ ఆపదొచ్చినా పోలీసు సాయం పొందండి
- మహిళలకు ట్రై కమిషనరేట్ పోలీసుల సూచన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మహిళల భద్రతకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీసులు భరోసా కల్పిస్తున్నారు. టెక్నాలజీపరమైన ఎన్నో సంస్కరణలు అందుబాటులోకి తెచ్చారు. ఆపదలో మహిళలకు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామని, పోలీసు సేవలు వినియోగించుకోవాలని, భయం వీడి ధైర్యంగా ఉండాలని ట్రై కమిషనరేట్ల పోలీసులు సూచిస్తున్నారు.

**సేవ చేసేందుకు పోలీసులు సిద్ధం**



ఎలాంటి పరిస్థితుల్లోనైనా మీకు సేవ చేసేందుకు పోలీసులు సిద్ధంగా ఉంటారు. డయల్ 100కు ఫోన్ చేయండి. ప్రతి ఒక్కరు తమ సెల్‌ఫోన్‌లో హాక్ ఐ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. ఒంటరిగా ఉన్న సమయంలో మీకు భయంగా ఉంటే.. ఫోన్‌లో బంధువులు, స్నేహితులు, పోలీసులతో మాట్లాడండి. ఆ చుట్టుపక్కల ఉండే వాహనాలు, అనుమానితుల ఫొటోలు తీసి పంపించండి. హైదరాబాద్ పోలీసు వాట్సప్ 9490616555 నంబర్‌కు సమాచారం ఇవ్వండి. ఆపదొస్తే గట్టిగా అరుస్తూ అక్కడినుంచి బయటపడాలి.

**-అంజనీకుమార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్**

**నిరంతరం పోలీసుల సేవలు**



ఆపద ఉన్నదని మహిళలు, యువతులు, బాలికలు, వృద్ధులు ఎవరైనా ఒక్క ఫోన్ కాల్ చేస్తే ఐదు నిమిషాల్లో మేం ముందుంటాం. మీ భద్రత కోసమే మేమున్నాం. డయల్ 100, రాచకొండ వాట్సప్ 9490617111కు సమాచారం ఇవ్వండి. ఎప్పుడు అభద్రతాభావం అనిపించినా పోలీసులకు సమాచారం అందించండి. 24 గంటలూ పోలీసు సేవలు పొందవచ్చు.

**-మహేశ్‌భగవత్, రాచకొండ పోలీస్ కమిషనర్**

**మీ కోసమే పోలీస్**



పోలీసులు నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తున్నారు. ఆపదలో ఉన్నవారు నిస్సంకోచంగా పోలీసులకు ఫోన్‌చేసి సాయం పొందండి. డయల్ 100 అనేది ఎంతో కీలకమైంది. ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్‌లో స్పీడ్ డయల్‌లో 100 నంబర్ సేవ్ చేసుకోండి. సైబరాబాద్ వాట్సప్ 9490617444 ద్వారా సమాచారం ఇవ్వండి.

**- సైబరాబాద్ పోలీస్ కమిషనర్, వీసీ సజ్జనార్**

## యువతితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన కాచిగూడ పోలీసులు

**కాచిగూడ:** వాట్సప్‌లో అశ్లీలచిత్రాలు పంపుతూ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిని కాచిగూడ పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్‌లోని రాయల్ డిమ్ అపార్ట్‌మెంట్‌లో నివసించే జైనలబొద్దీన్ ఖాన్ కుమారుడు మహ్మద్ వాహిదొద్దీన్‌ఖాన్ (43) నిరుద్యోగి. హిమాయత్‌నగర్‌లోని మెడికల్ దుకాణంలో పనిచేసే ఇసామియాబజార్‌కు చెందిన పంకజ్‌తో ఇతడికి స్నేహం ఏర్పడింది. కొన్ని నెలలుగా పంకజ్ నివాసానికి వాహిదొద్దీన్ వస్తుండటంతో.. ఆయన మైనర్ కూతురుతో పరిచయం ఏర్పడింది. అమ్మాయి ఫోన్ నంబర్ తీసుకొన్న వాహిదొద్దీన్.. తరుచుగా అశ్లీల చిత్రాలు, అసభ్యకర సందేశాలు వాట్సప్ ద్వారా పంపుతున్నాడు. గత నెల 28న అర్ధరాత్రి కూడా ఇదేమాదిరిగా అసభ్యకర చిత్రాలను పంపడంతో.. మరుసటిరోజు ఆ యువతి విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. దాంతో వాహిదొద్దీన్‌ను మందలించారు. అయినప్పటికీ అతనిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో శనివారం రాత్రి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దాంతో వాహిదొద్దీన్‌ఖాన్‌ను అరెస్ట్‌చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

## ముమ్మరంగా ఎత్తిపోత

మొదటిపేజీ తరువాయి...

తరలింపును ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

**లక్ష్మి పంప్‌హౌస్ నుంచి నాలుగు మోటర్లతో ఎత్తిపోత**

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి (కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో ఆదివారం ఇంజినీర్లు నాలుగు మోటర్లను నడిపించారు. 4, 6, 8, 10వ నంబర్ మోటర్ల ద్వారా సరస్వతి (అన్నారం) బరాజ్‌కు 8,480 క్యూసెక్కుల నీటిని తరలించారు. సరస్వతి బరాజ్‌లో ప్రస్తుతం 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

## హంతకులను ఉరితీయాలని ఆత్మహత్యాయత్నం

**వైరా, నమస్తే తెలంగాణ:** జస్టిస్ ఫర్ దిశ హంతకులను ఉరితీయాలని డిమాండ్‌చేస్తూ ఖమ్మం జిల్లా వైరా పట్టణానికి చెందిన డిగ్రీ విద్యార్థి మట్టా రోహిత్ ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. రోహిత్ పాత బస్టాండ్ సెంటర్‌లో వ్యాపార దుకాణంపైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హత్య వార్తలను చూస్తూ చలించిపోయానని చెప్పాడు. కేటీఆర్ అన్న ఆ నలుగురిని వెంటనే ఉరి తీయాలంటూ తెలుగు, ఇంగ్లిష్ అక్షరాలతో రెండు వాల్‌పోస్టర్లు రాసి బిల్డింగ్‌పై ఏర్పాటుచేశా డు. ఎస్సై నరేశ్.. రోహిత్‌ను శాంతింపజేసి స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు.



వైరాలో భవనం ఎక్కి ఆందోళన చేస్తున్న రోహిత్





తెలంగాణ అమరవీరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం శివాయిపల్లిలోని ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. కిష్టయ్య కుమారుడు రాహుల్ మాట్లాడుతూ.. నాన్న త్యాగం వృథా కాలేదనీ, సీఎం కేసీఆర్ అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకున్నారని తెలిపారు. - రాజంపేట్

హైదరాబాద్ గన్‌పార్కులో అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో పోలీస్ అమరుడు కిష్టయ్య వర్ధంతి సందర్భంగా మంత్రి ఈటెల రాజేందర్, ఎంపీ బండా ప్రకాశ్, మహాసభ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ నివాళులర్పించారు. - తెలుగుయూనివర్సిటీ



జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి క్షేత్రాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీ కేశవరావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు న్యాయమూర్తిని శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. - ఎర్రవల్లి చౌరస్తా



యాదాద్రి భక్తులతో సందడిగా మారింది. సెలవురోజు కావడంతో ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. లక్ష్మీనరసింహుడిని దర్శించుకునేందుకు గంటలకొద్దీ క్యూకట్టారు. శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రత పూజల్లోనూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీవారి ఖజానాకు రూ.26,31,393 ఆదాయం సమకూరిందని ఆలయ వర్గాలు తెలిపాయి. - యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ





నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో మినీస్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి వేముల

## పనులు నాణ్యతగా చేపట్టాలి

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**కమ్మర్‌పల్లి, నమస్తే తెలంగాణ:** ప్రజల సౌకర్యార్థం రూ.కోట్లు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. కమ్మర్‌పల్లిలో రూ.2.80 కోట్లతో చేపట్టిన మినీ స్టేడియం పనులను పరిశీలించి, నిర్మాణ పనుల గురించి స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. కమ్మర్‌పల్లి నుంచి మోర్తాడ్ మీదుగా వేల్పూర్ వెళ్లే దారిలో ఉన్న మోర్తాడ్‌లోని తక్కూరివాడలో డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. బాల్కొండలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మారుతీజ్యోషి కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు.

# మక్కజొన్నకు మంచి ధర

కనీస మద్దతు ధరకు మించి కొనుగోళ్లు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలో మక్కజొన్న రైతులకు మళ్లీ మంచి రోజులొచ్చాయి. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందు అడ్డగోలుగా మక్కల ధర తగ్గించి రైతులను ముంచిన వ్యాపారులు.. ఇప్పుడు పోటీపడి మంచి ధరలకు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.1,760 కనీస మద్దతు ధరను (ఎమ్మెస్పీని) మార్క్‌ఫెడ్ నిర్ణయించగా.. వ్యాపారులు రూ.1,800 నుంచి రూ.1,919 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఎమ్మెస్పీ కంటే రూ.159 వరకు అదనంగా పొందుతున్నారు. సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.2,320 పలికిన మక్కల ధరను ఆ తర్వాత వ్యాపారులు క్రమంగా తగ్గించి ఒకదశలో రూ.1,300కు కొనుగోలు చేశారు. ఆ తర్వాత మార్క్‌ఫెడ్ రాష్ట్రవ్యాప్తంగా 44 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసింది. దీంతో దళారుల చేతుల్లో నష్టపోకుండా రైతులు నేరుగా మక్కలను కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దీన్ని గుర్తించిన ప్రైవేటు వ్యాపారులు నాలుగైదు రోజుల నుంచి రేట్లు పెంచి మక్కలను కొనుగోలు చేస్తున్నారు.



రాష్ట్రంలోని వివిధ మార్కెట్లలో మక్కల ధరలు

| మార్కెట్ | మోడల్ ధర | గరిష్ఠ ధర |
|---|---|---|
| ఖమ్మం | రూ.1,801 | రూ.1,801 |
| కేసముద్రం | రూ.1,860 | రూ.1,919 |
| వరంగల్ | రూ.1,779 | రూ.1,861 |
| నర్సంపేట | రూ.1,802 | రూ.1,820 |
| ఖానాపూర్ | రూ.1,760 | రూ.1,760 |
| మహబూబాబాద్ | రూ.1,786 | రూ.1,815 |

## వరంగల్ కమిషనరేట్‌లో 100కు చేరిన పీడీ కేసులు

**వరంగల్ క్రైం:** నేరాల నియంత్రణకు పాత నేరస్థులపై వరంగల్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. నేరస్థులు సమాజంలో తిరుగుతూ ప్రజలకు హాని తలపెట్టకుండా ఏ స్థాయి నేరానికి పాల్పడుతున్నారో పరిశీలించి కటకటాల్లోకి పంపిస్తున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా విశ్వనాథ రవీందర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత గత 19 నెలల్లో కమిషనరేట్ పరిధిలోని వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగామ జిల్లాల పరిధిలో 93 మందిపై పీడీ యాక్టు నమోదు చేశారు. ఆదివారం అంతరాష్ట్ర దొంగపై పెట్టిన పీడీ యాక్టుతో మొత్తం 100కు చేరాయి. వీటిలో సెంట్రల్ జోన్‌లో 68, ఈస్ట్‌జోన్ పరిధిలో 11, వెస్ట్‌జోన్ పరిధిలో 21 మందిపై పీడీ యాక్టు కేసులు నమోదయ్యాయి.



వనపర్తి జిల్లా రాజపేటలోని హన్మండ్ల చెరువులో పూజలు నిర్వహిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## యాసంగికి పుష్కలంగా నీరు

మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి రూరల్ :** యాసంగి సాగుకు పుష్కలంగా నీరున్నదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం చెరువులను నీటితో నింపామన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా రాజపేట శివారులోని హన్మండ్ల చెరువు కృష్ణమ్మ నీటితో అలుగుపారడంతో గ్రామస్థులతో కలిసి మంత్రి పూజలు చేశారు. హన్మండ్ల చెరువు ఎంజీకేఎల్‌ఐకు చివరి చెరువుగా ఉన్నదన్నారు. గతంలో ఈ చెరువుకు నీళ్లు వస్తాయో, రావో అని రైతులు అనుకున్నారని, ఇప్పుడు నీళ్లు తెచ్చామన్నారు. ఈ నీటితో యాసంగి పంట సాగు చేయడానికి అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని, రైతులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా కేంద్రాల్లోనే అమ్ముకోవాలని మంత్రి కోరారు.

## న్యాయం చేయాలని మహిళ ఆందోళన

- బ్లాక్‌మెయిల్ చేసి రూ. 12 లక్షలు వసూలు
- నిందితుని ఇంట్లో బైఠాయించిన బాధితురాలు

**మోర్తాడ్:** తనను బ్లాక్‌మెయిల్ చేసి రూ.12 లక్షలు వసూలు చేసిన వ్యక్తి ఇప్పుడు మొహం చాటేస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఓ మహిళ ఆందోళనకు దిగిన ఘటన నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లో ఆదివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన రజిత అనే మహిళను అదే గ్రామానికి చెందిన గాలి ప్రదీప్ వెంటపడి లోబర్చుకొని ఫొటోలు, వీడియోలు తీశాడు. వాటిని ఆమె భర్తకు పంపుతానంటూ బ్లాక్‌మెయిల్ చేసి రూ.12 లక్షలు తీసుకున్నాడు. ఇటీవల గల్ఫ్ నుంచి గ్రామానికి వచ్చిన రజిత భర్త మహేందర్ ఈ విషయం తెలుసుకుని ఆమెను ఇంట్లోంచి వెళ్లగొట్టాడు. దీంతో డబ్బులు ఇవ్వాలంటూ ప్రదీప్‌ను అడగ్గా.. 'ఏం చేసుకుంటావో చేసుకో' అంటూ బెదిరిస్తున్నాడని బాధితురాలు వాపోతున్నది. తనకు న్యాయం చేయాలం టూ మహిళా సంఘాలతో కలిసి ఆదివారం ఉదయం నుంచి ప్రదీప్ ఇంట్లో బైఠాయించింది. విషయం తెలుసుకున్న సీఐ సైదయ్య, ఎస్సై సంపత్‌కుమార్ అక్కడికి వెళ్లి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ వారికి సూచించగా, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని రజిత పేర్కొన్నది.



ప్రదీప్ ఇంట్లో బైఠాయించిన రజిత



ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి దంపతులు

## ఏపీలో మంత్రి జగదీశ్‌రెడ్డి పర్యటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఏపీ పర్యటనలో ఉన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగిన తన స్నేహితుడి కుమార్తె వివాహానికి హాజరయ్యారు. అనంతరం అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి, పాలకొల్లు క్షీరరామలింగేశ్వర స్వామి దేవాలయం, పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలోని రామేశ్వర ఆలయాలను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఉన్నత విద్యామండలి సభ్యులు ఒంటెద్దు నరసింహారెడ్డి, దయాకర్‌రెడ్డి ఉన్నారు. ఏపీ గృహ నిర్మాణశాఖ మంత్రి రంగనాథరాజును జగదీశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

## రైల్వే లైన్లు ఏర్పాటు చేయాలని కోరాం

రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

**నకిరేకల్, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైల్వే సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ తెలిపారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నడికుడి నుంచి బీబీనగర్‌కు డబ్లింగ్, చిట్యాల నుంచి జగ్గయ్యపేటకు నూతన రైల్వేలైన్ ఏర్పాటు, నారాయణాద్రి, శబరి ఎక్స్‌ప్రెస్‌లు నల్లగొండలో నిలపాలని, ఎంఎంటీఎస్‌ను యాదాద్రి వరకు నడపాలని, దామరచర్ల మండలం విష్ణుపురం నుంచి హుజూర్‌నగర్ మీదుగా జగ్గయ్యపేట లైన్‌లో ప్యాసింజర్ రైలు నడపాలని రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. శంషాబాద్‌లో పశువైద్యురాలు దారుణ హత్యకు గురవ్వడం దురదృష్టకరమన్నారు.



లింగయ్యయాదవ్



గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి చాలెంజ్‌ను స్వీకరించిన కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మహబూబ్‌నగర్, రాజన్న సిరిసిల్ల, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ కలెక్టర్లకు గ్రీన్‌చాలెంజ్ విసిరారు. - కరీంనగర్ కార్పొరేషన్, నమస్తేతెలంగాణ



గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదివారం మొక్కలు నాటి నీరు పోశారు. - మణుగూరు, నమస్తేతెలంగాణ



జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ సామాజిక దవాఖానలో శనివారం ఒకేరోజు 12 మంది శిశువులు పురుడు పోసుకున్నారు. వీరిలో 11 మంది మగ, ఒక ఆడ శిశువు ఉన్నారు. గైనకాలజిస్ట్ శ్రీలక్ష్మి 12 మంది గర్భిణులకు కాన్పు చేశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యురాలు తెలిపారు. - కోరుట్లటౌన్

# అన్నదాతకు అండగా..

- భానుపురి రైతు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యాప్
- సూర్యాపేట కలెక్టర్ సరికొత్త ఆలోచన
- ఇటీవల ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి







రైతు సమస్యలపై రూపొందించిన యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి (ఫైల్)

**సూర్యాపేట జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రైతుల భూ సమస్యలతోపాటు ఇతర ఎలాంటి అంశమైనా ఇంటి నుంచే పరిష్కరించుకునేందుకు సూర్యాపేట కలెక్టర్ దుగ్యాల అమయ్‌కుమార్ సరికొత్త ఆలోచన చేశారు. కొద్దిపాటి అక్షర జ్ఞానం ఉండి ఆండ్రాయిడ్ ఫోన్లు వాడే వారు వినియోగించుకొనేలా 'భానుపురి రైతన్నల కోసం' పేరుతో ఓ యాప్‌ను రూపొందించారు. భూములకు సంబంధించిన అన్ని వివరాలు, ప్రభుత్వపరంగా అందే అన్ని సేవలను దీని ద్వారా పరిష్కరించుకొనే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసినప్పటి నుంచి పరిష్కారం అయ్యేవరకు స్టేటస్‌ను సైతం చెప్పడం దీని ప్రత్యేకత. ఇందుకోసం కలెక్టరేట్ నుంచి ప్రత్యేక అధికారి ద్వారా మానిటరింగ్ చేయనున్నారు. ఇటీవల విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఈ యాప్‌ను ప్రారంభించగా ఇప్పటివరకు సుమారు 15 మంది తమ ఫిర్యాదులను యాప్ ద్వారా దరఖాస్తు చేశారని వాటి పరిష్కారాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

**యాప్ వాడకం చాలా సులువు..**

ఆండ్రాయిడ్ ఫోన్ వాడటం తెలిసిన వారు ఈ యాప్‌ను చాలా సులువుగా ఉపయోగించవచ్చని అధికారులు తెలిపారు. గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి తమ పాస్‌బుక్ నంబర్, సెల్‌ఫోన్ నంబర్‌తో లాగిన్ కావాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అన్ని వ్యవసాయ పథకాల వివరాలు, పంటల సాగు విధానం, ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడే విధానం గురించి ఉంటుంది. రైతుబంధు, రైతు బీమాతోపాటు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాల వివరాలు ఈ యాప్‌లో పొందుపర్చారు. రైతులు యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే కలెక్టరేట్‌లోని మానిటరింగ్ కేంద్రానికి చేరుకుంటుంది. వారు సంబంధిత శాఖకు పంపించి 24 గంటలకోసారి ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందనేది విచారణ చేస్తారు. దీంతో ఈ యాప్ ద్వారా చేసే ఫిర్యాదులు వెనువెంటనే పరిష్కారానికి నోచుకునే అవకాశం ఉంది. ఇప్పటివరకు దాదాపు 15 దరఖాస్తులు రాగా పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నాయని మానిటరింగ్ టీం ఇంచార్జి గఫార్ తెలిపారు.

### అవగాహన కోసం ప్రచారం చేస్తున్నాం



ఈ యాప్ ఇటీవలే ప్రారంభమైనందున రైతులకు అవగాహన కల్పించేందుకు విరివిగా ప్రచారం చేపడుతున్నాం. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది జిల్లాలోని ఆండ్రాయిడ్ ఫోన్లు ఉన్న రైతులు, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ యాప్ ద్వారా ఏయే సమస్యలపై ఎలా ఫిర్యాదు చేయవచ్చు, పంటల సాగుకు కావాల్సిన సలహాలతోపాటు తదితర విధానాన్ని ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తాం. నిర్ణీత గడువులోపు సమస్యలు పరిష్కారం దొరుకుతుంది. ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు కూడా ఉంటాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – దుగ్యాల అమయ్‌కుమార్, కలెక్టర్, సూర్యాపేట

## వరికోత యంత్రం కిందపడి రైతు మృతి

**సత్తుపల్లి రూరల్:** పొలంలో వరి కోత యంత్రం కింద పడి రైతు మృతి చెందిన ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టాపురంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన నాగరాజు అనే వ్యక్తి వరి కోత యంత్రాలను అద్దెకు తిప్పుతుంటాడు. గ్రామానికి చెందిన పొన్నగంటి ధర్మారావు (32) అనే రైతు తన పొలంలో యంత్రం ద్వారా వరి కోయిస్తున్న సమయంలో డ్రైవర్ గమనించక అతనిపై నుంచి వాహనం వెళ్లింది. తీవ్రంగా గాయపడిన ధర్మారావును సత్తుపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సైకో వీరంగం

**కొత్తగూడెం క్రైం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఓ సైకో ఆదివారం రాత్రి వీరంగం సృష్టించాడు. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లో ఓ యువకుడు పలువురిపై రాళ్లు రువ్వగా స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. అప్రమత్తమైన ఆటో డ్రైవర్లు, ట్యాక్సీవాలాలు సైకోను పట్టుకొని కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. క్షతగాత్రులను కొత్తగూడెం ఏరియా దవాఖానకు తరలించారు.

## భద్రాద్రి రామాలయ ఈవోగా నరసింహులు

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థాన ఈవోగా జీ నరసింహులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈవో తాళ్లూరి రమేశ్‌బాబు పదవీ విరమణ చేయడంతో ఖాళీగా ఉన్న పోస్టుకు ప్రభుత్వం వరంగల్ డీసీగా పని చేస్తున్న నర్సింహులును నియమించింది. ఆయన ఆదివారం ఈవో కార్యాలయానికి వచ్చి రికార్డులపై సంతకం చేసి పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు స్వీకరించారు.



### చలికాలం


| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం | జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|---|---|---|
| వికారాబాద్ | 15.4 | 34.7 | సిద్దిపేట | 20.0 | 28.0 |
| ఆదిలాబాద్ | 16.2 | 29.8 | జయశంకర్ భూపాలపల్లి | 20.0 | 29.0 |
| నిర్మల్ | 17.0 | 28.0 | కామారెడ్డి | 20.0 | 29.0 |
| మంచిర్యాల | 17.2 | 33.2 | జనగామ | 20.1 | 26.0 |
| మెదక్ | 17.3 | 32.5 | నిజామాబాద్ | 20.2 | 30.5 |
| రంగారెడ్డి | 18.0 | 25.0 | వరంగల్ అర్బన్ | 20.5 | 31.5 |
| వరంగల్ రూరల్ | 18.0 | 28.0 | హైదరాబాద్ | 20.9 | 29.2 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 18.0 | 30.0 | మేడ్చల్ | 20.9 | 29.2 |
| జగిత్యాల | 18.0 | 30.0 | జోగుళాంబ గద్వాల | 21.0 | 24.0 |
| కరీంనగర్ | 18.3 | 33.2 | మహబూబాబాద్ | 21.0 | 28.0 |
| రాజన్న సిరిసిల్ల | 19.0 | 28.0 | సూర్యాపేట | 21.0 | 29.0 |
| వనపర్తి | 19.3 | 29.5 | పెద్దపల్లి | 21.0 | 30.0 |
| సంగారెడ్డి | 19.5 | 28.4 | యాదాద్రి భువనగిరి | 22.0 | 29.0 |
| నల్లగొండ | 19.6 | 28.4 | ఖమ్మం | 22.0 | 29.0 |
| నాగర్‌కర్నూల్ | 20.0 | 27.0 | ములుగు | 22.0 | 30.0 |
| | | | భద్రాద్రి కొత్తగూడెం | 22.0 | 31.0 |
| | | | మహబూబ్‌నగర్ | 22.4 | 27.4 |
| | | | నారాయణపేట | 22.4 | 27.4 |

# కర్ణాటకదే ముస్తాక్ అలీ ట్రోఫీ

ఫైనల్లో మనీశ్ మెరుపులు
శంకర్ పోరాటం వృథా
పరుగు తేడాతో తమిళనాడు ఓటమి



**సూరత్ :** చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో తమిళనాడుపై విజయం సాధించిన కర్ణాటక జట్టు సయ్యద్ ముస్తాక్ అలీ టీ20టోర్నీ టైటిల్‌ను వరుసగా రెండో సారి కైవసం చేసుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన తుదిపోరులో ఒక్కపరుగు తేడాతో తమిళనాడుపై కన్నడ జట్టు విజయం సాధించింది. కెప్టెన్ మనీశ్ పాండే(45బంతుల్లో 60 నాటౌట్) అదరగొట్టడం సహా రోహన్ కదమ్(35), దేవ్‌దత్ పడిక్కల్(32) రాణించడంతో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 180పరుగుల భారీ స్కోరు చేయగలిగింది. తమిళ బౌలర్లలో రవిచంద్రన్ అశ్విన్, మురుగన్ అశ్విన్ చెరో రెండు వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో విజయ్ శంకర్(27 బంతుల్లో 44), బాబా అపరాజిత్(25 బంతుల్లో 40) రాణించినా తమిళనాడు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి.. ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. 80పరుగులకే 4వికెట్లు కోల్పోయిన దశలో అపరాజిత్ – శంకర్ ఐదో వికెట్‌కు 71పరుగులు జోడించి తమిళనాడును పటిష్ఠ స్థితికి తీసుకొచ్చారు. చివరి ఓవర్లో 13పరుగులు చేయాల్సిన దశలో కన్నడ స్పిన్నర్ కృష్ణప్ప గౌతమ్ బౌలింగ్‌లో తమిళ సీనియర్ రవిచంద్రన్ అశ్విన్(16నాటౌట్) తొలి రెండు బంతుల్లో రెండు ఫోర్లు బాదినా ఫలితం లేకుండా పోయింది. ఐదో బంతికి శంకర్ రనౌట్ కావడంతో చివరి బంతికి మూడు పరుగులు కావాల్సి రాగా.. ఒక్క పరుగే వచ్చింది.




# లక్ష్యాలను విస్మరించవద్దు

**వడోదర:** భారత మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే విద్యార్థులకు దిశానిర్దేశం చేశాడు. ఎంచుకున్న లక్ష్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని విద్యార్థులకు సూచించాడు. పారుల్ విశ్వవిద్యాలయ మూడవ వార్షిక స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కుంబ్లే పలు అంశాలపై మాట్లాడాడు. 'కెరీర్ ఆరంభంలో చాలా మంది నన్ను తక్కువ అంచనా వేశారు. భారత జట్టుకు ఎక్కువ రోజులు ఆడవంటూ దెప్పిపొడిచారు. కానీ వారి అంచనాలను తప్పని నిరూపిస్తూ ఆత్మవిశ్వాసం, కఠిన ప్రాక్టీస్‌తో ఒక్కో మెట్టు ఎదిగాను. విజయానికి ఆత్మవిశ్వాసమే కీలకం. నీపై నీకు నమ్మకముంటే ఎంతటి అవరోధాలు, వైఫల్యాలు, విమర్శలను తిప్పికొట్టవచ్చు. ఒక బౌలర్‌గా టెస్టుల్లో 619 వికెట్లు తీసినట్లు చాలా మందికి తెలుసు, కానీ ఈ రికార్డు అందుకోవడానికి 40 వేల బంతులు వేసినట్లు ఎవరి కి తెలియదు' అని కుంబ్లే అన్నాడు. 4,500 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిసి పాల్గొన్న కార్యక్రమంలో కుంబ్లేతో పాటు మాజీ మిస్ వరల్డ్ మానుషి చిల్లార్, పారుల్ యూనివర్సిటీ అధ్యక్షుడు దేశాంశ్ పటేల్, ఎమ్‌ఎన్ పటేల్, రిజిస్ట్రార్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేసర్ల మధ్య అసూయ లేదు


కోహ్లీ

**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియాలో పేసర్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉందని కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. వారి మధ్య ఎలాంటి అసూయ లేదని, అందరూ సరదాగా ఉంటారని ఆదివారం ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. ప్రస్తుతం ప్రపంచంలో టీమ్‌ఇండియా అత్యుత్తమ పేస్ దళమని కొనియాడాడు. 'పేసర్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంది. ప్రతి ఒక్కరు నమ్మకంతో ఉన్నారు. వారు వాదించుకోవడం నేనెప్పుడూ చూడలేదు. ఎలాంటి ఈర్ష్య, అసూయ లేకపోవడమే వారికి అది పెద్ద బలం. ర్యాంకులను వారు అసలు పట్టించుకోరు. అందరూ చాలా సరదాగా ఉంటారు' అని కోహ్లీ చెప్పాడు. ఓడిపోవడాన్ని తానెప్పుడూ ఇష్టపడనని, మైదానంలో అడుగుపెట్టాక శక్తి మొత్తం అయిపోయే వరకు క్రీజులోనే ఉండాలనుకుంటానని విరాట్ తెలిపాడు. కొంతకాలంగా టెస్టుల్లో షమీ, ఇషాంత్ శర్మ, ఉమేశ్ యాదవ్ రాణిస్తుండడంతో బుమ్రా గాయం నుంచి కోలుకుంటే పేసర్ల మధ్య తీవ్ర పోటీ ఉండనుంది.

# రూట్, బర్న్స్ సెంచరీలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 269/5


రూట్(114★)

**హామిల్టన్:** న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో ఇంగ్లండ్ పోటీలోకి వచ్చింది. వర్షం కారణంగా పూర్తి ఓవర్లు జరుగని మూడో రోజు ఆటలో ఇంగ్లండ్ ఆకట్టుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 39/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్..జో బర్న్స్(209 బంతుల్లో 101, 15 ఫోర్లు), కెప్టెన్ జో రూట్(278 బంతుల్లో 114 నాటౌట్, 14 ఫోర్లు) సెంచరీలతో 5 వికెట్లకు 269 పరుగులు చేసింది. 24 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయిన దశలో బర్న్స్, రూట్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరు కివీస్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జోడించారు. ముఖ్యంగా ఫామ్‌లేమితో సతమతమవుతున్న రూట్ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. బౌండరీలు బాదుతూ కివీస్ బౌలర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశాడు. అయితే రనౌట్ రూపంలో బర్న్స్ ఔట్ కావడంతో 177 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత ఇంగ్లండ్ ఇన్నింగ్స్ తడబడింది. 61 పరుగుల వ్యవధిలో స్టోక్స్(26), క్రావ్లె(1) వికెట్లు కోల్పోయింది. రూట్‌తో పాటు పోప్(4) క్రీజులో ఉన్నారు. సౌథీ(2) రెండు వికెట్లు తీయగా, హెన్రీ, వాగ్నర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. చేతిలో ఐదు వికెట్లు ఉన్న ఇంగ్లండ్ ఇంకా 106 పరుగుల వెనుకంజలో ఉంది.

# వరుసగా ఐదో 'డ్రా'






**కేరళ :** ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్‌ఎల్)లో 'డ్రా'ల పరంపర కొనసాగుతున్నది. ఇంజూరీ టైమ్‌లో లెన్నీ రోడ్రిగ్స్ అద్భుత గోల్ చేయడంతో ఆదివారం ఇక్కడ కేరళ బ్లాస్టర్స్‌తో జరిగిన మ్యాచ్‌ను ఎఫ్‌సీ గోవా 2–2తో సమం చేసుకోగలిగింది. దీంతో ఆరో సీజన్‌లో వరుసగా ఐదో డ్రా నమోదైంది. మ్యాచ్ రెండో నిమిషంలోనే సెరిగో సిండోన్‌చా అద్భుత షాట్‌తో గోల్ చేయడంతో కేరళ ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక తొలి అర్ధభాగం ముగిసే నాలుగు నిమిషాల ముందు గోవా ఆటగాడు మౌర్తదా ఫాల్(41వ నిమిషం) స్కోర్లను సమయం చేశాడు. ఆ తర్వాత పోరు హోరాహోరీగా సాగగా.. 59వ నిమిషంలో మెస్సీ బౌలీ గోల్ చేయడంతో కేరళ మరోసారి ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక మ్యాచ్ బ్లాస్టర్స్‌దే అనుకుంటుండగా ఇంజూరీ టైమ్ మూడో నిమిషంలో గోవా ఆటగాడు లెన్నీ రోడ్రిగ్స్(90+3వ ని.) చూడచక్కని షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపడంతో మ్యాచ్ సమమైంది.

# మార్పులు మొదలు

పదవీ కాలం సడలింపునకు బీసీసీఐ ఏజీఎం ఆమోదం
సుప్రీం అంగీకారమే తరువాయి
విరుద్ధ ప్రయోజనాలపైనా చర్చ
ఐసీసీ సీఈసీలో బీసీసీఐ ప్రతినిధిగా జై షా



**అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీ నేతృత్వంలో జరిగిన తొలి వార్షిక సర్వసభ్య సమావేశంలో బీసీసీఐ కీలక నిర్ణయాలు తీసుకుంది. జస్టిస్ లోధా కమిటీ సంస్కరణల్లోని పదవీ కాలం పరిమితిని సడలించేందుకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలకు సుప్రీం కోర్టు అంగీకరిస్తే దాదా 2024వరకు బీసీసీఐ బాస్‌గా కొనసాగే అవకాశం ఉంది. ఐసీసీ సీఈసీలో బోర్డు ప్రతినిధిగా బీసీసీఐ కార్యదర్శి జై షా ఎంపికయ్యాడు. మాజీ క్రికెటర్లకు సమస్యగా మారిన పరస్పర విరుద్ధ ప్రయోజనాలపైనా గంగూలీ టీమ్ తీవ్రంగా చర్చించింది. అలాగే, సెలెక్షన్ కమిటీ గడువు ముగిసిందని దాదా స్పష్టతనిచ్చాడు.**

**ముంబై :** పరిపాలనలో మార్పులు తీసుకొస్తానని బాధ్యతలు చేపట్టినప్పుడే చెప్పిన బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఆ దిశగా ముందడుగు వేశాడు. 2015 నుంచి అమలులోకి వచ్చిన జస్టిస్ లోధా కమిటీ సంస్కరణల్లో ఆఫీస్ బేరర్ల పదవీ కాలం నిబంధనలను సడలించాలని దాదా నేతృత్వంలోని భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) నిర్ణయించింది. అధ్యక్షుడు గంగూలీ నేతృత్వంలో తొలి సారి ఆదివారం ఇక్కడ బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎం) జరిగింది. పదవీ కాలం నిబంధన సడలింపుతో పాటు ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాలకు బీసీసీఐ తరపున కార్యదర్శి జై షాను నియమిస్తూ చేసిన తీర్మానానికి ఏజీఎం సభ్యులు ఆమోదం తెలిపారు. ఏజీఎం సవరణలకు దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. సుప్రీంకోర్టు ఓకే చెబితే గంగూలీతో పాటు కార్యదర్శి జై షా పదవీ కాలం కూడా పెరుగనుంది. అలాగే మాజీ క్రికెటర్లు బాధ్యతలు చేపట్టేందుకు అడ్డంకిగా మారిన పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశంపైనా ఏజీఎంలో సభ్యులు సమాలోచనలు జరిపారు.

**సవరణ ఇదే..**

బోర్డు ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం బీసీసీఐ లేదా రాష్ట్ర సంఘాల్లో కలిపి వరుసగా ఆరేండ్ల పాటు పరిపాలన పదవిలో ఉంటే కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధన కింద ఆ తర్వాతి మూడేండ్లు విరామం తీసుకోవాల్సి ఉంది. అయితే ఇలా రెండింటినీ కలిపి కాకుండా... బీసీసీఐలో గానీ, రాష్ట్ర సంఘాల్లో కానీ వేర్వేరుగా వరుసగా ఆరేండ్లు పదవిలో ఉన్నప్పుడే కూలింగ్ ఆఫ్ పీరియడ్ అమలు చేసేలా బీసీసీఐ తాజా సవరణ చేసింది. ఇక ఈ నిబంధనకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపాల్సి ఉంది.

**2024 వరకు గంగూలీ!**

జస్టిస్ లోధా కమిటీ ప్రవేశపెట్టిన పదవీ కాలం నిబంధన సవరణకు సుప్రీంకోర్టు ఆమోద ముద్ర వేస్తే బీసీసీఐ అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీ 2024 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ ఏడాది అక్టోబర్ 23న బీసీసీఐ బాస్‌గా బాధ్యతలు చేపట్టిన దాదా.. బీసీసీఐ ప్రస్తుత రాజ్యాంగంలోని కూలింగ్ ఆఫ్ నిబంధన ప్రకారం వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉంది. 2015 నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు బెంగాల్ క్రికెట్ సంఘం(క్యాబ్) అధ్యక్షుడిగా పని చేసిన అతడు... నేరుగా బీసీసీఐ పదవి చేపట్టాడు. దీంతో వచ్చే ఏడాది పూర్తికాకుండా ఆరేండ్ల కాలం ముగుస్తుంది. బీసీసీఐ కార్యదర్శి జై షా సైతం 2013 నుంచి గుజరాత్ క్రికెట్ సంఘం జాయింట్ సెక్రటరీగా ఉన్నాడు. దీంతో బీసీసీఐ తాజా సవరణకు సుప్రీంకోర్టు అంగీకారం తెలిపితే గంగూలీతో పాటు జై షా పదవీ కాలం సైతం పెరుగనుంది.

### బీసీసీఐ ప్రతినిధిగా షా

అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ(సీఈసీ) భవిష్యత్ సమావేశాలకు బోర్డు ప్రతినిధిగా బీసీసీఐ కార్యదర్శి జై షా ఎంపికయ్యాడు. సుప్రీంకోర్టు నియమించిన క్రికెట్ పరిపాలన కమిటీ(సీఓఏ) పాలన ఉన్నంత కాలం సీఈసీ సమావేశాలకు బీసీసీఐ సీఈవో జోహ్రీ హాజరయ్యేవాడు. ఐసీసీ సీఈసీలో బోర్డు కార్యదర్శే ప్రతినిధిగా ఉండాలనేది ఐసీసీ నిబంధన అని సమావేశం అనంతరం గంగూలీ చెప్పాడు. అయితే ఐసీసీ బోర్డు సమావేశాలకు బీసీసీఐ ప్రతినిధిని మాత్రం ఎంపిక చేయలేదు.


జై షా

**సెలెక్టర్ల గడువు ముగిసింది**

ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని టీమ్‌ఇండియా సెలెక్షన్ కమిటీ గడువు ముగిసిందని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ చెప్పాడు. నాలుగేండ్లుగా ఉన్న సెలెక్షన్ కమిటీ పదవీ కాలం బీసీసీఐ నూతన రాజ్యాంగం ప్రకారం ఐదేండ్లకు పెరిగింది. ఎమ్మెస్కే ప్రసాద్, గగన్ కోడా 2015లో నియమితులు కాగా, జతిన్ పరన్‌జపే, సర్‌దీప్ సింగ్, దేవాంగ్ గాంధీ 2016లో కమిటీలోకి వచ్చారు. కాగా, ప్రస్తుత సెలెక్షన్ కమిటీ ఇక కొనసాగదని దాదా స్పష్టంగా చేశాడు. 'సెలెక్షన్ కమిటీ గడువు ముగిసింది. ఇంతకాలం వారు విధులు చక్కగా నిర్వర్తించారు. సెలెక్షన్ కమిటీ నిర్దిష్ట పదవీ కాలాన్ని మేం నిర్ణయిస్తాం' అని గంగూలీ చెప్పాడు. కాగా, ఇంతకాలం అంతర్జాతీయ అనుభవం అంశంపై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఎమ్మెస్కే అండ్ టీమ్ బాధ్యతల నుంచి తప్పుకోనుంది.

### విరుద్ధ ప్రయోజనాలపై కోర్టునే అడుగుతాం..

సాధారణంగా ఫుల్‌టైమ్ క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) అవసరం లేదని, ఒకటో, రెండో సమావేశాలకు అది పరిమితమని గంగూలీ చెప్పాడు. కోచ్ లేదా సెలక్షన్ కమిటీని ఎంపిక చేయడమే సీఏసీ పని అని స్పష్టం చేశాడు. అయినా... పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందికి సీఏసీ వస్తున్నందునే ప్రస్తుతం సరైన వారిని నియమించే పరిస్థితి కనిపించడం లేదని అన్నాడు. అందుకే పరస్పర విరుద్ధ ప్రయోజనాల నిబంధనలపై స్పష్టత కోసం సుప్రీంకోర్టును సంప్రదిస్తామని దాదా వెల్లడించాడు. విరుద్ధ ప్రయోజాలనాల నిబంధన ఉంటే సరైన సీఏసీని నియమించలేమని స్పష్టం చేశాడు. 'గతంలో రెండుసార్లు సీఏసీ రద్దయింది. ఒకటి స్వయంగా నేనున్నది.. కపిల్ దేవ్ నేతృత్వంలోనిది మరొకటి. మరోసారి అలా కాకూడదని అనుకుంటున్నాం. దానివల్లే ప్రస్తుతం సీఏసీని నియమించలేకున్నాం. అందుకే పరస్పర విరుద్ధ ప్రయోజనాలపై స్పష్టత అవసరం. అసలు ఆ నిబంధన కేవలం మాకే(ఆఫీస్ బేరర్ల) ఉండాలి' అని గంగూలీ చెప్పాడు. అలాగే డే అండ్ నైట్ టెస్టులు క్రమం తప్పకుండా ఉండేలా ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపాడు. పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలతో సచిన్ టెండూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్, గంగూలీ గతంలో సీఏసీ నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత నియమితులైన కపిల్ దేవ్, శాంత రంగస్వామి, అన్షుమన్ గైక్వాడ్ కమిటీ.. టీమ్‌ఇండియా హెడ్‌కోచ్‌గా రవిశాస్త్రిని సైతం కొనసాగించింది. ఆ తర్వాత వారిపైనా ఆరోపణలు రావడంతో కమిటీకి రాజీనామా చేశారు.
భవిష్యత్తులో కోర్టు ఆమోదం లేకుండానే రాజ్యాంగంలోని సవరణలు చేసేలా అనుమతించాలని సుప్రీంను బీసీసీఐ కోరనుంది. ఏజీఎంలోని నాలుగింట మూడొంతుల మెజార్టీ ఉంటే సవరణను అమలు చేసే వెసులుబాటు ఇవ్వాలని అభ్యర్థించనుంది. అయితే, ఈ అభ్యర్థనను సుప్రీంకోర్టు అంగీకరించే అవకాశాలు చాలా తక్కువనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


ఆదివారం బీసీసీఐ ఏజీఎం సమావేశానికి హాజరైన హెచ్‌సీఏ అధ్యక్షుడు అజారుద్దీన్

# విదేశాల్లోనూ ఐపీఎల్ జట్లు!



ఐపీఎల్ జట్లు విదేశాల్లోనూ ఆడొచ్చనేలా బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ సంకేతాలిచ్చాడు. విదేశాల్లో ఆడితే బోర్డుకు రాయల్టీ ఫీజు చెల్లించే అంశంపై ఏజీఎంలో చర్చినట్టు తెలిపాడు. అలాగే ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన చేసే క్రికెటర్ల కోసం ఐపీఎల్ హాల్ ఆఫ్ ఫేమ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేసినట్టు చెప్పాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఫిక్సింగ్ కోసం బుకీలు సంప్రదింపులు జరిపినట్టు ఓ ఆటగాడి నుంచి తమకు ఫిర్యాదు అందిందని గంగూలీ చెప్పాడు. కర్ణాటక ప్రీమియర్ లీగ్(కేపీఎల్) ఫిక్సింగ్ బాగోతంతో సంబంధముందని అనుమానమున్న ఆటగాళ్లు ముస్తాక్ అలీ టోర్నీలోనూ ఆడుతున్నందున వారిపై బీసీసీఐ నిఘా ఉంచిన సంగతి తెలిసిందే.

**ధోనీనే అడగండి**

క్రికెట్ నుంచి విరామం తీసుకున్న టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ధోనీ భవితవ్యంపై ప్రస్తుతం తానేమీ చెప్పలేనని గంగూలీ అన్నాడు. టీ20 ప్రపంచకప్‌లో మహీ ఉంటాడా అన్న ప్రశ్నకు 'దయచేసి ధోనీనే అడగండి' అని దాదా సమాధామనిచ్చాడు. ఈ ఏడాది జరిగిన వన్డే ప్రపంచకప్ సెమీస్ ఆడిన తర్వాత క్రికెట్‌కు ధోనీ దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే.


## రసవత్తరంగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్–17 బాలుర క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో వరంగల్‌పై మెదక్ విజయం సాధించింది. తర్వాత జరిగిన మ్యాచ్‌ల్లో ఆదిలాబాద్‌పై కరీంనగర్, నిజామాబాద్‌పై నల్లగొండ, మహబూబ్‌నగర్‌పై మెదక్, హైదరాబాద్‌పై ఖమ్మం, ఆదిలాబాద్‌పై నల్లగొండ, కరీంనగర్‌పై రంగారెడ్డి విజయాలు నమోదు చేసుకున్నాయి. మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు సోమవారంతో ముగుస్తాయి.

## రోహిత్ 400 చేస్తాడు : వార్నర్

**అడిలైడ్ :** టెస్టుల్లో విండీస్ దిగ్గజం బ్రియాన్ లారా 400పరుగుల రికార్డును టీమ్‌ఇండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ బద్దలు కొడతాడని ఆస్ట్రేలియా ఆటగాడు వార్నర్ అన్నాడు. సమీప భవిష్యత్తులో రోహిత్ ఆ ఫీట్ సాధిస్తాడని అంచనా వేశాడు. పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో డేవిడ్ వార్నర్(335నాటౌట్) తొలి అజేత త్రిశతకం చేశాడు. లారా రికార్డుకు డేవిడ్ 65 పరుగుల దూరంలో ఉండగా ఆసీస్ కెప్టెన్ పైన్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

## దక్షిణాసియా క్రీడలు ప్రారంభం



**కఠ్మాండు:** నేపాల్ రాజధాని కఠ్మాండు వేదికగా 13వ దక్షిణాసియా క్రీడలు ఆదివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. టోర్నీ మొదలైనట్లు నేపాల్ అధ్యక్షురాలు బిద్యా దేవి భండారీ అధికారికంగా ప్రకటించారు. దశరథ్ స్టేడియం వేదికగా ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మొత్తం ఏడు దేశాల క్రీడాకారులు తమ జాతీయ జెండాలను చేతబూని మార్చ్‌ఫాస్ట్‌తో అలరించారు. 15వేల మంది ప్రేక్షకులు హాజరైన ఈ కార్యక్రమంలో కండ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచాతో స్టేడియాన్ని హోరెత్తించారు.




# రన్నరప్ సౌరభ్ వర్మ

సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్ టోర్నీ

**లక్నో:** సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ సౌరభ్ వర్మ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో సౌరభ్ 15–21, 17–21 వాంగ్ జు వీ(చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యాడు. ఈ యేడాది హైదరాబాద్, వియత్నాం టైటిళ్లు గెలిచిన సౌరభ్..తుది పోరులో ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వలేకపోయాడు. 48 నిమిషాల పాటు జరిగిన పోరులో వరుస గేముల్లో మ్యాచ్‌ను చైనీస్ తైపీ షట్లర్‌కు చేజార్చుకుని సూపర్–300 టైటిల్‌ను దక్కించుకోలేకపోయాడు. ఫైనల్‌కు ముందు ముఖాముఖి పోరులో 1–1తో సమంగా ఉన్న వర్మ స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోయాడు. తొలి గేమ్‌లో 1–3తో ఒక దశలో వెనుకబడ్డ వర్మ ఆ తర్వాత తేరుకుని పోటీలోకి వచ్చాడు. అయితే సుదీర్ఘ ర్యాలీలతో వాంగ్ చెలరేగాడు. రెండో గేమ్‌లో ఒకింత ప్రతిఘటించినా అప్పటికే పట్టుకోల్పోవడంతో మ్యాచ్ చేజారిపోయింది. మరోవైపు మహిళల సింగిల్స్‌లో కరోలినా మారిన్ 21–12, 21–16తో చైవాన్‌పై గెలిచి టైటిల్ దక్కించుకుంది.

# పాకిస్థాన్ ఫాలోఆన్


యాసిర్ షా (113)

**అడిలైడ్:** ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో పాకిస్థాన్ ఓటమికి మరింత చేరువైంది. ఓవర్‌నైట్ స్కోరు 96/6తో మూడో రోజు ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్..మిచెల్ స్టార్క్(6/66)ధాటికి 302 పరుగులకు కుప్పకూలింది. స్వల్ప స్కోరుకే చాపచుట్టేస్తుందనుకున్న పాక్ జట్టు బాబర్ ఆజమ్(97), యాసిర్ షా(113) పోరాటంతో పరువు దక్కించుకుంది. వీరిద్దరు ఆసీస్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్ కొనసాగించారు. అయితే స్టార్క్ బౌలింగ్‌లో ఆజమ్..పైన్ క్యాచ్‌తో నిష్క్రమించడంతో ఏడో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అయినా వెనుకకు తగ్గని షా..తన టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. కమ్మిన్స్(3/83) మూడు వికెట్లు తీశాడు. ఆ తర్వాత ఫాలోఆన్‌కు దిగిన పాక్ ఆట ముగిసే సరికి 39 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది.

# హామిల్టన్‌దే అబుదాబి

**అబుదాబి :** ఈ ఏడాదిలో చివరి ఎఫ్1 గ్రాండ్‌ప్రిని మెర్సిడెజ్ స్టార్ రేసర్ లూయిస్ హామిల్టన్ కైవసం చేసుకున్నాడు. ఆదివారం ఇక్కడ జరిగిన అబుదాబి గ్రాండ్‌ప్రిలో అగ్రస్థానంలో నిలిచి కెరీర్‌లో 84వ టైటిల్‌ను ఈ బ్రిటన్ రేసర్ దక్కించుకున్నాడు. ఈ ఏడాది 21రేసుల్లో 11విజయాలు సాధించిన హామిల్టన్... ఆరోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌ను కూడా చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. పోల్ పొజిషన్ నుంచి అబుదాబి రేస్ ప్రారంభించిన లూయిస్ ఆసాంతం ముందంజలోనే కొనసాగాడు. రెడ్‌బుల్ రేసర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ రెండో స్థానంలో.. ఆ తర్వాత ఫెరారీ స్టార్ చార్లెస్ లెక్‌లెర్క్ పోడియం ఫినిష్ చేశారు.



## వృద్ధి మందగమనం తాత్కాలికమే..: కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



**జంషెడ్‌పూర్, డిసెంబర్ 1:** ఆర్థిక మందగమన పరిస్థితులు తాత్కాలికమేనని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య యుద్ధం వల్లనే ఈ పరిస్థితులు నెలకొన్నాయి తప్ప.. దేశ ఆర్థిక వ్యవస్థకు వచ్చిన ముప్పేమీలేదని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను వృద్ధి ఆరున్నరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయినప్పటికీ, సరైన దిశలోనే కొనసాగుతున్నదని, రెండు అగ్రరాజ్యాల మధ్య ట్రేడ్ వార్ జరుగుతుండటంతో ఇతర దేశాలపై ప్రభావం పడటం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ దెబ్బ చమురు, కమోడిటీ ఉత్పత్తులపై అత్యధికంగా ప్రభావం చూపనున్నదన్నారు. జూలై-సెప్టెంబర్‌కుగాను దేశ జీడీపీ ఆరేండ్ల కనిష్ఠ స్థాయి 4.5 శాతానికి పడిపోయినది తెలిసిందే. జనవరి-మార్చి 2012-13లో నమోదైన 4.3 శాతం తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. 2018-19లో వృద్ధి 7 శాతంగా నమోదైంది. దేశీయ ఆర్థిక మూలాలకు వచ్చిన ఢోకా ఏమి లేదని, చాలా బలంగా ఉన్నాయని, సరైన దిశలోనే దేశ ఆర్థిక వ్యవస్థ నడుస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు. వరుసగా నాలుగు నెలలపాటు దిగాలు పడిన దేశీయ ఆటోమొబైల్ సంస్థలకు భవిష్యత్తులో ఊరట లభించే అవకాశాలున్నాయన్నారు.

## లక్ష కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు




### నవంబర్‌లో రూ.1,03,492 కోట్లు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:** వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు మళ్లీ లక్ష కోట్లు దాటాయి. నవంబర్ నెలకుగాను రూ.1,03,492 కోట్లు వసూలయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.97,637 కోట్లతో పోలిస్తే ఆరు శాతం పెరిగాయి. వరుసగా మూడు నెలలపాటు లక్ష కోట్ల దిగువకు పడిపోయిన వసూళ్లు గత నెలలో పండుగ సీజన్ కలిసొచ్చింది. వరుసగా 2 నెలలపాటు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్న జీఎస్టీ వసూళ్లు తిరిగి వృద్ధి బాట పట్టాయని, గతేడాదితో పోలిస్తే 6 శాతం చొప్పున పెరిగాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్టోబర్‌లో రూ.95,380 కోట్లుగా ఉన్నాయి.

**మళ్లీ గాడిలోకి..**

వరుసగా మూడు నెలలుగా ప్రతికూల వృద్ధి నమోదైన వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు మళ్లీ ట్రాక్‌లోకి వచ్చాయి. నవంబర్ నెలకుగాను మళ్లీ లక్ష కోట్ల రూపాయలకు పైగా వసూలయ్యాయి. వినిమయం పుంజుకోవడం, ఎగవేతలు తగ్గుముఖం పట్టడం వల్లనే పన్ను వసూళ్లు అంతకంతకు పెరిగాయని ఆ వర్గాలు వెల్లడించాయి. జీఎస్టీ వసూళ్లలో భాగంగా దేశవ్యాప్తంగా లావాదేవీల్లో 12 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి. ప్రస్తుత సంవత్సరంలో ఒకే నెలలో ఇంతటి వృద్ధిని నమోదు చేసుకోవడం ఇదే తొలిసారి. గత నెలలో వసూలైన రూ.1.03 లక్షల కోట్లలో సీజీఎస్టీ కింద రూ.19,592 కోట్లు, ఎస్‌జీఎస్టీ కింద రూ.27,144 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.49,028 కోట్లు(దిగుమతులపై వసూలైన రూ.20,948 కోట్లు కలుపుకొని), సెస్ రూపంలో రూ.7,727 కోట్లు(రూ.869 కోట్లు కలుపుకొని) వసూలయ్యాయి. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత అత్యధికంగా వసూలైన పన్నుల జాబితాలో నవంబర్ నెల మూడోస్థానంలో నిలిచింది. గతంలో ఏప్రిల్ 2019, మార్చి 2019లో అత్యధికంగా వసూలయ్యాయి. జూలై 2017 నుంచి ఇప్పటి వరకు ఎనిమిది సార్లు లక్ష కోట్ల రూపాయలు దాటాయి. ఈ ఏడాది జూలైలో రూ.1,02,083 కోట్లు వసూలవగా, నవంబర్‌లో మళ్లీ లక్ష కోట్ల రూపాయలు దాటాయి. వరుసగా రెండు నెలలుగా ప్రతికూల వృద్ధి నమోదైన వసూళ్లు తిరిగి పుంజుకోవడంతో కేంద్ర ప్రభుత్వానికి భారీ ఊరట లభించినట్లు అయింది. సెప్టెంబర్‌లో -13 శాతం, అక్టోబర్‌లో -20 శాతం పడిపోయాయి. అక్టోబర్ చివరి నాటి నుంచి నవంబర్ చివరి వరకు 77.83 లక్షల మంది మంది జీఎస్టీఆర్ 3బీ రిటర్నులు దాఖలు చేశారు. జీఎస్టీ వసూళ్లలో రూ.25,150 కోట్లు సీజీఎస్టీ కింద కేటాయింపులు జరుపగా, అలాగే రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.17,431 కోట్ల కేటాయించింది. గత నెలలో రెగ్యులర్ సెటిల్‌మెంట్ పూర్తైన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి రూ.44,742 కోట్ల నిధులు సమకూరగా, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.44,756 కోట్లు లభించాయి. ఈ సందర్భంగా డెలాయిట్ ఇండియా భాగస్వామి ఎంఎస్ మణి మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్న జీఎస్టీ వసూళ్లకు పండుగ సెంటిమెంట్ కలిసొచ్చిందన్నారు. ద్రవ్యలోటు కట్టడి చేయడానికి వీలు పడిందని, రాబోయే నెలల్లోనూ ఇలాగే వసూలు కావచ్చన్నారు.

## మొబైల్ ఛార్జీల మోత

### నేటి అర్ధరాత్రి నుంచి పెరుగనున్న ధరలు

వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ నిర్ణయం

50 శాతం వరకు ఆయా ప్లాన్లు ప్రియం • డిసెంబర్ 6 నుంచి జియో వడ్డన




**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:**

ఇన్నాళ్లూ.. చౌక ఇంటర్నెట్‌తో ఎంజాయ్ చేసిన మొబైల్ వినియోగదారుల జేబులకు చిల్లులు పడనున్నాయి. మొబైల్ చార్జీలు మోత మోగించనున్నాయి. కస్టమర్లపై భారం వేసేందుకు టెలికం సంస్థలు సిద్ధమైయ్యాయి. అందుకు సోమవారం అర్ధరాత్రిని ముహూర్తంగా ఎంచుకున్నాయి. ఈ నెల 3 నుంచి మొబైల్ కాల్, డాటా చార్జీలను పెంచుతున్నట్లు ఆదివారం వొడాఫోన్ ఐడియా ప్రకటించింది. భారతీ ఎయిర్‌టెల్ సైతం ఇదే తేదీ నుంచి పెంపు వర్తిస్తుందని స్పష్టం చేసింది. డిసెంబర్ 3 తర్వాత కస్టమర్లు నెలకు కనీసం రూ.49 రీచార్జ్ చేయాల్సి ఉంటుందని వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ ప్రకటించాయి. మరోవైపు రిలయన్స్ జియో కూడా పెంపు బాట పట్టగా, ఈ నెల 6 నుంచి వడ్డింపులుంటాయని పేర్కొన్నది. కాగా, గడిచిన ఐదేండ్లలో మొబైల్ టారిఫ్‌లు పెరుగుతుండటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్) విషయంలో ప్రభుత్వ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం కోర్టు.. స్పెక్ట్రం వినియోగ చార్జీలు, లైసెన్స్ ఫీజు చెల్లింపుల బకాయిలను జరిమానాలు, వడ్డీలతోసహా చెల్లించాలని తీర్పునిచ్చింది. దీంతో టెలికం పరిశ్రమపై రూ.1.17 లక్షల కోట్ల భారం పడగా, వొడాఫోన్ ఐడియా రూ.44,150 కోట్లను టెలికం శాఖకు ఇవ్వాల్సి వస్తున్నది. భారతీ ఎయిర్‌టెల్ రూ.35,586 కోట్లను చెల్లించాల్సి ఉన్నదని ప్రభుత్వ లెక్కల ద్వారా తెలుస్తున్నది. ఈ కారణంగానే ఈ జూలై-సెప్టెంబర్‌లో రూ.50,921 కోట్ల నష్టాలను వొడాఫోన్ ఐడియా ప్రకటించిన విషయం తెలిసిందే. భారతీయ కార్పొరేట్ చరిత్రలో ఓ సంస్థ కేవలం మూడు నెలల కాలంలో ఈ స్థాయి నష్టాలను వెల్లడించడం ఇదే తొలిసారి. తమ మనుగడకు ధరల పెంపే మార్గమని భావించిన సంస్థలు.. వినియోగదారులపై భారం వేస్తున్నాయి.

**వొడాఫోన్ ఐడియా**

ప్రీ-పెయిడ్ మొబైల్ వినియోగదారుల చార్జీలు మంగళవారం నుంచి పెరుగుతాయని వొడాఫోన్ ఐడియా ప్రకటించింది. ఈ పెంపు 50 శాతం వరకు ఉంటుందని స్పష్టం చేసింది. ఆయా ప్లాన్ల ఆధారంగా ఈ పెంపు ఉంటుందని వెల్లడించింది. ఏడాదంతా వర్తించే రూ.999 ప్లాన్ ధర దాదాపు 50 శాతం పెరుగుతుండగా, ఇకపై ఇది రూ.1,499కి లభించనున్నది. ఈ ప్లాన్ డాటా వినియోగ పరిమితి 12 జీబీ నుంచి 24 జీబీకి పెంచారు. అలాగే సంవత్సరం పాటు అమల్లో ఉండే రూ.1,699 ప్లాన్ ధరను 41.2 శాతం పెంచుతున్నారు. ఇకపై రూ.2,399కి ఇది అందుబాటులో ఉండనున్నది. రోజువారి డాటా వినియోగ పరిమితి 1.5 జీబీ. మొత్తానికి అపరిమిత విభాగంలో ఉన్న ప్రస్తుత ప్లాన్లన్నీ.. కొత్త ప్లాన్లతో మారిపోనున్నాయని ఓ సంస్థ అధికారి చెప్పారు. ప్రారంభ ప్లాన్ ధర సుమారు 31 శాతం ఎగబాకి రూ.458 నుంచి రూ.599కి చేరుతున్నది. 84 రోజులపాటు రోజుకు 1.5 జీబీ డాటా వినియోగదారులకు అందుతుంది. రూ.199 ప్లాన్ ధరనూ రూ.249కి పెంచుతున్నామని వివరించింది. దీంతో 25 శాతం పెరిగినట్లైంది. ఇందులో రోజుకు 1.5 జీబీ డాటా ఉంటుంది. 2, 28, 84, 365 రోజుల ప్లాన్లను వొడాఫోన్ ఐడియా ప్రస్తుతం మార్కెట్‌లో విక్రయిస్తున్నది.

**భారతీ ఎయిర్‌టెల్**

భారతీ ఎయిర్‌టెల్ తమ ప్రీ-పెయిడ్ కస్టమర్లపై 50 శాతం వరకు చార్జీల పెంపును వేస్తున్నది. డిసెంబర్ 3 నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని ప్రకటించింది. వొడాఫోన్ ఐడియా చార్జీల పెంపు ప్రకటన విడుదలైన కొద్ది గంటలకే ఎయిర్‌టెల్ కూడా పెంపు నిర్ణయాన్ని వెలువరించింది. ఏడాది కాలానికి సంబంధించిన రూ.998 ప్లాన్ ధరను రూ.1,499గా నిర్ణయించింది. డాటా వినియోగ పరిమితిని 12 జీబీ నుంచి 24 జీబీకి పెంచింది. 365 రోజుల ప్లాన్ ధరను 41.2 శాతం పెంచి రూ.2,398గా నిర్ణయించింది. ప్రస్తుతం ఇది రూ.1,699గానే ఉన్నది. రోజుకు డాటా వినియోగ పరిమితి 1.5 జీబీ. 84 రోజులపాటు రోజుకు 1.5 జీబీ డాటాతో ఉన్న ప్లాన్ ధరను రూ.458 నుంచి రూ.598కి పెంచుతున్నట్లు ఎయిర్‌టెల్ ఈ సందర్భంగా ఓ ప్రకటనలో తెలిపింది. రూ.199 ప్లాన్ ధరనూ దాదాపు 25 శాతం పెంచి రూ.248గా చేసింది. సుప్రీం కోర్టు దెబ్బకు ఈ జూలై-సెప్టెంబర్‌లో రూ.23,045 కోట్ల నష్టాన్ని సంస్థ ప్రకటించినది తెలిసిందే.

**రిలయన్స్ జియో**

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని సంచలన 4జీ టెలికం సంస్థ రిలయన్స్ జియో సైతం ధరల పెంపును ప్రకటించింది. ఈ నెల 6 నుంచి పెంపు వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీంతో మొబైల్ కాల్స్, డాటా చార్జీలు 40 శాతం వరకు ప్రియం కానున్నాయి. అయితే కస్టమర్లకు కొత్త ప్లాన్లలో 300 శాతం వరకు అదనపు లాభాలుంటాయని జియో ఓ ప్రకటనలో చెబుతున్నది. కాగా, ప్లాన్లకు సంబంధించిన ధరల పెంపు వివరాలు త్వరలో రావచ్చని తెలుస్తున్నది. ఇటీవలి సుప్రీం కోర్టు తీర్పు.. జియోపైనా భారాన్ని మోపగా, అది వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌తో పోల్చితే చాలా స్వల్పంగా ఉన్నది. అయినప్పటికీ టెలికం పరిశ్రమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చార్జీలను పెంచక తప్పడం లేదని జియో వివరించింది.

**ఎందుకీ వివక్షత**

దేశీయ టెలికం రంగంలో ప్రైవేట్ సంస్థలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు పెద్దపీట వేస్తున్నదని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రభుత్వ రంగ సంస్థలపట్ల సవతి తల్లి ప్రేమను చూపుతున్నారని ఆదివారం కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా మండిపడ్డారు. ప్రైవేట్ కంపెనీల నుంచి ఎలక్టోరల్ బాండ్ల కోసమే.. ప్రభుత్వ సంస్థల ప్రయోజనాలను కేంద్రం బలి తీసుకుంటున్నదని విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు.

**ఉచిత కాల్స్‌కు చెల్లు**

**జియో** రాకతో తెరపైకి వచ్చిన ఉచిత అపరిమిత కాల్స్.. ఇక కనుమరుగు అవబోతున్నాయి. ఈ నెల 3 నుంచి వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ తమ ప్లాన్ల ధరల్లో తెస్తున్న మార్పులు.. అన్‌లిమిటెడ్ ఫ్రీ కాలింగ్‌కు చెక్ పెడుతున్నాయి. ఇతర నెట్‌వర్క్ యూజర్లకు చేసే ప్రతీ కాల్‌పై నిమిషానికి 6 పైసలు చొప్పున వసూలు చేస్తామని వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ ప్రకటించాయి. ఇప్పటికే జియో ఈ చార్జీలను వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆయా ప్లాన్లలో ఉన్న పరిమిత వ్యవధి టాక్ టైం దాటితే.. ఇతర నెట్‌వర్క్ వినియోగదారులకు ఫోన్ చేయడానికి టాప్‌అప్‌లు వేసుకోవాల్సిందే. అయితే సొంత నెట్‌వర్క్ కస్టమర్ల మధ్య ఉచిత కాలింగ్ సదుపాయాన్ని టెలికం సంస్థలు కొనసాగించనున్నాయి. 28 రోజుల ప్లాన్‌లో ఇతర నెట్‌వర్క్‌లకు వెయ్యి నిమిషాల కాల్స్, 84 రోజుల ప్లాన్‌లో 3 వేల నిమిషాలు, 365 రోజుల ప్లాన్‌లో 12 వేల నిమిషాల కాల్స్ ఉచితమని ఎయిర్‌టెల్ తెలిపింది. ఆ తర్వాత నిమిషానికి 6 పైసలు చార్జీ పడుతుంది.

## ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ

### మరో ఆరింటిని చేయాలని కేంద్రానికి ఏఏఐ సిఫార్సు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:** దేశవ్యాప్తంగా మరో ఆరు విమానాశ్రయాలను ప్రైవేటీకరించాలని కేంద్రానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సిఫార్సు చేసింది. అమృత్‌సర్, వారణాసి, భువనేశ్వర్, ఇండోర్, రాయ్‌పూర్, తిరుచ్చి ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని సూచించినట్లు సంబంధిత సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే లక్నో, అహ్మదాబాద్, జైపూర్, మంగళూరు, తిరువనంతపురం, గౌహతి ఎయిర్‌పోర్టులను మోదీ సర్కారు ప్రైవేటీకరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ద్వారా ఈ విమానాశ్రయాల కార్యకలాపాలు, నిర్వహణ, అభివృద్ధిని ప్రైవేటీకరించారు. 'ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆరు ఎయిర్‌పోర్టులను ప్రైవేటీకరించారు. సెప్టెంబర్ 5న జరిగిన బోర్డు సమావేశంలో మరో ఆరింటిని ప్రైవేటీకరించాలని ఏఏఐ నిర్ణయించింది. వీటిలో అమృత్‌సర్, వారణాసి, భువనేశ్వర్, ఇండోర్, రాయ్‌పూర్, తిరుచ్చి ఉన్నాయి' అని పీటీఐకి ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. పౌరవిమానయాన మంత్రిత్వ శాఖకూ తమ నిర్ణయాన్ని ఏఏఐ పంపింది. దేశవ్యాప్తంగా 100కుపైగా ఎయిర్‌పోర్టులను ఏఏఐ నిర్వహిస్తున్నది. ఇందులో కొన్ని సొంతంగా కూడా ఉన్నాయి. కాగా, ఫిబ్రవరిలో జరిగిన తొలి దశ ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణలో అదానీ గ్రూప్ ఆరు ఎయిర్‌పోర్టులను దక్కించుకోగా.. అహ్మదాబాద్, లక్నో, మంగళూరు ఎయిర్‌పోర్టులను లీజుకిస్తూ జూలై 3న కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. మరో మూడు ఎయిర్‌పోర్టులకు సంబంధించి నిర్ణయం రావాల్సి ఉన్నది.



## ఆటో రివర్స్‌గేర్

- నవంబర్‌లో 2 శాతం క్షీణించిన మారుతి సేల్స్
- దిగజారిన మహీంద్రా, టాటా, హోండా కార్స్ సేల్స్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:** వాహన అమ్మకాలు మళ్లీ తిరోగమన బాటపట్టాయి. పండుగ సీజన్‌లో ఒకేఒక నెలలో ఆశించిన స్థాయిలో నమోదైన విక్రయాలు ఆ మరుసటి నెలలో భారీగా పడిపోయాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 1.9 శాతం తగ్గి 1,50,630 యూనిట్లకు జారుకున్నాయి. క్రితం ఏడాది ఇదే నెలలో సంస్థ 1,53,539ల విక్రయాలు జరిపింది. వీటిలో దేశవ్యాప్తంగా 1,43,686ల అమ్మకాలు జరుపగా, మిగతావి విదేశాలకు ఎగుమతి చేసింది. మినీ కార్ల విభాగానికి చెందిన ఆల్టో, వ్యాగన్ ఆర్ అమ్మకాలు 12.2 శాతం పడిపోయి 26,306లకు పరిమితమవగా, కాంప్యాక్ట్ సెగ్మెంట్‌కు చెందిన స్విఫ్ట్, సెలేరియో, ఇగ్నిస్, బాలెనో, డిజైర్ విక్రయాల్లో వృద్ధి 7.6 శాతంగా ఉండగా, మధ్యస్థాయి సెడాన్ సియాజ్ సేల్స్ 3,838ల యూనిట్ల నుంచి 1,448లకు పడిపోయాయి. యుటిలిటీ వాహన విక్రయాలకు బ్రేక్ పడింది. మరో సంస్థ మహీంద్రా సేల్స్ కూడా ఏడాది ప్రాతిపదికన 9 శాతం క్షీణించి 41,235లకు పడిపోయాయి. గతేడాది ఇదే నెల 45,101ల విక్రయాలు జరిపినట్లు సంస్థ తెలిపింది. వీటిలో దేశీయం గా 38,614లను విక్రయించిన సంస్థ.. 2,621 లను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. పండుగ సీజన్ తర్వాత తొలి నెలలో ఆటోమొబైల్ రంగం ఎంతో నేర్చుకున్నదని, వినియోగదారుల డిమాండ్ అంతంత మాత్రం గానే ఉన్నదని, ముఖ్యంగా ప్యాసింజర్ వాహన విభాగం మందకొడిగా ఉన్నదని మహీంద్రా చీఫ్ సేల్స్, మార్కెటింగ్ విజయ్ రామ్ నక్రా తెలిపారు. దేశవ్యాప్తంగా గత నెలలో 20,414 వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించిన సంస్థ..వీటిలో 618లను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. అలాగే 21,032 ల ట్రాక్టర్లను విక్రయించింది. కాగా, టాటా మోటర్స్ 41,124ల వాహనాలను మాత్రమే అమ్మింది. క్రితం ఏడాది ఇదే నెలలో విక్రయించిన 55,074లతో పోలిస్తే 25.32 శాతం పడిపోయాయి. నవంబర్ నెలలో హోండా కార్స్ అమ్మకాలు 50 శాతం తగ్గి 6,459లకు జారుకున్నాయి. అంచనావేసిన స్థాయి కంటే మెరుగైన స్థితిలోనే వాహనాలను విక్రయించినట్లు హెచ్‌సీఐఎల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ గోయెల్ తెలిపారు. అలాగే గత నెలలో 3,239 యూనిట్ల హెక్టార్ వాహనాన్ని విక్రయించినట్లు ఎంజీ మోటర్ ప్రకటించింది.

## వృద్ధి కోసం మరొక్కసారి!

### వడ్డీరేట్లను తగ్గించే అవకాశం • రేపట్నుంచి ఆర్బీఐ ద్రవ్యసమీక్ష

**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:** దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా వడ్డీరేట్లను ఆర్బీఐ మరోసారి తగ్గించవచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో జీడీపీ గణాంకాలు ఆరేండ్లకుపైగా కనిష్ఠాన్ని తాకుతూ 4.5 శాతానికి దిగజారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష మొదలు కానున్నది. ఇందులో రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లకు కోత పెట్టవచ్చన్న అభిప్రాయాలు బ్యాంకర్లు, నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన దగ్గర్నుంచి కీలక వడ్డీరేట్లను శక్తికాంత దాస్ తగ్గిస్తూ పోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 5 కోతలు జరిగాయి. మొత్తం 135 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటు దిగివచ్చింది. అయినప్పటికీ జీడీపీ కోలుకున్న సంకేతాలు మాత్రం కానరావడం లేదు. వృద్ధిరేటు పుంజుకునేదాకా వడ్డీరేట్లను తగ్గిస్తామని గతంలో దాస్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి కూడా కీలక వడ్డీరేట్లు తగ్గవచ్చన్న ఆశలు కనిపిస్తున్నాయి. 'ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉంటే వడ్డీరేట్లు మరింత తగ్గవచ్చు' అని ఐహెచ్‌ఎస్ మార్కిట్‌లో ఆసియా పసిఫిక్ చీఫ్ ఎకనామిస్ట్ రాజీవ్ బిశ్వాస్ అన్నారు.

## 4 నుంచి బ్రాండ్ ఫ్యాక్టరీ ఉచిత షాపింగ్ వీకెండ్

**హైదరాబాద్, డిసెంబర్ 1:** బ్రాండ్ ఫ్యాక్టరీ ఉచిత షాపింగ్ వీకెండ్ ఈ నెల 4 నుంచి 8 వరకు జరుగనున్నది. లెవీస్, పెప్పే, అడిడాస్, రెబోక్, ఫీలా, వీఐపీ వంటి 200లకు పైగా ఒరిజినల్ బ్రాండ్ల వస్తువుల కొనుగోళ్లపై ఈ ఐదు రోజులపాటు కస్టమర్లకు అద్భుత ఆఫర్ అందుబాటులో ఉంటుందని ఓ ప్రకటనలో ఫ్యూచర్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ తెలియజేసింది. ఎమ్మార్పీ ధరలపై రూ.5 వేల షాపిం గ్ చేసి రూ.2 వేలు చెల్లిస్తే చాలని సంస్థ తెలిపింది. ఆ రూ.2 వేలల్లో కూడా రూ.500 విలువైన దుస్తులు, రూ.1200 గిఫ్ట్ వోచర్లు, రూ.300 క్యాష్ బ్యాక్ లభిస్తుందని సంస్థ వెల్లడించింది.

## ఆర్బీఐపై ఆధారం

### మదుపరులపై ద్రవ్యసమీక్ష ప్రభావం

### జీడీపీ గణాంకాలు, అంతర్జాతీయ పరిస్థితులూ కీలకం

### ఈ వారం మార్కెట్ సరళిపై నిపుణుల అంచనా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:**

ఈ వారంలో దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను దేశ వృద్ధిరేటు ఆరున్నరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ఈ వారం ప్రారంభంలో మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపనున్నదని దలాల్‌స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. వీటితోపాటు రిజర్వు బ్యాంక్ ప్రకటించనున్న ద్రవ్య పరపతి సమీక్ష, గత నెలకుగాను ఆటోమొబైల్ సంస్థల విక్రయ గణాంకాలు, స్థూల ఆర్థికాంశాలు మార్కెట్లను ప్రభావితం చేసే అంశాల్లో ఇవే కీలకమని వ్యాఖ్యానించారు. వీటితోపాటు అంతర్జాతీయ విషయాలకు వస్తే హాంకాంగ్‌పై అమెరికా, చైనా దేశాలు అనుసరిస్తున్న తీరు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే అంశాల్లో ఇది కూడా ఒకటని తెలిపారు. దేశీయ తయారీ, సేవల రంగాల పనితీరును గుర్తించే పీఎంఐ డాటా కూడా ఈవారంలోనే విడుదలకానుండటంతో మదుపరులు వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశాలున్నాయి. వాహన విక్రయ గణాంకాలు, ఆర్బీఐ పాలసీ ప్రధానంగా మార్కెట్ల ట్రేడింగ్ సరళిని నిర్ణయించే అంశాలని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. గత శుక్రవారం మార్కెట్ ముగిసిన తర్వాత విడుదలైన జూలై-సెప్టెంబర్ మధ్యకాలానికిగాను భారత వృద్ధిరేటు 4.5 శాతానికి పడిపోవడం సోమవారం ట్రేడింగ్‌పై ప్రభావం చూపనున్నదన్నారు. గతవారంలో సెన్సెక్స్ 434.40 పాయింట్లు లేదా 1.07 శాతం పెరిగింది.




**టెలికం షేర్లకు డిమాండ్!**

టారిఫ్ చార్జీలను పెంచుతూ టెలికం సంస్థలు తీసుకున్న తాజా నిర్ణయం ఈ రంగ షేర్లు భారీగా పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు దెబ్బకు భారీగా నష్టపోయిన సంస్థలు..తమ నష్టాన్ని పూడ్చుకోవడానికి మొబైల్ చార్జీలను 50 శాతం వరకు పెంచుతున్నట్లు భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్-ఐడియా, రిలయన్స్ జియోలు ప్రకటించాయి.

**52 వేల కోట్లు పెరిగిన బ్లూచిప్**

గత వారంలో మొదటి పది బ్లూచిప్ సంస్థల్లో ఎనిమిదింటి మార్కెట్ విలువ దూసుకుపోయింది. నికరంగా వీటి విలువ రూ.52,193.73 కోట్లు పెరిగింది. వీటిలో అత్యధికంగా ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐతోపాటు ప్రైవేటురంగ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లాభపడగా.. ఐటీరంగ దిగ్గజం టీసీఎస్, ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఐటీసీలు మాత్రం భారీగా నష్టపోయాయి. ఎస్బీఐ మార్కెట్ క్యాప్ రూ.11,334.26 కోట్లు పెరిగి రూ.3,05,087.85 కోట్లకు ఎగబాకింది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ విలువ రూ.10,492.7 కోట్లు అందుకొని రూ. 3,96,791.39 కోట్లకు చేరుకోగా, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,871.98 కోట్లు అధికమై రూ.3,31.011.55 కోట్లు, కొటక్ మహీం ద్రా బ్యాంక్ రూ.8,818.24 కోట్లు పెరిగి రూ.3,08,420.75 కోట్లకు చేరుకున్నది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.5,055.54 కోట్లు ఎగబాకగా, ఆర్‌ఐఎల్ రూ.2,852.62 కోట్లు, హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ రూ.2,576.12 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.1,192.37 కోట్లు పెరిగింది. కానీ, టీసీఎస్ రూ.6,698.01 కోట్లు మార్కెట్ క్యాప్ కరిగిపోయి రూ.7,70,252.01 కోట్లకు పడిపోగా, ఐటీసీ రూ.1,557.16 కోట్లు తగ్గి రూ.3,02,747 కోట్లకు పరిమితమయ్యాయి.

## ఎల్‌ఐసీకి లాభాల పంట

### స్టాక్ మార్కెట్ల ద్వారా రూ.14 వేల కోట్ల ఆదాయం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:** ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్‌ఐసీ లాభాల పంటపండింది. స్టాక్ మార్కెట్లో భారీ పెట్టుబడులు పెట్టిన సంస్థకు రిటర్నులు కూడా అంతే స్థాయిలో లభించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మార్కెట్ల నుంచి రూ.14 వేల కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 15 వరకు 30 షేర్ల ఇండెక్స్ సెన్సెక్స్ 1,985 పాయింట్లు లేదా 3.82 శాతం పెరుగగా... అదే ఎల్‌ఐసీ ఆదాయంలో మాత్రం రెండంకెల వృద్ధి నమోదైంది. గతేడాది మార్చి నాటికి కంపెనీ ఆస్తుల విలువ రికార్డు స్థాయి రూ.31 లక్షల కోట్లకి చేరుకున్నది. క్రితం ఏడాది ఇది రూ.28.7 లక్షల కోట్లుగా ఉన్నది. దేశీయ స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో ఈ వాటా 20 శాతంగా ఉన్నది. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో లిస్టైన కంపెనీల విలువ రూ.154 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.14 వేల కోట్ల లాభాన్ని ఆర్జించినట్లు ఎల్‌ఐసీ ఎండీ టీసీ సుశీల్ కుమార్ తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు స్టాక్ మార్కెట్లో రూ.34 వేల కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు ఆయన చెప్పారు. గతేడాది రూ.31 వేల కోట్లు. ఈక్విటీల్లో ఘపెట్టుబడులు పెట్టడం ద్వారా 2017-18లో రూ.25,646 కోట్ల లాభాన్ని గడించిన సంస్థ..గతేడాదికిగాను 7.86 శాతం తగ్గి రూ.23,621 కోట్లకు పరిమితమయ్యాయి.



## ముచ్చటగా మూడో నెలలోనూ..

### నవంబర్‌లో రూ.23 వేల కోట్లు కుమ్మరించిన ఎఫ్‌పీఐలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:** విదేశీ పెట్టుబడిదారుల పెట్టుబడులు కొనసాగుతున్నాయి. వరుసగా మూడో నెలలోనూ దేశీయ క్యాపిటల్ మార్కెట్లలోకి రూ.22,872 కోట్ల మేర నిధులను కుమ్మరించారు. తాజాగా రిజర్వు బ్యాంక్ వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. అగ్రరాజ్యాలు అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం తుది అంకానికి చేరుకోవడం, మరిన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలు విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతుండటంతో ఎఫ్‌పీఐలు భారీ పెట్టుబడులకు మొగ్గుచూపారని విశ్లేషకులు వెల్లడించారు. గత నెలలో ఈక్విటీ మార్కెట్లలోకి మొత్తంగా రూ.25,230 కోట్ల మేర పెట్టుబడులు రాగా, ఇదే సమయంలో డెబిట్ మార్కెట్ల నుంచి రూ.2,358.20 కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నారు. దీంతో నికరంగా రూ.22,871.80 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు అయింది. అంతక్రితం అక్టోబర్‌లో రూ.16,037.60 కోట్లు, సెప్టెంబర్‌లో 6,557.8 కోట్ల మేర పెట్టుబడులు పెట్టిన విషయం తెలిసిందే. వరుసగా దేశీయ మార్కెట్లోకి భారీగా పెట్టుబడులు పెడుతున్న ఎఫ్‌పీఐలు గత నెలలోనూ కొనసాగించారని, ముఖ్యంగా అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలు మెండుగావుండటం, డిజిన్వెస్ట్‌మెంట్‌కు కేంద్రం పెద్దపీట వేయడం వంటి అంశాలు ఎఫ్‌పీఐల్లో సెంటిమెంట్‌ను బలపరిచాయని సామ్‌కో సెక్యూరిటీస్ హెడ్ ఉమేశ్ తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్లో ప్రకటించిన పన్నుల సంస్కరణలు అమల్లోకి వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక బిల్లు ఆమోదం పొందడం ఎఫ్‌పీఐలను ఆకట్టుకునేలా చేసింది. వీటికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో వినిమయం ఊపందుకోవడం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కార్పొరేట్లు అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించడం కూడా ఇందుకు దోహదం చేసింది. కానీ, జీడీపీ గణాంకాలు ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ప్రస్తుత నెలలో వచ్చే పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నదని ఆయన హెచ్చరించారు.



వరంగల్‌లోని భద్రకాళి చెరువును పొగమంచు కమ్మేసింది. ఆదివారం ఉదయం 9 గంటలు దాటినా పొగమంచు వీడలేదు. అంతటి చలిలోనూ మత్స్యకారులు ఇలా పడవలపై చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. - గొట్టె వెంకన్న, నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, వరంగల్

# పంచాయతీరాజ్‌లో పదోన్నతులు

### మినిస్టీరియల్ ఉద్యోగులకు నేటినుంచి ప్రమోషన్ పత్రాల అందజేత

### జెడ్పీ సీఈవోలకు అధికారాలిస్తూ జీవో.. ఉద్యోగ సంఘాల హర్షం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పంచాయతీరాజ్‌లో పదోన్నతుల జాతర నెలకొన్నది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో ఇప్పటికే ఎంపీడీవోల నుంచి డిప్యూటీ సీఈవోల వరకు ప్రమోషన్లు ఇచ్చారు. తాజాగా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే నిర్ణయం తీసుకున్నది. సెప్టెంబర్‌లో తలపెట్టిన పల్లె ప్రగతి ప్రణాళిక అమలుకు ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో తాత్కాలికంగా వాయిదావేసింది. ఇప్పుడు పదోన్నతులకు లైన్‌క్లియర్‌చేస్తూ శనివారం రాత్రి పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. నిబంధనలను అనుసరిస్తూ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల జాబితా సిద్ధంచేయాలని, సీఈవోలు ఆమోదించి ప్రమోషన్లు కల్పించి పోస్టింగులు ఇవ్వాలని జీవోలో పేర్కొన్నారు. ఇప్పటికే జాబితా సిద్ధంగా ఉండటంతో సోమవారం నుంచి ఉద్యోగులకు పదోన్నతుల ఉత్తర్వులు అందనున్నట్టు అధికారులు చెప్తున్నారు. ఈ సారి 600 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు వచ్చే అవకాశాలున్నాయి. పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల్లోని జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా, సీనియర్ అసిస్టెంట్లు సూపరింటెండెంట్లుగా, సూపరిటెండెంట్లు ఎంపీడీవోలుగా పదోన్నతులు దక్కుతున్నాయి. మినిస్టీరియల్ ఉద్యోగులు కొందరు డిసెంబర్‌లో రిటైర్‌కానున్నారు. వారిలో చాలామంది పదోన్నతులకు దగ్గరగా ఉన్నారు. వారంతా ప్రమోషన్ మీద రిటైర్డ్ కానున్నారు. ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న పదోన్నతులు రిటైర్మెంట్ ముందు రావడంతో వారంతా ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

#### సీఎంకు రుణపడి ఉంటారు



పంచాయతీరాజ్‌శాఖ మినిస్టీరియల్ ఉద్యోగులకు పదోన్నతులు దక్కుతున్నాయి. ఉద్యోగులు, అధికారులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారు. రిటైర్మెంట్ సమయంలో పదోన్నతులు రావడం ఆనందంగా ఉన్నది. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో కూడా లాభం వస్తుంది. పదోన్నతులకు లైన్‌క్లియర్ కావడం మంచి పరిణామం.

**-ఆకుల నందకుమార్, మినిస్టీరియల్ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి**



## రాజీవ్‌శర్మ పదవీకాలం నాలుగేండ్లు పొడిగింపు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ పదవీకాలాన్ని ప్రభుత్వం నాలుగేండ్లు పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రాజీవ్‌శర్మ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి బోర్డు చైర్మన్‌గా కూడా నాలుగేండ్లు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా రవీంద్రభారతి ప్రధానహాలులో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

## అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

- మెరుగైన జీవితానికి ప్రభుత్వ చేయూత
- మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎయిడ్స్ మహమ్మారిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని.. అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించగలమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్ర భారతి ప్రధాన హాలులో నిర్వహించిన అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎయిడ్స్ బాధితుల సంఖ్య ఒకింత పెరగటం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో 83 వేల మంది ఎయిడ్స్ రోగులున్నారని, గత సంవత్సరం రెండువేల మంది కొత్తగా నమోదయ్యారని తెలిపారు. వారి మెరుగైన జీవితానికి ప్రభుత్వం సహకరిస్తుందని, మందులు, ఆహారమందించి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందించేందుకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతామని తెలిపారు. బాధితులు ఆత్మస్థైర్యంతో బతకాలని ఈటల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ సంచాలకుడు జీ అన్నప్రసన్నకుమారి, ప్రతినిధులు ప్రిన్స్ మాన్వర్‌సింగ్, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాధిపై జాగృతం చేయడానికి సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. కార్యక్రమానికి ముందు నిజాం కళాశాల మైదానం నుంచి రవీంద్రభారతి వరకు ఎయిడ్స్ అవగాహన ర్యాలీని చేపట్టారు.

# ధీర వనిత ఈశ్వరీబాయి

- బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడారు
- హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ
- సుప్రీంకోర్టు మాజీ సీజే బాలకృష్ణన్‌కు ఈశ్వరీబాయి స్మారక పురస్కారం ప్రదానం




ఆదివారం రవీంద్రభారతిలో సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌కు ఈశ్వరీబాయి స్మారక పురస్కారం ప్రదానంచేస్తున్న హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, భాషా, సాంస్కృతికశాఖ సంచాలకుడు హరికృష్ణ, మాజీ మంత్రులు గీతారెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి



సికింద్రాబాద్‌లో ఈశ్వరీబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి గీతారెడ్డి

**రవీంద్రభారతి:** దుష్టశక్తుల గుండెల్లో సింహస్వప్నంలా బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడిన ధీర వనిత దివంగత జే ఈశ్వరీబాయి అని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, ఈశ్వరీబాయి స్మారకట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈశ్వరీబాయి జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. ఈశ్వరీబాయి భావితరాలకు స్ఫూర్తిదాయకమని, 1969 తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆమె ప్రత్యక్షపాత్ర పోషించి జైలుకు వెళ్లారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలతో జాతీయస్థాయిలో గుర్తింపు పొంది, ప్రభుత్వ లోపాలపై అసెంబ్లీలో ధైర్యంగా ప్రశ్నించిన నాయకురాలని, ఆమె జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కొనియాడారు. మహిళలను గౌరవించిననాడే ఆమెకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ చీఫ్‌జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌కు ఈశ్వరీబాయి స్మారక పురస్కారం-2019 ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అధ్యక్షతన జరిగిన సభలో హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. ఈశ్వరీబాయి పేద ప్రజలను విద్యావంతులుగా తీర్చిదిద్దటానికి విశేష కృషిచేశారని, ఆమె జీవిత చరిత్ర డాక్యుమెంటరీ చూసి కన్నీళ్లు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. దళితులు, మహిళల హక్కుల కోసం పోరాడిన ఈశ్వరీబాయి సేవలను తెలంగాణ సమాజం మరిచిపోదన్నారు. మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈశ్వరీబాయిని స్ఫూర్తిగా తీసుకునేలా కార్యక్రమం నిర్వహించటం అభినందనీయం అన్నారు. డాక్టర్ జే గీతారెడ్డి స్వాగతం పలుకుతూ ఈశ్వరీబాయి పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని విలువలకు కట్టుబడి ఉండేవారన్నారు.

**హక్కుల కోసం పోరాడిన ఝాన్సీరాణి ఆమె: మాజీ సీజేఐ బాలకృష్ణన్**

ఈశ్వరీబాయి స్మారక పురస్కారం గ్రహీత, మాజీ సీజేఐ కేజీ బాలకృష్ణన్ మాట్లాడుతూ.. దళితుల హక్కుల కోసం పోరాడిన ఝాన్సీ రాణి ఈశ్వరీబాయి అని అభివర్ణించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించటం మామూలు విషయం కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో సమానత్వం వచ్చింది కానీ, సామాజిక సమానత్వం రాలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువల కోసం జీవించిన ఈశ్వరీబాయి పేరిట తనకు పురస్కారం అందించటం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో భాషా, సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరీబాయి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. సాంస్కృతిక సారథి కళాకారులు ఈశ్వరీబాయిపై పలు చైతన్య గీతాలు ఆలపించారు. దళిత ప్రజా చైతన్య గీతాలతో పాటు తెలంగాణ పాటలను ఆలపించి ప్రేక్షకుల్ని చైతన్యపరిచారు.

## నిస్వార్థ సేవలందించిన గొప్పవ్యక్తి: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మారేడ్‌పల్లి:** నీతి, నిజాయతీతో నిస్వార్థ సేవలు అందించిన గొప్పవ్యక్తి ఈశ్వరీబాయి అని రాష్ట్ర అబ్కారీ, క్రీడలు, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఈశ్వరీబాయి 101వ జయంతిని పురస్కరించుకొని సికింద్రాబాద్‌లోని సెయింట్ జాన్స్ చర్చి ఎదుట ఉన్న ఆమె విగ్రహానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి గీతారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ తెలంగాణకు సేవలందించిన మహనీయులను గుర్తించి, వారి జయంతి, వర్ధంతి కార్యాక్రమాలను భాషా, సాంస్కృతిశాఖ ద్వారా రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలు తెలంగాణకు చెందిన ఈశ్వరీబాయి సేవలను గుర్తించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి గీతారెడ్డి కీలక బాధ్యతలను నిర్వహించారని.. ఈశ్వరీబాయి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను గత ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించలేదని తెలిపారు. అనంతరం మాజీ మంత్రి గీతారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈశ్వరీబాయి జయంతి వేడుకలకు సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించేందుకు వెళ్లగా.. వెంటనే ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తామని చెప్పారని, తన తల్లి ఈశ్వరీబాయి తెలంగాణ కోసం అప్పట్లో శాసనసభలో చేసిన ప్రసంగాలు తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తి కలిగించాయని సీఎం కేసీఆర్ చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాషా, సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, నాయకులు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, జూపల్లి భాస్కర్, శ్రీగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ధర్మపురిలో పుణ్యస్నానం



జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో దక్షిణాభిముఖంగా ప్రవహిస్తున్న గోదావరి నదికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సోమవారం నుంచి షష్టి వారాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో వివిధ యాత్రలకు వెళ్లే భక్తులు ముందుగా ధర్మపురి వద్ద గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసేందుకు వేలాదిగా తరలివచ్చారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామివారిని దర్శించుకొన్నారు. - ధర్మపురి, నమస్తేతెలంగాణ

## ఔరంగజేబు హంతకుడు

### దేనికీ ఆయన పేరు పెట్టొద్దు

### అకాలీదళ్ ఎమ్మెల్యే మంజీందర్‌సింగ్ డిమాండ్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 1:** పాఠ్యపుస్తకాలతోపాటు రోడ్లపక్కన ఉన్న సైన్‌బోర్డుల నుంచి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పేరును తొలిగించాలని శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) ఎమ్మెల్యే మంజీందర్‌సింగ్ సిర్సా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఢిల్లీలోని సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ (డీఎస్‌జీఎంసీ) సభ్యులతో కలిసి ఢిల్లీ ల్యుటెన్స్ రోడ్డులో సైన్‌బోర్డుపై ఉన్న ఔరంగజేబు పేరుకు నల్లరంగు పూశారు. 2015లో న్యూఢిల్లీ మున్సిపల్ ఈ రోడ్డుకు భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం పేరు పెట్టింది. అయినప్పటికీ ఆ రోడ్డుకు పాతపేరే కొనసాగుతుండటంతో వారు ఈ చర్య చేపట్టారు. ఔరంగజేబు హంతకుడని, ఆయన గురు తేజ్‌బహదూర్‌ను చంపడంతోపాటు గురు గోవింద్‌సింగ్ కుమారులను చిత్రహింసలు పెట్టాడని మంజీందర్‌సింగ్ ధ్వజమెత్తారు.

### బొగతలో ఆహ్లాదం



ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం వద్ద పర్యాటకులు ఆదివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. జలపాతం అందాలను చూసి ఫిదా అయ్యారు. సందర్శకులతో బొగత పరిసరాల్లో సందడి వాతావరణం కన్పించింది. జలపాతం, చిల్డ్రన్స్ పార్క్, వాచ్ టవర్ వద్ద ఫొటోలు దిగారు. స్విమ్మింగ్‌పూల్‌లో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. - వాజేడు

# కమ్యూనిటీ రేడియోతో బహుళ ప్రయోజనాలు

### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారం చేరవేతలో కీలకపాత్ర

### దేశవ్యాప్తంగా 262 కమ్యూనిటీ రేడియోలు.. తెలంగాణలో నాలుగు మాత్రమే

### సీఆర్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కమ్యూనిటీ రేడియోలతో బహుళ ప్రయోజనాలున్నాయి. భౌగోళిక, ఔత్సాహిక సముదాయాలకు సమాచార సేవలు అందిస్తాయి. వ్యాపారాత్మక, ప్రధాన మీడియా తరచూ విస్మరించే స్థానికంగా ప్రసిద్ధిచెందిన అంశాలను ప్రసారంచేస్తాయి. స్థానికంగా ఆయా రంగాల్లోని సమస్యలు, పరిష్కార మార్గాలు, అభివృద్ధి చెందేందుకు అవసరమైన చేయూత, వివిధ అంశాలపై సరైన అవగాహన కల్పించడంలో కమ్యూనిటీ రేడియో (సీఆర్)లు కీలకపాత్ర పోషిస్తాయి. కమ్యూనిటీ రేడియోలపై సరైన అవగాహనలేని కారణంగా తెలంగాణలో పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడం లేదు. కమ్యూనిటీ రేడియోలను సమర్థంగా వాడుకుంటే అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని నిపుణులు చెప్తున్నారు. స్థానికంగా ప్రాచుర్యంలో ఉండే భాషలోనే పలు అభివృద్ధి, వ్యవసాయ, ఆరోగ్య, విద్య, పర్యావరణ, సామాజిక సంక్షేమం, కమ్యూనిటీ అభివృద్ధి, సాంస్కృతిక కళలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో కమ్యూనిటీ రేడియోలు ఎంతో దోహదపడుతాయి. స్థానిక సమూహాల అవసరాలు, ప్రత్యేక ఆసక్తులను ప్రదర్శించేందుకు ఇవి సరైన వేదికలవుతాయి. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో చాలా తక్కువ స్థాయిలో సీఆర్‌లున్నాయి. వ్యవసాయ, ఆరోగ్య, విద్య, పర్యావరణ, సాంస్కృతిక కళలతోపాటు ప్రభుత్వ పథకాలతో ప్రాధాన్యం పెరుగుతున్న చేనేత, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కమ్యూనిటీలు మరింత అభివృద్ధి చెందేందుకు సీఆర్‌లు ఎంతో ఉపయోగపడుతాయి.



#### అవగాహన కోసమే ప్రత్యేక సెమినార్



కమ్యూనిటీ రేడియోతో కలిగే ఉపయోగాలు వివరించేందుకే డిసెంబర్ నాలుగున టీ-సాట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సెమినార్ ఏర్పాటుచేస్తున్నాం. ప్రభుత్వశాఖలతోపాటు అనుభవం కలిగిన స్వచ్ఛంద సంస్థలు ఈ సెమినార్‌లో పాల్గొనాలి. తెలంగాణలో సీఆర్ ఏర్పాటుకు గల అవకాశాలు, కావాల్సిన అర్హతలపై సెమినార్‌లో నిపుణులు సలహాలు, సూచనలు ఇస్తారు. తక్కువ వ్యయంతో ఏర్పాటుచేసుకొనే కమ్యూనిటీ రేడియోతో ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు. తెలంగాణలో కమ్యూనిటీ రేడియోలు పెరుగాల్సిన అవసరం ఉన్నది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**- ఆర్ శైలేశ్‌రెడ్డి, టీ-సాట్ సీఈవో**

#### రాష్ట్రంలో నాలుగు సీఆర్‌లు మాత్రమే..

దేశవ్యాప్తంగా 162 జిల్లాల్లో 262 కమ్యూనిటీ రేడియో కేంద్రాలున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో నాలుగు కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. ఇవి హైదరాబాద్, వరంగల్ ములుగు, వనపర్తిలో ఉన్నాయి. సీఆర్ కేంద్రాల ఏర్పాటు ద్వారా 10-15 కిలోమీటర్ల పరిధిలో నివసించే కుటుంబాలు, ప్రజలు, విద్యార్థులు, యువతతోపాటు అన్ని వర్గాల ప్రజలకు ఆధునిక ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు ఆయా ప్రాంతాల్లో నివసించే కమ్యూనిటీల సంక్షేమం, అభివృద్ధి అంశాలను పెంపొందించుకోవచ్చు. మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు ఇప్పటికే పలు అంశాల్లో సేవలందిస్తున్నారు.

#### చైతన్యం.. అవగాహన పెంపొందిస్తుంది

- విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి సమర్థ, ఆవిష్కరణాత్మక విద్యను పెంపొందిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో సేంద్రియ సాగు, ఉపాధి కల్పనపై రైతులను, రైతుకూలీలను చైతన్య పరుస్తుంది.
- బయోమెడికల్, ఇతర ఆరోగ్య అంశాలను ప్రోత్సహించడానికి వినూత్న కార్యక్రమాల నిర్వహణ.
- హెచ్ఐవీ/ఎయిడ్స్ వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం.
- పర్యావరణ సమాచారం, సాంస్కృతిక కళలు విస్తరణకు దోహదం చేస్తుంది.
- సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు శిక్షణతోపాటు సాంకేతిక భరోసా కల్పించడం.
- పరిశుభ్రత, మాదకద్రవ్యాల దుర్వినియోగం, టీకా, పిల్లల సంరక్షణ వంటి అంశాలపై అవగాహన.

#### ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహం

ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిర్వహించే కమ్యూనిటీ రేడియోలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తగిన ప్రోత్సాహం లభిస్తున్నది. పలు అంశాలకు సంబంధించిన కార్యక్రమాలకు నిర్దిష్ట ధర ప్రకారం కమ్యూనిటీ రేడియోలకు స్పాన్సర్‌షిప్‌ను అందిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయి. 30 నిమిషాలపాటు నిర్వహించే కార్యక్రమాలకు సంఖ్యను బట్టి ధరను నిర్ణయించారు. ఏడాదిలో 90 కార్యక్రమాలను కమ్యూనిటీ రేడియోలకు స్పాన్సర్ చేస్తే, ఒక్కో కార్యక్రమానికి రూ.6 వేల చొప్పున, 180 కార్యక్రమాలను స్పాన్సర్‌చేస్తే.. రూ.5 వేల చొప్పున చెల్లిస్తారు. 360 కార్యక్రమాలను స్పాన్సర్ చేస్తే.. రూ.4 వేల చొప్పున చెల్లిస్తారు. దీంతోపాటు తెలంగాణ టీ-సాట్ నుంచి కూడా తగిన సహాయం చేస్తున్నారు. కమ్యూనిటీ రేడియోల నిర్వహణకు కావాల్సిన 50 శాతం సబ్జెక్టును అందిస్తూ సీఆర్ ఏర్పాటును మరింత ప్రోత్సహిస్తున్నారు.



ఆదివారం వరంగల్ సెంట్రల్ జైలు వద్ద చేపలను విక్రయిస్తున్న ఖైదీలు

## జైలు చేపకు భలే గిరాకీ

### ప్రత్యేక కొలనులో చేపల పెంపకం

**వరంగల్ క్రైం, డిసింబర్01:** వరంగల్ సెంట్రల్ జైలులోని ఖైదీలు చేపలను విక్రయిస్తుండడంతో భలే గిరాకీ ఏర్పడింది. ఆర్గానిక్ ఫుడ్‌తో పెంచుతున్న చేపలను ప్రజలు ఎగబడి కొనుగొలు చేశారు. హరితహారంలో భాగంగా కుడా ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కల పరిరక్షణ బాధ్యతను సెంట్రల్‌జైలు ఖైదీలు చూస్తున్నారు. 14 లక్షల మొక్కలను పెంచడానికి జైళ్లశాఖ ఒప్పందం కుదుర్చుకోవడంతో మొక్కలకు కావాల్సిన నీటి కోసం వరంగల్ సెంట్రల్ జైలు ఆవరణలో సుమారు ఎకరం స్థలంలో కొలను తవ్వి నీటిని నిల్వచేశారు. ఈ క్రమంలోనే చేపలను పెంచి జైళ్లశాఖకు ఆదాయం సమకూర్చాలనే ఆలోచనతో జైలు సూపరింటెండెంట్ మురళీబాబు ఆదేశాల మేరకు సిబ్బంది, ఖైదీలు ఆరు నెలల క్రితం ప్రభుత్వం పంపిణీ చేసే చేపపిల్లలను కొలనులో పోశారు. అవి ప్రస్తుతం అర కిలో నుంచి ముప్పావు కిలో సైజులో ఉండడంతో ఆదివారం జైలు బయట విక్రయించగా ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సుమారు క్వింటా చేపలను విక్రయించినట్లు జైలు అధికారులు వెల్లడించారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 2 డిసెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



సక్సెస్ మంత్ర

ప్రతి ఒక్కరికీ కొన్ని అభిరుచులుంటాయి. కానీ తమ అభిరుచులను కాదనుకుని, కుటుంబ గౌరవం కోసమో, తల్లిదండ్రుల కోరిక మేరకో తమ కెరీర్లతో కాంప్రమైజ్ అయిపోతుంటారు. ఇష్టం ఉన్నా లేకపోయినా ఎక్కడో మిగిలిన అసంతృప్తితో జీవితాన్ని నెట్టుకువస్తుంటారు కొందరు. ఆ కొందరిలా మిగలొద్దనేదే ఆంచల్ పట్టుదల. వృత్తిరీత్యా ఆమె ఒక డెంటిస్ట్. డెంటల్ సర్జన్‌గా మంచి జీవితం ఉన్నప్పటికీ దాన్ని వద్దనుకుని వ్యాపార రంగంలోకి అడుగు పెట్టిందామె. 'ది పెహ్నావా' పేరుతో ఆన్‌లైన్ స్టోర్‌ను ప్రారంభించి కోరుకున్నవారికి కోరుకున్నట్లు దుస్తులు డిజైన్ చేసి ఇస్తూ విజయపథంలో దూసుకెళ్తున్న 'ఆంచల్ మఖీజ' సక్సెస్‌మంత్ర.

## వైద్యవృత్తిని వదిలి డిజైనింగ్ రంగంలో దూసుకెళ్తున్న

# ఆంచల్ మఖీజ

**ఆం**చల్ ఢిల్లీలోని మనవ్‌రచనా మెడికల్ కాలేజీలో ఎంతో వ్యయప్రయాసల కోర్చి డెంటల్ కోర్సు పూర్తి చేసింది. డెంటిస్ట్‌గా ఆమెకు మంచి భవిష్యత్తు ఉంది. కానీ ఎక్కడో తెలియని అసంతృప్తి మనసును ఆవహించింది. ఏంటది..? తనను తాను ప్రశ్నించుకుంది. కొన్నాళ్లకి సమాధానం దొరికింది. వెంటనే డెంటిస్ట్ కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేసింది. తనకెంతో ఇష్టమైన కాస్ట్యూమ్ డిజైనింగ్, వ్యాపారం వైపు అడుగులు వేసింది. అలాగని అదంత సులభంగా జరుగలేదు. సీనియర్ మెడికల్ అధికారిగా పనిచేస్తూ పెద్ద మొత్తంలో జీతం అందుకుంటున్న సమయంలో తన నిర్ణయాన్ని వెల్లడించడంతో కుటుంబ సభ్యులు అభ్యంతరం చెప్పారు. దీంతో కొంత కాలం డెంటిస్ట్‌గానే కొనసాగింది. కానీ ఆమె మనసు ఒప్పుకోలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారం ప్రారంభించడంతో తల్లిదండ్రులు ఒప్పుకోవలసి వచ్చింది.

### అభరణాల తయారీ రంగంలోకి..

కోటి రూపాయాల టర్నోవర్ దాటిన ఆంచల్ ప్రస్తుతం తన తోటి మహిళలకు ఉపాధి కల్పించేందుకు వారికి శిక్షణ ఇచ్చి మరీ పనిలో పెట్టుకొని సామాజిక బాధ్యతను తలకెత్తుకుంది. అలాగే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద మహిళలకు ఆత్మరక్షణపై పలు కాలేజీల్లోనూ, ఆఫీసుల్లోనూ అవగాహనా సదస్సులు, ఆత్మరక్షణ పరికరాలు అందజేసింది. అంతేకాదు ఆంచల్ జువెల్లరీ, ఇతర ఆభరణాల వ్యాపారంలోకి కూడా ప్రవేశించింది.



### మధ్యతరగతి వారికోసం...

వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టాలనుకోవడం సులభంగానే సాగింది. కానీ, ఆమె చదువుకు, చేయాలనుకున్న పనికి ఏమాత్రం పొంతనలేదు. అందుకే ఆ వ్యాపారంలో అవగాహన పెంచుకునేందుకుగాను ఎంబీయేలో చేరింది. ఎంబీయే చేస్తూనే సంస్థ ప్రారంభించే ఏర్పాట్లు చేసుకుంది.అంతేకాదు ఆడవారికి పెద్ద డిజైనర్లు డిజైన్ చేసిన వస్త్రాలే సామాన్యంగా నచ్చవు. ఎంత బాగున్నా. ఇంకా ఇలా ఉంటే బాగుండు అని అనుకుంటారు. అందుకే వారి ఆలోచన మేరకే డిజైన్ చేసి ఇవ్వాలన్న ఆలోచనకు వచ్చింది. దేశంలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించే దుస్తులకు ఏమాత్రం తగ్గకుండా, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేవిధంగా దుస్తులు డిజైన్ చేసి అమ్మాలని నిర్ణయించుకుంది. అలా పెహ్నాహకు ఒక ప్రత్యేకత ఉండేలా జాగ్రత్త పడింది.

### ఆన్‌లైన్‌ను ప్రారంభించి..

అప్పుడే ఈ కామర్స్ రంగం వేళ్లూనుకుంటుంది. అప్పుడప్పుడే ఈ కామర్స్ సైట్లు ప్రారంభమవుతున్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిజినెస్‌లో దూసుకెళ్లాలని ఆంచల్ నిర్ణయించుకుంది. దానిలోని మంచి చెడులను అంచనా వేసుకుని వెంటనే 'పెహ్నావా' పేరిట ఈ కామర్స్ ప్లాట్ ఫాం తయారు చేసింది. సంప్రదాయ డిజైన్లకు పెట్టింది పేరుగా తన స్టార్టప్‌ను తీర్చిదిద్దాలనుకుంది. అంతేకాదు డిజైనర్ వేర్ అనే కాన్సెప్ట్‌ను కొత్తగా ప్రవేశపెట్టింది. ప్రతీ ఒక్కరూ మనీష్ మల్హోత్రా లాంటి టాప్ డిజైనర్లతో దుస్తులు డిజైన్ చేయించలేరు. మరి అలాంటి వారికోసం తక్కువ ఖర్చుతో కొత్త డిజైనర్లు చేసిన దుస్తులను అందుబాటులోకి తెచ్చింది. అంతేకాదు మార్కెట్‌కు సంబంధించిన మెళకువలను అందిపుచ్చుకునే పనిలో పడింది.

### ఆటంకాలను అధిగమించి

ఒక ఈ కామర్స్ పోర్టల్ ద్వారా వ్యాపారం ప్రారంభించాలని అంతా సెట్ చేసుకుంది ఆంచల్. ఒక ఐటీ కంపెనీని కూడా సంప్రదించింది. వారికి వెబ్‌సైట్ రూపొందించే పనిని అప్పగించింది. కానీ ఇంతలోనే మోసం జరిగిపోయింది. తను ఎంతో ఇన్వెస్ట్ చేసి రూపుదిద్దాలనుకున్న వెబ్‌సైట్ తయారుచేస్తున్న కంపెనీ ఫ్రాడ్ అని తేలింది. ఇది నిజంగా ఒక షాక్. అయినా భయపడలేదు. చాలెంజింగ్‌గా తీసుకొంది. ఐటీ రంగంతో సంబంధం లేకపోయినా ఒక టీంను ఏర్పాటు చేసుకొంది. పెహ్నావా వెబ్ పోర్టల్ ఈ కామర్స్ బిజినెస్‌ను స్టార్ట్ చేసింది. నెమ్మదిగా సేల్స్ పెరిగాయి. ఆర్డర్లు పెరుగుతూ పోయాయి. 2015లో 'ది పెహ్నావా డాట్ కామ్' ప్రారంభమైంది. దీనికి ఆమె సోదరుడు అంకిత్ మఖీజ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు.

### అమ్మకాలు పెరిగాయి

కస్టమర్ ఫ్రెండ్లీగా పెహ్నావాను తీర్చిదిద్దడంలో ఆంచల్ సఫలం అయ్యింది. తమ డిజైన్లు ఏ రంగులో ఉండాలి? దానిపై ఎలాంటి డిజైన్లు ఉండాలి? అని కస్టమర్లు కోరిన డిజైన్లను అందుబాటులో ఉంచింది. వినూత్నమైన ఆఫర్లతో పెహ్నావా దూసుకొచ్చింది. పెద్ద ఆన్‌లైన్ పోర్టల్స్ బిగ్ బిలియన్ సేల్ లాంటివి ఆఫర్లు ప్రకటించినప్పటికీ. పెహ్నావా ఎక్స్‌క్లూజివ్ డిజైన్లతో కస్టమర్లను ఆకర్షించి సేల్స్ గ్రాఫ్ పడనివ్వలేదు. అమ్మకాలు పెరిగే కొద్దీ సైట్ ట్రాఫిక్‌ను మరింత పెంచేలా సర్వర్ సామర్థ్యాన్ని పెంచింది. ఇప్పటి వరకూ పెహ్నావా సైట్ నుంచి 20 వేల మందికి పైగా కొనుగోళ్లు జరుగగా, ఏటా లక్షన్నర డాలర్ల రెవెన్యూను ఆర్జించింది. వినియోగదారులు కోరుకున్న విధంగా దుస్తులు రూపొందించి వాటిని డోర్ డెలివరీ చేయడం పెహ్నావా ప్రత్యేకత.



### విజయ రహస్యం

నిజానికి ఆంచల్ తీసుకున్న నిర్ణయం కుటుంబానికి నచ్చలేదు. ప్రోత్సాహం పెద్దగా లభించలేదు. కానీ విజయమే అతిపెద్ద ప్రోత్సాహం ఇస్తుందని ఆంచల్ భావించింది. అనుకున్నట్టే కష్టపడింది. ఆంచల్‌కు ఎదురు దెబ్బలు తగిలినా, ఆమె తీసుకున్న నిర్ణయం ఇంట్లో వాళ్లకు ఇష్టం లేకపోయినా, తండ్రి మాత్రం తనవైపే నిల్చున్నాడు. కూతురు ఇష్టాయిష్టాలను కాదనలేదు.

## ఆ మాత్రలు వాడితే గుండెకు చిల్లు!

**అప్పుడప్పుడు జ్వరం వస్తుంది. తరచూ జలుబు చేస్తుంది. దగ్గర్లో ఉన్న మెడికల్ షాప్‌కు వెళ్తాం. ఒక రెండు గోలీలు కొనుక్కుంటాం. అప్పటికప్పుడు వ్యాధి నయమవుతుంది. కానీ మనం మింగిన గోళీ పవర్ మాత్రం ముగియదు. అది మనలోని కొన్ని అవయవాలపై ప్రభావం చూపిస్తుంది.**



- వ్యాధి తీవ్రత ఎంత ఉన్నా యాంటీబయాటిక్ గోలి మింగుతుంటాం. అయితే ఇది మోతాదు మించితే ఉన్న రోగాలు నయమవడం పక్కన పెడితే కొత్త రోగాలు పుట్టుకొస్తాయి. బ్యాక్టీరియా సంబంధ వ్యాధులు ఎక్కువగా యాంటీ బయాటిక్స్ వాడితే వస్తాయి.
- యాంటీబయాటిక్స్ ఎక్కువగా వాడితే గుండె సంబంధిత జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. నెలలో దాదాపు ఆరుసార్లు యాంటీ బయాటిక్ మందులు వాడేవారికి గుండె సంబంధిత సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.
- యాంటీబయాటిక్స్‌లో అమోక్సిసిల్లిన్, మెట్రొనైడజోల్ రసాయనాలు ఉంటాయి. ఇవి డయేరియాకు కారణమవుతాయి. చాలా తరచుగా నీళ్ల విరేచనాలు అవడానికి యాంటీ బయాటిక్స్ కారణమవుతాయి. యాంటీ బయాటిక్స్‌ను ఏదైనా ఇన్‌ఫెక్షన్ నివారించడానికి తీసుకోవడం వల్ల ఎసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యలకు కారణమవుతాయి.
- ఎక్కువగా ట్యాబ్లెట్లు వాడడం వల్ల కిడ్నీల పనితీరు ఆగిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి ఇలాంటి యాంటీ బయాటిక్స్‌కు దూరంగా ఉండడం వల్ల కిడ్నీ వ్యాధులను అరికట్టవచ్చు. వీలైనంత వరకు డాక్టర్ సూచన మేరకే యాంటీ బయాటిక్స్ వాడాలి.
- కొత్తిమీరలో చాలా విటమిన్స్, ఫైటో న్యూట్రియంట్స్ ఉంటాయి. ఇవి శరీర రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తాయి. దీంతో పాటు వీటిలోని యాంటీ బయాటిక్ లక్షణాలు వైరస్‌ను ఎటాక్ చేస్తాయి. అందుకే అనారోగ్యంగా ఉన్నప్పుడు ఎక్కువ కొత్తిమీరను ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. కొత్తిమీరను జ్యూస్‌లా చేసుకొని కూడా తాగొచ్చు.

### ఆరోగ్య చిట్కాలు



- మిరియాలు, బెల్లాన్ని కాస్త పరగడుపున తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
- జీలకర్ర, కలకందను నమిలి తింటే దగ్గు నయం అవుతుంది.
- నాలుగు మిరియాలు, దాల్చిన చెక్కల్ని నెయ్యిలో వేయించి పొడిచేసి ఓ తమలపాకులో మడిచి తీసుకుంటే దగ్గును దూరం చేసుకోవచ్చు.
- నాలుగు మిరియాలు, కాస్త బియ్యాన్ని ఉడికించి తీసుకుంటే దగ్గుకు చెక్ పెట్టవచ్చు.
- తులసి ఆకులను ఎండబెట్టి పొడి చేసుకొని వేడినీటిలో కషాయలా వేసుకొని తాగితే ఆకలిలేమిని దూరం చేసుకోవచ్చు.

## నిద్రమత్తు వదులుతుందిలా..

**చాలామందికి ఉదయాన్నే అస్సలు మెలకువ రాదు. ఎన్నో రోజుల నుంచి ప్రయత్నిస్తున్నా ఉదయాన్నే నిద్ర నుంచి లేవలేరు. అలారం మోగితే ఆపేసి మరీ పడుకుంటారు. ఇక చలికాలమైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. హాయిగా బారెడు పొద్దెక్కే వరకు నిద్రపోతారు. ఇలాంటివారు ఉదయాన్నే నిద్ర లేవాలంటే ఈ చిన్న చిట్కాలు పాటించాలి.**



- ఎవరైతే సూర్యుడితో పోటీపడి ఉదయాన్నే నిద్రలేస్తారో వారు స్వయం ప్రకాశకులు అవుతారు. ప్రతి రోజూ ఒక్క ఐదు నిమిషాలు మాత్రమే ముందుగా లేసే ఉద్యమంలో చేరాలి. గంట ముందు నిద్ర లేవాలి అనుకునే కంటే రోజు ఐదు నిమిషాలు పెట్టుకుంటే చాలు వారం తర్వాత అరగంట ముందు నిద్ర లేస్తారు. ఇది మనం అనుకున్న సమయానికి చేరుకునే వరకు ఫాలో అవుతూనే ఉండాలి.
- ఉదయాన్నే లేవడానికి ఒక మంచి కారణం స్పష్టం చేసుకోవాలి. ఇష్టమైన పని ఎంత కష్టమైనా ఎంతో ఆనందంగా మనం పూర్తి చేస్తాం. అయితే అదే ఆనందం రోజంతా ఉంటుంది. మనం నిద్ర లేవగానే ఆరోజు ఉదయం మొదటి ముప్పై నిమిషాలు రోజుని ప్రభావితం చేస్తాయి. ఇష్టమైన రెండు మూడు పనుల్ని చేయడం వల్ల రోజంతా ఉల్లాసంగా ఉండవచ్చు.
- ప్రతి రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి. బెడ్ మీదకు వెళ్లగానే నిద్ర రావాలంటే గంట ముందు నుంచి అన్ని ఎలక్ట్రానిక్స్‌కు దూరం ఉండాలి. పడుకునేటప్పుడు కొంచెం సిల్లీగా అనిపించినా దిండుతో మాట్లాడాలి. దిండుకు ఉదయాన్నే లేపమని చెప్పాలి. ఇలా చేస్తే అలారం కంటే ముందే మెలకువ వస్తుంది.
- అలారం చేతికి అందకుండా దూరంగా పెట్టుకోవాలి. ఇలా చేస్తే ప్రత్యేకంగా లేచి వెళ్లి అలారం ఆఫ్ చేస్తాం. సగం నిద్ర మత్తు తొలగిపోతుంది. ఇష్టమైన మ్యూజిక్‌ను అలారం టోన్‌గా సెట్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఉదయం లేవడంతోనే మనసు హాయిగా అనిపిస్తుంది.
- రోజూ ఉదయమే వాకింగ్, రన్నింగ్ చేసే వాళ్లతో పరిచయం పెంచుకోండి. అలా ఒక గ్యాంగ్ ఏర్పడితే మంచి చెడుల్ని కూడా పంచుకోవచ్చు. కొన్ని రోజుల తర్వాత ఆ మిత్రుల కోసమైనా ఉదయాన్నే లేవడం అలవాటు చేసుకుంటారు.

## చెక్కతాంబూలం @ నిర్మల్

**కొయ్య బొమ్మలకు ప్రసిద్ధి నిర్మల్. నేటి తరానికి తగ్గట్లుగా ఆధునికతను సొంతం చేసుకుంటూ కొత్తరూపుతో మార్కెట్‌ను అలరిస్తున్నాయి. అలా వచ్చిందే ఈ చెక్క తాంబూలం. ఇవే కాకుండా తమలపాకు, పోక, సున్నం, కాసు, యాలకులు వంటి అద్భుత ఆకృతులు హైదరాబాద్‌లోని 'నిర్మల్ టాయ్స్ అండ్ ఆర్ట్స్ కో ఇండస్ట్రియల్ కో ఆపరేటివ్ సొసైటీ'లో అందుబాటులో ఉన్నాయి. ట్రెండ్‌కు తగ్గట్లుగా రూపాంతరం చెందుతున్న నిర్మల్ బొమ్మలపై మరోసారి.**



**ఎ**వరి ఇంటికి వెళ్లినా షోకేస్‌లో ఎదురెదురుగా నిలబడి ఉన్న కోడిపుంజులు. అల్మారాల్లో జింక, పులి, పక్షులను చూస్తున్నంతసేపు ఒకసారి అడవిలో ఉన్న అనుభూతి కలుగుతుంది. కొద్దిసేపటికీ గాని అర్థంకాదు. అంతలా భ్రమింపజేస్తూ అబ్బురపరుస్తుంటాయి తెలంగాణలోని నిర్మల్‌కు చెందిన కొయ్యబొమ్మలు. వీటిని తయారు చేస్తున్న కార్మికులు జాతీయ స్థాయిలో అవార్డులు పొందారు. 400 ఏండ్లక్రితం కళాకారులు నిర్మల్‌కు వలస వచ్చారు. నాటి నుంచి ఇదే కళను నమ్ముకొని జీవిస్తున్నారు. ముందుగా కర్రలను సేకరించి వాటిని ఆరబెట్టి తగిన రూపాలకు చెక్కి బొమ్మలుగా తీర్చిదిద్దుతారు. వాటికి పెయింటింగ్ వేసి విక్రయిస్తుంటారు. పక్షులు, జంతువులు, ఫలాల్లాంటి కొయ్యబొమ్మలకే కాకుండా వర్ణచిత్రాలకు కూడా నిర్మల్ పేరుగాంచింది. నిర్మల్ సంస్థానాన్ని పరిపాలించిన నిమ్మనాయుడు దేశం నలుమూలల నుంచి కళాకారులను నిర్మల్‌కు రప్పించి చేతికళలను అభివృద్ధి పరిచాడు. దీంతో నిర్మల్‌లో17వ శతాబ్దంలో నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమ ప్రారంభమైంది. నకాషీ కులానికి చెందిన కళాకారులు ఈ బొమ్మల తయారీలో నిమగ్నమై వీటిని తయారు చేశారు. నిజాం నవాబు ఓసారి నిర్మల్ పట్టణాన్ని సందర్శించడానికి వచ్చిన సందర్భంలో ఆయనకు సకల లాంఛనాలతో నవాబుకు స్వాగతం పలుకుతూ కోటలోకి ఆహ్వానించారు. నవాబు సింహాసనంపై కూర్చోగానే పైనుంచి ఆయనపై పూలవర్షం కురిసింది. అవి మామూలుపూలు కావు బంగారు పూలు. అయితే నిజానికి అవి బంగారు పుష్పాలు కావు వాటి భ్రాంతిని కలిగించే విధంగా నిర్మల్ కళాకారులు సృష్టించిన కృత్రిమ పుష్పాలు.





### తయారీ..

నిర్మల్‌కు 25 కి.మీ. దూరంలో అడవులలో లభించే 'పొనిక' చెట్లు 30 యేండ్లకు పడిపోతాయి. ఇవి చాలా తక్కువ బరువు కలిగుండడం వల్ల ఎక్కువ యేండ్లు ఉండవు. వీటి కర్రలను ఫారెస్ట్‌వాళ్లు సేకరించి గవర్నమెంట్ డిపోలో కొలతులు చేసి అమ్ముతారు. వాటినే బొమ్మలకు ఎంచుకుంటారు. వీటిని కాల్చినా కాలవు. పొనిక కర్రలతోపాటు వనమూలికలు, సహజమైన రంగులను ఉపయోగించి తయారుచేస్తారు. అందువల్లే ఈ బొమ్మలు అందరినీ ఆకర్షిస్తాయి. పొనికి కర్రను తెచ్చి కావాల్సిన రీతిలో వాటిని తయారు చేసుకొని బొమ్మ ఆకారానికి మలుస్తారు. చింతగింజల పిండితో తయారుచేసిన జిగురుతో చిన్న చెక్కముక్కలను కావాల్సిన రీతిలో చెక్కి ఆ బొమ్మలకు అతికించి స్వరూపం కల్పిస్తారు. ఆ తర్వాత బొమ్మను ఎండలో ఆరబెట్టి రంగులు వేస్తారు. అడవుల్లో దొరికే ఆకుపసర్లు, సహజ వర్ణాలు ఉపయోగించి బంగారు వర్ణాన్ని తయారు చేస్తారు. కళాకారులు తయారు చేసే బొమ్మల్లో పక్షులు, జంతువులు, కూరగాయలు, ద్రాక్షపండ్లు, లవంగాలు, యాలకులు, అగ్గిపెట్టె, సిగరెట్లు, తమలపాకు, పోక, సున్నం, కాసు, అడకత్తెర, జాజికాయలను చూస్తే సహజత్వాన్ని తలపిస్తాయి. దీనికితోడు కళాకారులు వేసే పెయింటింగ్స్ గొప్పగా ఉంటాయి. పిల్లలు ఆడుకునే బుడ్డీలు, బొమ్మలు కూడా ఉన్నాయి. ముని కోపంవల్ల శిలారూపం దాల్చిన గంధర్వకన్య, యుద్ధరంగంలో శ్రీకృష్ణుడు అర్జునికి చేసే గీతాబోధనలు, ప్రకృతి సహజంగా ఏర్పడిన చిత్రాలు నిర్మల్ కళాకారుల చతురతకు అద్దంగా నిలుస్తున్నాయి. నిర్మల్ కొయ్యబొమ్మలను హైదరాబాద్‌లోని లేపాక్షి ఎంపోరియం ద్వారా అమెరికా, రష్యా, అరేబియా, మలేషియా, ఇరాన్, దుబాయ్, స్విట్జర్లాండ్, సింగపూర్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే వీలుంది. బొమ్మల తయారీపై ఆసక్తి ఉండేవారికి ప్రభుత్వం వర్క్‌షాపులు నిర్వహిస్తుంది. ఈ మధ్యనే ముషీరాబాద్‌లోని ఆర్టీసీక్రాస్ రోడ్ గోల్కొండ హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎంపోరియం వద్ద వర్క్‌షాపులు నిర్వహించింది. ఆసక్తి ఉన్నవారికి నిర్మల్ కళాకారులు ఉచితంగా కొయ్యబొమ్మల తయారీ నేర్పిస్తారు. బొమ్మసైజును బట్టి సమయం పడుతుంది. పెయింటింగ్ ఆరడానికి ఎక్కువ టైం పడుతుంది. కళాకారులు నెలకు 100కు పైగా బొమ్మలు తయారు చేస్తారు. చేసినవన్నీ గోల్కొండ ఎంపోరియంకు పంపిణీకి చేస్తారు. బొమ్మను బట్టి కళాకారులు ధర నిర్ణయిస్తారు. కొనుగోలు చేసిన బొమ్మలు కిందపడి పగిలితే కొంత అమౌంట్ తీసుకొని వాటికి మరలా పాలిష్ చేసి ఇస్తారు.

### అవార్డులతో ప్రోత్సహిస్తున్నారు

నేను తెలంగాణలోని నిర్మల్‌కు చెందిన కొయ్యబొమ్మల కళాకారుడిని. హైదరాబాద్‌లో 'నిర్మల్ టాయ్స్ అండ్ ఆర్ట్స్ కో ఇండస్ట్రియల్ కో ఆపరేటివ్ సొసైటీ'లో తయారు చేసిన కొయ్యబొమ్మలను అమ్ముతాం. ఒకరిని పనిలో పెట్టి కొయ్యబొమ్మలను అమ్మిస్తారు. అందుకు సొసైటీ అతనికి రోజుకు రూ. 500 ఇస్తుంది. అమ్మగా వచ్చిన డబ్బును సొసైటీకి ఇస్తారు. హైదరాబాద్‌లోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫేషన్ టెక్నాలజీ', ఢిల్లీ, బెంగళూరు నుంచి కొంతమంది డిజైనర్లు వచ్చి ట్రెండింగ్‌లో ఉన్న డిజైన్లను 10 రోజులపాటు మావద్దే ఉండి వివరిస్తారు. తయారుచేసిన వాటిని వారు ముంబై, బెంగళూరు వంటి నగరాల్లోని టెస్ట్‌మార్కెట్లో పెట్టి ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. వాటిని సవరిస్తూ మరలా తయారు చేసి ఇస్తాం. మాలాంటి కళాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్రంలో ప్రతీఏడాది పోటీ నిర్వహిస్తారు. ఇందులో 80 మంది వరకు పోటీ చేస్తారు. విజేతగా నిలిచిన వారికి ముఖ్యమంత్రి కేసీఆర్ 'తెలంగాణ స్టేట్ అవార్డు' ప్రదానం చేస్తారు. ఈ విధంగా నాకు 2018లో అవార్డు వచ్చింది. వంశపారంపర్యంగా వస్తున్న వృత్తినే నమ్ముకొని బతుకుతున్నాం.

– నాంపల్లి లింబాయ్య వర్మ, కళాకారుడు



నమస్తే తెలంగాణ
నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 2 డిసెంబర్ 2019



# ఆకలి - ఆయాసం

## చిన్నారుల్లో పౌష్టికలోపంపై యునిసెఫ్ నివేదిక

**ప్రపంచంలోని ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరు ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నారు. 70కోట్ల మంది చిన్నారుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు పౌష్టికాహారలోపంతో లేదా ఊబకాయంతో బాధపడుతున్నారు. ఈ రెండింటి కారణంగా వారు జీవితాంతం ఆరోగ్య సమస్యలతో బాధపడుతారని యునిసెఫ్ హెచ్చరించింది. పోషకాహార లోపం కారణంగా నాలుగేండ్లు లేదా అంతకంటే తక్కువ వయస్సున్న 14 కోట్ల మందికి పైగా చిన్నారులు ఉండాల్సిన ఎత్తుకన్నా తక్కువ ఉన్నట్లు తన నివేదికలో పేర్కొంది. ఇదే వయస్సులోని 5 కోట్ల మంది చిన్నారులు ఉండాల్సినదానికన్నా బలహీనంగా, బక్కపల్చగా ఉన్నట్లు వివరించింది. సగానికి సగం మంది చిన్నారులు అవసరమైన విటమిన్లు, ఖనిజలవణాలు పొందట్లేదని ఆందోళన వ్యక్తం చేసింది. పలు దేశాల్లో చిన్నారులు తీసుకుంటున్న ఆహారంవల్ల వారి కడుపు నిండుతున్నా అందులో కావాల్సిన పోషకాలు అందట్లేదనే కఠిన వాస్తవాలతో ఇటీవల నివేదికను విడుదల చేసింది. అందులోని కీలక అంశాలు కొన్ని నిపుణ పాఠకుల కోసం..**

- మన దేశంలో 35శాతం మందికి ఎదుగుదల లోపం, యుక్తవయస్సులోని బాలికల్లో 40 శాతం మంది, బాలల్లో 18 శాతం రక్తహీనత సమస్య ఉంటోందని యునిసెఫ్ సర్వేలో వెల్లడైంది. ఇక ఐదేండ్లలోపు చిన్నారులు అత్యల్ప ఆహారం, అతి తిండి పరిణామంతో బాధపడుతున్నారు. పిల్లలకు అందాల్సిన ఆహారం విషయంలో విచిత్రపరిస్థితి నెలకొందని పేర్కొంది. ఎదుగుతున్న వయస్సుకు తగ్గట్లుగా సరైన తిండి లేకుండా ఉండే బలహీన చిన్నారులు, మరోవైపు వయస్సుకు మించి అతి ఎక్కువగా తిండితో స్థూలకాయులు అవుతున్నవారు ఉన్నారని తెలిపింది. దీంతో అపసవ్య పరిస్థితి ఏర్పడుతుంది. ఆరు నెలల నుంచి రెండేండ్లలోపు ఉండే పిల్లల్లో మూడింట రెండొంతుల వరకు సరైన పోషకాహారం అందడం లేదు. ముఖ్యంగా అల్పాదాయ వర్గాలకు చెందిన కుటుంబాల్లో ఆరు నెలల నుంచి రెండేండ్ల వయస్సుగల 5 మంది చిన్నారుల్లో ఒకరు మాత్రమే ఆరోగ్యకరమైన పెరుగుదలకు సంబంధించిన ఆహారం తీసుకుంటున్నారు. ఇదే విషయంలో యూకే, యూఎస్ లాంటి సంపన్న దేశాల్లో అతి ఎక్కువ తిండితో స్థూలకాయులవుతున్న పిల్లలు సరైన ఆహారం అందక బక్కచిక్కిపోతున్న పిల్లల కంటే రెండు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది.
- బాల్యదశలోనే ఆహారపు అలవాట్లపై సరైన జాగ్రత్తలు తీసుకోవాలని యునిసెఫ్ పేర్కొంది. సరైన ఆహారం సరైన మోతాదులో తీసుకునే విషయం ఈ దశలోనే కీలకం. ఒకవైపు ఆహారం దొరక్క సరైన ఎదుగుదల లేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలలు, మరోవైపు అతిఎక్కువ తిండి అందుబాటులో ఉండటంతో చిన్నతనంలోనే ఊబకాయులవుతున్న చిన్నారులు ఎంతోమంది ఉన్నారు. పిల్లలు సక్రమ రీతిలో తినకపోతే వారు సవ్యంగా బతకలేరనే కీలకమైన మౌలిక అంశం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.
- పిల్లలు తమ ఎత్తుకు తగ్గ బరువు ఉండట లేదు. దీంతో అనారోగ్యసమస్యలు తలెత్తుతున్నాయి. పిల్లల్లో విటమిన్ ఏ, ఐరన్ వంటి అత్యావసర పోషకపదార్థాల లోపం నెలకొని ఉంది. కొన్ని దేశాల్లోని చిన్నారులు పండ్లు, కూరగాయల ఆహారం దక్కని స్థితిలో ఉన్నారు. పిల్లలు ఎదుగుతున్న కొద్ది వారిలో చిరుతిండ్లు, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు పెరుగుతూ ఉంటాయి. సరైన విధంగా పెద్దల మార్గదర్శకత్వం లేకపోవడంతో కేవలం రుచికరమైన తిండికే పిల్లలు అలవాటుపడి తర్వాత అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని వెల్లడైంది.
- పదింట తొమ్మిది దేశాలు 'బరువు' సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయి. ఈ దేశాల్లో ఊబకాయంతో, పౌష్టికాహార లోపంతో బాధపడే ప్రజలు పక్కపక్కనే బతుకుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా జంక్‌పుడ్ విస్తరించడం, రవాణాసౌకర్యాలు మెరుగవ్వడం, టీవీలు ఇలా అనేక కారణాలున్నాయి. బరువు అధికంగా ఉన్నవారిలో పోషకాహార లోపం లేదని చెప్పలేం. కొందరు వయస్సుకు తగ్గ బరువు ఉంటారు. కానీ వారిలో కొవ్వు మోతాదుకుమించి ఉంటున్నది. ప్రతి దేశమూ ఎంతో కొంత పోషకాహార లోపం సమస్యను ఎదుర్కొంటుంది. ప్రపంచవ్యాప్తంగా గడిచిన 40 ఏండ్లలో ఊబకాయ బాధితుల సంఖ్య మూడు రెట్లు పెరిగింది.
- పిల్లల్లో నానాటికీ పెరిగిపోతున్న పోషకాహార లోపం సమస్యను అధిగమించడం కోసం యునిసెఫ్ తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉన్న ఆహార పదార్థాల జాబితా పుస్తకాన్ని విడుదల చేసింది. కేవలం రూ.20 ఖర్చుతో తక్కువ బరువు ఊబకాయం, ఎనిమియా సమస్యలను అధిగమించవచ్చని పేర్కొంది. ఈ మేరకు వంటకాల జాబితాతో కూడిన 28 పేజీల బుక్‌లెట్‌ను విడుదల చేసింది. తక్కువ బరువుతో బాధపడుతున్నవారికి ఊతప్పం, ఆలూపరోటా, పనీర్ కతిరోల్, సాగా కట్‌లెట్, ఊబకాయంతో బాధపడుతున్న వారికి దాల్ పరోటా, పోహా, వెజిటబుల్ ఉప్మా వంటి ఆహార పదార్థాలను అందించటం ద్వారా ఆ సమస్యలను అధిగమించవచ్చని యునిసెఫ్ పేర్కొంది.
- వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కొన్ని ఆహారపదార్థాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యం, వాతావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కేవలం మూడు ధాన్యాలు (బియ్యం, మక్కజొన్న, గోధుమ) మనిషి ఆహారంలో ఎక్కువ శాతం ఇవే ఉంటున్నాయి. అయితే ప్రజలకు తగినంత శక్తి అందుతుంది. కానీ ఇంత తక్కువ ఆహారపదార్థాలపై ఆధారపడటం వల్ల ప్రజలకు కావాల్సినంతగా మినరల్స్, విటమిన్లు అందడం లేదు. ఆహారంలో భిన్నమైన పదార్థాలను చేర్చుకోవడం ద్వారా వనరుల వినియోగంలోనూ సుస్థిరత రావడంతో పాటు వన్యప్రాణులకు మేలు కలుగుతుందని చెబుతున్నారు.
- మనదేశంలో లభించే పలు వంటకాల్లో మెరుగైన పోషకవిలువలు ఉన్నట్లు యునిసెఫ్ సూచించింది. ఊతప్పం, మొలకెత్తినగింజలతో చేసిన పరోటావంటి ఆహార పదార్థాలను సూచించింది. పిల్లల్లో తక్కువ బరువు సమస్యను అధిగమించేందుకు ఆలుపరాటా, పనీర్‌కటిరోల్, సగ్గుబియ్యం, కట్‌లెట్ వంటివి, స్థూలకాయసమస్య నివారణకు మొలకెత్తిన పప్పుగింజలతో పరాటాలు, పోహా, ఉప్మా మొదలైన ఆహారం అందించవచ్చని సూచించింది. అలాగే రాగులతో పోషకాలు, ప్రొటీన్లు, ఏ, బీ, సీ విటమిన్లు, మినరల్స్ అందుతాయి. జీర్ణశక్తి పెరగడంతోపాటు అధిక బరువులు తగ్గించడంలో మానసిక ప్రశాంతతను అందజేయడంలో రాగులు ప్రముఖ పాత్ర పోషిస్తాయి.
- వీటితో పాటు చౌకగా దొరికే మరిన్ని పోషకాలు ఉన్న ఆహారాన్ని, పర్యావరణానికి మేలు చేసేవి వైద్యనిపుణులు సూచించారు. ఇవి మనకు అతితక్కువ ఖర్చుతో లభించేవే. మనం తీసుకునే ఆహారంలో కొంచెం మార్పులతో ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటూ, సమస్త జీవానికి ఆధారమైన భూమిని కూడా ఆరోగ్యంగా ఉంచవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు. అత్యధిక పోషకాలు కలిగిన వాటిలో 74 శాతం శాకాహార పదార్థాలే కావడం.. మాంసాహారంతో పోలిస్తే కొన్ని మొక్కలు, ఆకులు విత్తనాలు, వేర్లలో పోషకాలు ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

...✍ సత్యంగౌడ్ సూదగాని

Under-five mortality rate (deaths per 1,000 live births)
(ఐదేండ్ల లోపు చిన్నారుల మరణాల రేటు ప్రతి వెయ్యి మంది జననాలకు)

| UNICEF Region | 1980 | 1985 | 1990 | 1995 | 2000 | 2005 | 2010 | 2015 | 2018 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| East Asia and Pacific | 73 | 62 | 57 | 49 | 40 | 29 | 22 | 17 | 15 |
| Europe and Central Asia | 44 | 37 | 31 | 27 | 21 | 16 | 12 | 10 | 9 |
| Eastern Europe and Central Asia | 66 | 54 | 46 | 45 | 36 | 26 | 19 | 15 | 13 |
| Western Europe | 16 | 13 | 10 | 8 | 6 | 5 | 4 | 4 | 4 |
| Latin America and Caribbean | 84 | 68 | 55 | 43 | 33 | 25 | 24 | 18 | 16 |
| Middle East and North Africa | 123 | 86 | 65 | 53 | 42 | 34 | 27 | 23 | 22 |
| North America | 15 | 12 | 11 | 9 | 8 | 8 | 7 | 7 | 6 |
| South Asia | 172 | 150 | 130 | 112 | 94 | 77 | 62 | 49 | 42 |
| Sub-Saharan Africa | 201 | 188 | 180 | 172 | 153 | 125 | 101 | 85 | 78 |
| Eastern and Southern Africa | 185 | 172 | 164 | 156 | 136 | 107 | 82 | 64 | 57 |
| West and Central Africa | 217 | 205 | 197 | 188 | 170 | 143 | 120 | 105 | 97 |
| Least developed countries | 211 | 192 | 175 | 159 | 137 | 110 | 89 | 71 | 64 |
| **World** | **118** | **102** | **93** | **87** | **76** | **63** | **51** | **42** | **39** |

Under-five deaths (thousands)

| UNICEF Region | 1980 | 1985 | 1990 | 1995 | 2000 | 2005 | 2010 | 2015 | 2018 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| East Asia and Pacific | 2,622 | 2,416 | 2,302 | 1,706 | 1,259 | 910 | 696 | 542 | 462 |
| Europe and Central Asia | 571 | 483 | 387 | 305 | 218 | 164 | 135 | 111 | 96 |
| Eastern Europe and Central Asia | 474 | 410 | 329 | 263 | 188 | 138 | 112 | 92 | 78 |
| Western Europe | 97 | 74 | 57 | 41 | 30 | 26 | 23 | 20 | 18 |
| Latin America and Caribbean | 948 | 786 | 641 | 501 | 377 | 282 | 262 | 190 | 172 |
| Middle East and North Africa | 902 | 708 | 547 | 420 | 325 | 271 | 246 | 235 | 220 |
| North America | 55 | 50 | 47 | 40 | 35 | 35 | 32 | 29 | 27 |
| South Asia | 5,585 | 5,258 | 4,743 | 4,191 | 3,570 | 2,934 | 2,279 | 1,716 | 1,475 |
| Sub-Saharan Africa | 3,396 | 3,613 | 3,857 | 4,087 | 4,045 | 3,696 | 3,304 | 3,007 | 2,869 |
| Eastern and Southern Africa | 1,631 | 1,727 | 1,827 | 1,908 | 1,834 | 1,590 | 1,322 | 1,107 | 1,024 |
| West and Central Africa | 1,765 | 1,886 | 2,031 | 2,179 | 2,212 | 2,107 | 1,982 | 1,900 | 1,845 |
| Least developed countries | 3,580 | 3,619 | 3,605 | 3,558 | 3,330 | 2,895 | 2,508 | 2,136 | 1,992 |
| **World** | **14,080** | **13,314** | **12,524** | **11,250** | **9,831** | **8,292** | **6,955** | **5,828** | **5,322** |



## ఈ పదార్థాలు-బహుమేలు

- **మునగాకు:** మునక్కాయలు మనం నిత్యజీవితంలో చూస్తూనే ఉంటాం. మునక్కాయలే కాకుండా మునగ ఆకుల్లోనూ పుష్కలంగా పోషకాలు ఉంటాయి. ఆయుర్వేద వైద్యవిధానంలో మునగకు ఎంతో ప్రాధాన్యం ఉంది. మునగ ఆకుల్లో ఏ, బీ, సీ విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, అమైనో ఆమ్లాలు ఉంటాయి.
- **అనపకాయ:** ఎలాంటి నేలలోనైనా, వాతావరణ పరిస్థితిలోనైనా ఇది పెరుగుతుంది. లేతగా ఉన్నప్పుడు లోపల ఉండే గింజలనే కాకుండా మొత్తం కాయను తినవచ్చు. ప్రొటీన్లు, పీచుపదార్థాలు ఎక్కువగా ఉంటాయి.
- **బొబ్బర్లు:** ఎన్నో రకాలున్న బొబ్బర్లలో మంచి పోషకవిలువలు ఉన్నాయి. ఫోలేట్, మెగ్నీషియం సహా ఖనిజలవణాలు, విటమిన్లు, ప్రొటీన్లు ఉంటాయి. ఇంకా ఇది నైట్రోజన్‌ను అమ్మోనియాగా మార్చి పర్యావరణానికి మేలు చేస్తాయి.
- **మైసూరుపప్పు:** ఇందులో ప్రొటీన్లు, పీచుపదార్థాలు, కార్బోహైడ్రేట్లు ఉంటాయి. వండటం కూడా చాలా సులువు. 15-20 నిమిషాల్లో ఉడుకుతుంది.
- **పెసర్లు:** విటమన్ బీ, ఖనిజలవణాలు, ప్రొటీన్లు ఉంటాయి. నైట్రోజన్‌ను అమ్మోనియాగా మార్చేందుకు సాయపడతాయి. పెసరపంట ఎండ, కరువు పరిస్థితులను తట్టుకుంటుంది.
- **సోయాచిక్కుడు:** విటమిన్ కే, బీలతో పాటు ఐరన్, మెగ్నీషియం, పాస్ఫరస్, కాపర్, పొటాషియం, మాంగనీస్, జింక్, సెలీనియం, క్యాల్షియం వంటి పోషకాలు ఉంటాయి. ప్రతి వంద గ్రాముల సోయాచిక్కుడులో దాదాపు 38 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. గుడ్ల కంటే మూడు రెట్లు ఎక్కువ. సోయాలో ఇన్ని విలువలున్నా నాలుగింట మూడొంతులు పశువులకు మేతగానే వినియోగిస్తున్నారు.
- **నాగజెముడు:** ఎడారి మొక్కగా పిలిచే దీనిలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. దీనిలో తక్కువ క్యాలరీలు, ఎక్కువపీచు పదార్థాలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి బాగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.
- **తోటకూర:** నీటి లభ్యత తక్కువగా ఉన్నా పెరిగే ఈ పంటలో ఆకులతోపాటు విత్తనాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. పీచు పదార్థాలు, మెగ్నీషియం, ప్రొటీన్ సమృద్ధిగా ఉంటాయి.
- **రాగులు:** విటమిన్ బీ1, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. రాగులను జావలా, పిండిగా మార్చుకుని తినవచ్చు. ఇంకా వీటికి కీటక నిరోధక శక్తి కూడా ఎక్కువే.
- **గుమ్మడిపూలు:** గుమ్మడి పూలు, ఆకుల్లో పోషకాలు మెండుగా ఉంటాయి. వాస్తవానికి దీనిగురించి పెద్దగా ఎవరికి తెలియకపోవడంతో వృథా అవుతున్నాయనే చెప్పవచ్చు. పూలలోని మధ్యభాగం తీసివేసి, మిగతాది ఆహారపదార్థాల్లో తీసుకోవచ్చు. విటమిన్ సీ ఎక్కువగా ఉంటుంది.
- **బీట్‌రూట్ ఆకులు:** మెగ్నీషియం, పొటాషియం ఎక్కువగా ఉండే బీట్‌రూట్ ఆకుల్లో ఐరన్‌తో పాటు.. కంటిచూపునకు మంచిదైన లూటెన్ కూడా ఉంది.
- **పాలకూర:** ఏ, బీ, సీ, ఫైటో న్యూట్రియంట్స్ సమృద్ధిగా ఉంటాయి.
- **అవిసెగింజలు:** ఆల్ఫాలైనోలెనిక్ యాసిడ్ అనే ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లం ఉంటుంది. దీనివల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది.
- **జనపనారవిత్తనాలు:** ఒమేగా 3, ఒమేగా 6 ఫ్యాటీ ఆమ్లాలు, ప్రొటీన్లు, పీచుపదార్థాలు, ఐరన్, విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. 30 గ్రాముల విత్తనాలు తీసుకుంటే ఒక గ్రామ్ పీచు పదార్థాలు, 9 గ్రాముల ప్రొటీన్లు మానవ శరీరానికి అందుతాయి.
- **నువ్వులు:** కాపర్, మెగ్నీషియం మెండుగా ఉండే వీటిని పచ్చిగా, వేయించైనా తినొచ్చు. వీటి నూనె ద్వారా కూడా పోషకాలు అందుతాయి.
- **మొలకెత్తిన శనగలు:** కప్పు మొలకెత్తిన శనగలు తీసుకుంటే 10 గ్రాముల ప్రొటీన్లు శరీరానికి లభిస్తాయి.
- **తామర వేళ్లు:** తామరచెట్టు వేళ్లను తినొచ్చని చాలామందికి తెలియదు. వీటిలో ఔషధగుణాలు ఉంటాయి. విటమిన్ సీ52 ఎక్కువగా ఉంటుంది.
- **చిలగడదుంప(కందగడ్డ):** ఉడకబెట్టుకుని తినే చిలగడదుంపలో ఏ, సీ, ఈ విటమిన్లు, మాంగనీస్ ఉన్నాయి.
- **చిక్కుడు:** ప్రొటీన్, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి.

# ఐనెట్-2021

**షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్స్ కోసం నిర్వహించే ఇండియన్ నేవీ ఎంట్రెన్స్ టెస్ట్ (ఐనెట్)- జనవరి 2021 ప్రకటనను భారత నావికాదళం విడుదల చేసింది.**

**పేరు:** ఐనెట్- జనవరి 2021

- **మొత్తం ఖాళీలు:** 144

**బ్రాంచీల వారీగా అర్హతలు-ఖాళీలు:**

**ఎగ్జిక్యూటివ్ బ్రాంచీ:**

- ఎస్ఎస్‌సీ నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ క్యాడర్ (ఎన్ఏఐసీ)-6
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో మెకానికల్/ఎలక్ట్రికల్‌ఈసీఈ, సీఎస్ లేదా కెమికల్/ఏరోస్పేస్ లేదా తత్సమాన బ్రాంచీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. ఇంటర్, పదోతరగతిలో కూడా 60 శాతం మార్కులు ఉండాలి.
- **వయస్సు:** 1996, జనవరి 2 నుంచి 2001, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.

పురుష/మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఎస్ఎస్‌టీ ఏటీసీ-4, ఎస్ఎస్‌సీ అబ్జర్వర్-6, ఎస్ఎస్‌సీ పైలట్ (ఎంఆర్)-3, ఎస్ఎస్‌సీ పైలట్ (ఎంఆర్ కాకుండా, కేవలం పురుషులు మాత్రమే)-6
- **అర్హతలు:** పై పోస్టులన్నింటికి బీఈ/బీటెక్ (ఏదైనా బ్రాంచీలో) కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **వయస్సు:** ఏటీసీ పోస్టుకు 1996, జనవరి 2 నుంచి 2000, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి. మిగిలిన పోస్టులకు 1997, జనవరి 2 నుంచి 2002, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.

**ఎస్ఎస్‌సీ లాజిస్టిక్స్-11 ఖాళీలు**

- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో బీఈ/బీటెక్ లేదా బీఎస్సీ/బీకాంతో పాటు పీజీడీ ఇన్ ఫైనాన్స్ లేదా ఎంబీఏ లేదా ఎంసీఏ/ఎమ్మెస్సీ ఐటీ
- **వయస్సు:** 1996, జనవరి 2 నుంచి 2001, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.

**ఎస్ఎస్‌సీ ఎక్స్ (ఐటీ)-10 పోస్టులు**

- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో సీఎస్/సీఎస్ఈ లేదా ఐటీ బ్రాంచీలో బీఈ/బీటెక్ లేదా ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్/ఎంసీఏ. పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- **వయస్సు:** 1996, జనవరి 2 నుంచి 2001, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.

**ఎస్ఎస్‌సీ జనవరి సర్వీస్ (హైడ్రో క్యాడర్)-30**

- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో ఏదైనా బ్రాంచీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 1996, జనవరి 2 నుంచి 2001, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.

**టెక్నికల్ బ్రాంచీ:**

- **ఎస్ఎస్‌సీ ఇంజినీరింగ్ బ్రాంచీ (జనరల్ సర్వీస్)-26 పోస్టులు**
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో మెకానికల్/ప్రొడక్షన్, ఏరోనాటికల్/మెకట్రానిక్స్ లేదా మెటలర్జీ/ఆటోమొబైల్స్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

**ఎస్ఎస్‌సీ ఎలక్ట్రికల్ బ్రాంచీ -27**

- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రికల్,ఎలక్ట్రానిక్స్/టెలీకమ్యూనికేషన్ ఈసీఈ, ఏఈసీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

### ఎడ్యుకేషన్ బ్రాంచీ:

- ఎస్ఎస్‌సీ ఎడ్యుకేషన్-15
- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో ఎమ్మెస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, మెటీరియాలజీ, ఓషనోగ్రఫీ, అట్మాస్పియరిక్ సైన్స్) లేదా బీఈ/బీటెక్ (సీఎస్, ఈసీఈ, మెకానికల్) లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **వయస్సు:** 1996, జనవరి 2 నుంచి 2000, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.

**నోట్:** ప్రస్తుతం పై కోర్సుల్లో ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఈ కోర్సుకు ఎంపికైన వారికి ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో జనవరి 2021 నుంచి శిక్షణ ప్రారంభిస్తారు. శిక్షణానంతరం నేవీలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారు.



- **వయస్సు:** 1996, జనవరి 2 నుంచి 2001, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- పూర్తి వివరాల కోసం ఎంప్లాయ్‌మెంట్‌న్యూస్ చూడవచ్చు
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

## ఉల్లి ధరల నియంత్రణకు రంగంలోకి కేంద్రం

### టర్కీ నుంచి 11 వేల టన్నుల దిగుమతులకు అనుమతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చుక్కలనంటుతున్న ధరలతో కంటనీరు తెప్పిస్తున్న ఉల్లి ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం రగంలోకి దిగింది. దేశంలో ఉల్లి సరఫరాలను పెంచేందుకు టర్కీ నుంచి 11వేల టన్నుల ఉల్లి దిగుమతులకు ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎంటీసీ ఆర్డర్ ఇచ్చింది. ఈ సంస్థ ఇప్పటికే ఈజిప్ట్ నుంచి 6,090 టన్నుల ఉల్లిని దిగుమతిచేసుకొంటుండగా.. తాజా ఆర్డర్‌తో పరిస్థితి మెరుగవుతుందని భావిస్తున్నారు. మరోవైపు ఉల్లి ధరలను సమీక్షించేందుకు హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో మంత్రుల బృందాన్ని ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో ఆర్థికమంత్రి, వినియోగదారుల వ్యవహారాలమంత్రి, వ్యవసాయ, రవాణా శాఖ మంత్రులు సభ్యులుగా ఉంటారు. దేశంలోని ప్రధాన నగరాల్లో కిలో ఉల్లి రూ.75 నుంచి రూ.120 వరకు ధర పలుకుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లి దిగుమతులకు ప్రాధాన్యం ఇస్తున్నది. ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించిన కేంద్ర క్యాబినెట్.. 1.2 లక్షల టన్నుల ఉల్లి దిగుమతులకు ఆమోదం తెలిపింది. దిగుమమతి చేసుకొనే ఉల్లిని రాష్ట్రాలకు కిలో రూ.50 నుంచి రూ.60లకు అందజేయనున్నారు.





## లక్నవరంలో పర్యాటకుల సందడి

**ములుగు** జిల్లా గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సు పర్యాటకులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు లక్నవరం అందాలను తిలకించారు. వేలాడే వంతెనలపై నడుస్తూ బోట్లలో షికారు చేస్తూ మంత్రముగ్ధులయ్యారు. వంతెనలపై సెల్ఫీలు దిగుతూ ఉల్లాసంగా గడిపారు.

– గోవిందరావుపేట



## అరిష్టమని ఆడపిల్లను చంపింది

- ఏడ్రోజుల పసికందును హతమార్చిన నాయనమ్మ
- భవనంపైనుంచి కిందపడేసి దారుణం
- బెంగళూరులో ఘటన.. నిందితురాలి అరెస్ట్




**బెంగళూరు:** ఆడపిల్ల పుడితే అరిష్టమని ఓ నాయనమ్మ.. ఏడ్రోజుల పసికందు ప్రాణంతీసింది. మనుమరాలిని భవనంపైనుంచి కిందకు పడేసి చంపింది. కొడుకుకు ఆడపిల్ల పుడితే కుటుంబానికి ఆర్థిక సమస్యలు వస్తాయని జ్యోతిష్యుడు చెప్పినందుకు దారుణానికి ఒడిగట్టింది. ఉత్తర బెంగళూరులోని సోలదేవనహల్లి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. గత ఏడాది డిసెంబర్‌లో పరమేశ్వరి కుమారుడు మార్షల్.. తల్లి ఇష్టానికి వ్యతిరేకంగా తమిళ్‌సెల్వి అనే యువతిని పెండ్లి చేసుకున్నాడు. మార్షల్ స్థానికంగానే పాలకేంద్రాన్ని నడిపిస్తూ.. తాత్కాలిక రియల్టర్‌గా పనిచేస్తున్నాడు. తన ఇష్టానికి విరుద్ధంగా కొడుకు పెండ్లి చేసుకున్నాడని అలిగిన పరమేశ్వరి.. ఇంటినుంచి వెళ్లిపోయి తమిళనాడులో నివసిస్తున్నది. గతనెల 22వ తేదీన తమిళ్‌సెల్వికి ఆడపిల్ల పుట్టింది. 'బిడ్డకు జన్మనివ్వడంతో తమిళ్‌సెల్వి బాగోగులు చూసుకునేందుకు పరమేశ్వరి తిరిగి కొడుకు ఇంటికొచ్చింది. ఆడపిల్ల పుడితే అరిష్టమని భావించి.. పసికందును చంపాలని నిర్ణయించుకున్నది' అని పోలీసులు తెలిపారు. 'శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తమిళ్‌సెల్వి బిడ్డకు పాలుపట్టి.. బాత్‌రూంకు వెళ్తూ పరమేశ్వరికి బిడ్డను అప్పగించింది. ఆమె తిరిగొచ్చేసరికి బిడ్డ అదృశ్యమైంది. దీనిపై పరమేశ్వరిని ప్రశ్నించగా, గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకొచ్చి పాపను ఎత్తుకెళ్లాడని సమాధానం చెప్పింది. ఆమె గట్టిగా ఏడుస్తూ నిలదీయడంతో చుట్టుపక్కలవారు అక్కడకు చేరుకుని బిడ్డను వెతకడం ప్రారంభించారు. ఇంటి వెనుక ఖాళీ స్థలంలో తలకు గాయాలైన శిశువు మృతదేహం కనిపించింది' అని చెప్పారు. 60 ఏండ్ల పరమేశ్వరి నేరం అంగీకరించడంతో ఆమెను శనివారం అరెస్ట్ చేసి 14 రోజుల కస్టడీకి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

## 99% ముస్లింలు రివ్యూకు మద్దతు


### అయోధ్య తీర్పులో చాలా విరుద్ధ అంశాలున్నాయి

### ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వ్యాఖ్యలు

**లక్నో, డిసెంబర్ 1:** అయోధ్య వివాదంపై అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుపై సమీక్ష కోరాలని దేశంలోని 99 శాతం మంది ముస్లింలు కోరుకుంటున్నారని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) ఆదివారం వ్యాఖ్యానించింది. అయోధ్య కేసులో కక్షిదారు కాని ఏఐఎంపీఎల్‌బీ.. డిసెంబర్ 9లోగా రివ్యూ పిటిషన్ వేయనున్నట్లు గతంలో వెల్లడించింది. అయోధ్యలోని వివాదాస్పద స్థలాన్ని రామ మందిర నిర్మాణం కోసం అప్పగిస్తూ గత నెల 9న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అలాగే మసీదు నిర్మాణానికి అయోధ్యలోనే 5 ఎకరాల స్థలాన్ని సున్నీ వక్ఫ్ బోర్డుకు కేటాయించాలని కూడా కోర్టు తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో ఏఐఎంపీఎల్‌బీ ప్రధాన కార్యదర్శి మౌలానా అలీ రెహమానీ ఆదివారం మాట్లాడుతూ.. 'న్యాయ వ్యవస్థపై ముస్లింలకు విశ్వాసముంది. అందుకే రివ్యూ పిటిషన్ వేస్తున్నాం. అయితే అయోధ్య తీర్పు తర్వాత ఆ విశ్వాసం సన్నగిల్లింది. దేశంలో 99 శాతం మంది ముస్లింలు రివ్యూ పిటిషన్ వేయాలని కోరుకుంటున్నారు. అయితే కోర్టు తమ పిటిషన్‌ను కొట్టివేస్తుందని వారు అనుమానిస్తున్నారు. అంతమాత్రాన మేం పిటిషన్ వేయబోమని కాదు. అది మా హక్కు. తీర్పులో చాలా విరుద్ధ అంశాలున్నాయి' అని పేర్కొన్నారు. కాగా, అయోధ్య కేసులో ప్రధాన కక్షిదారు అయిన సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు.. కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయకూడదని నిర్ణయించింది. అయితే మసీదు నిర్మాణానికి ఐదు ఎకరాలు తీసుకోవడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.



మౌలానా అలీ రెహమానీ



శ్రీశ్రీ రవిశంకర్

**రివ్యూ కోరడం ద్వంద్వ వైఖరి : శ్రీశ్రీ రవిశంకర్**

అయోధ్య తీర్పుపై ఏఐఎంపీఎల్‌బీ, జమైత్ ఉలేమా ఏ హింద్ సమీక్ష కోరాలని నిర్ణయించడం ద్వంద్వ వైఖరి అని ఆధ్యాత్మిక వేత్త శ్రీశ్రీ రవిశంకర్ అభిప్రాయపడ్డారు. హిందూ, ముస్లిం పక్షాలు కలిసి ముందుకు సాగాలని, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అయోధ్య వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు గతంలో నియమించిన మధ్యవర్తిత్వ కమిటీలో రవిశంకర్ కూడా ఒకరు. ఆదివారం ఆయన పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. వివాదాస్పద స్థలంలో మసీదు నిర్మాణానికి ఒక వర్గం పట్టుబట్టకపోయి ఉంటే, వివాదం ఎన్నడో ముగిసి ఉండేదని పేర్కొన్నారు. 'సుప్రీంకోర్టు తీర్పుతో నేను సంతోషంగా ఉన్నా. ఒకవైపు రామ మందిరం, మరోవైపు మసీదు నిర్మించడంపై హిందూ, ముస్లిం పక్షాలు ఒక నిర్ణయానికి రావాలని 2003 నుంచీ నేను చెప్తున్నా. అయితే వివాదాస్పద స్థలంలోనే మసీదు నిర్మించాలన్న ఒక వర్గం మొండివైఖరి అర్థంలేనిది' అని వ్యాఖ్యానించారు. అయోధ్య తీర్పుపై రివ్యూ పిటిషన్లు వేయాలని ఏఐఎంపీఎల్‌బీ, జమైత్ నిర్ణయించడంపై ఆయన స్పందిస్తూ.. తమకు వ్యతిరేకంగా తీర్పు వచ్చినా అంగీకరిస్తామని తొలుత వారు చెప్పారని, కానీ ఇప్పుడు మాత్రం వ్యతిరేఖ వైఖరి తీసుకున్నారని పేర్కొన్నారు. కాశీ, మథుర వివాదాలను అయోధ్యతో ముడిపెట్టరాదని సూచించారు. ఆర్థిక మందగమనం గురించి ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు అన్ని వైపుల నుంచి కృషి చేయాలని పేర్కొన్నారు.

### ఏఐఎంపీఎల్‌బీపై నఖ్వీ ధ్వజం..

సుప్రీంకోర్టు తీర్పుపై సమీక్ష కోరాలని ఏఐఎంపీఎల్‌బీ, జమైత్ ఉలేమా ఏ హింద్ సంస్థలు నిర్ణయించడంపై కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అయోధ్య వివాదానికి సుప్రీంకోర్టు తీర్పుతో తెరపడిన నేపథ్యంలో దేశంలో విభజన, ఘర్షణాత్మక వాతావరణం సృష్టించేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఆదివారం పీటీఐ వార్తాసంస్థకు నఖ్వీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ముస్లింలకు కేవలం 'బాబ్రీ' ఒక్కటే ప్రధానాంశం కాదని.. విద్య, ఆర్థిక, సామాజిక అభ్యున్నతిలో 'బరాబరీ' (సమానత్వం) ముఖ్యమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అన్ని పక్షాలు స్వాగతించాయని, అయితే కొందరు దీన్ని జీర్ణించుకోలేకపోవడం విచారకరమన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో వివాదం ముగిసిందని ప్రజలంతా భావిస్తున్నారని చెప్పారు. జమైతే ఉలేమా ఏ హింద్ ఈ నెల 3న లేదా 4న రివ్యూ పిటిషన్ వేయనున్నట్లు సమాచారం. తీర్పు ఏదైనా సమ్మతమేనని తీర్పు వెలువడక ముందు హిందూ, ముస్లిం పక్షాలు పేర్కొన్న విషయాన్ని నఖ్వీ గుర్తుచేశారు. ' మొదట వారు (ఏఐఎంపీఎల్‌బీ, జమైత్) కోర్టు తీర్పును అంగీకరించారు, గౌరవించారు. మరి ఇప్పుడు వ్యతిరేక వైఖరి తీసుకోవడానికి కారణమేంటి?' అని ఆయన ప్రశ్నించారు. 5 ఎకరాల స్థలాన్ని ముస్లిం పక్షాలు తీసుకుంటాయా అని ప్రశ్నించగా.. ఇది కోర్టు అంశమని, దీనిపై తాను వ్యాఖ్యానించబోనన్నారు. స్థలాన్ని తీసుకోవాలా వద్దా అన్నది కక్షిదారుల అభీష్టమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై పలు ముస్లిం వర్గాల్లో అసంతృప్తి వ్యక్తం కావడంపై ఆయన స్పందిస్తూ.. ఇది సివిల్ వివాదం అని, దీన్ని హిందూ, ముస్లిం వర్గాల మధ్య వివాదంగా చూడరాదని స్పష్టంచేశారు. ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపైనా ఆయన విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని అనుసరించి సుప్రీంకోర్టు నడుచుకుంటుందని, ఎవరి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కాదని పేర్కొన్నారు.



ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ



### అమెరికాలో కూలిన విమానం.. 9 మంది మృతి

మృతుల్లో ఇద్దరు చిన్నారులు

**వాషింగ్టన్, డిసెంబర్ 1:** అమెరికాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. గాలిలోకి ఎగిరిన కొద్ది సేపటికే విమానం కూలడంతో 9 మంది మరణించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు, పైలట్ కూడా ఉన్నారు. ఈ దుర్ఘటన శనివారం దక్షిణ డకోటా రాష్ట్రంలో జరిగింది. పైలట్‌తోసహా మొత్తం 12 మందితో ఛంబర్‌లైన్ విమానాశ్రయం నుంచి ఇడావో రాష్ట్రంలోని ఇడావో ప్రాంతీయ విమానాశ్రయానికి 'పిలాటస్ పీసీ–12' అనే విమానం బయలుదేరింది. అయితే గాలిలోకి ఎగిరిన కొద్ది సేపటికే అది కూలడంతో 9 మంది మరణించారు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నది. ఎందుకంటే దక్షిణ డకోటా ప్రాంతంలో తుఫాను హెచ్చరిక ఇప్పటికే అమల్లో ఉన్నది. ప్రమాద ఘటనపై దర్యాప్తు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### గడ్డకట్టిన నదిలో పడిపోయిన బస్సు.. 19 మంది మృతి

రష్యాలో దుర్ఘటన

**మాస్కో, డిసెంబర్ 1:** రష్యాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది మరణించారు. 22 మంది గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం తూర్పు సైబీరియా ప్రాంతంలో చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు క్యూంగా నదిపై ఉన్న వంతెనను దాటుతున్న సమయంలో దాని ముందు టైర్ పంక్చర్ కావడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు వంతెన మీద నుంచి నదిలో పడిపోయింది. అయితే శీతాకాలం కావడంతో నది గడ్డకట్టి ఉన్న నేపథ్యంలో మృతుల సంఖ్య పెరిగింది. ప్రమాదంలో బస్సు పూర్తిగా బోల్తాపడటంతో ధ్వంసమైంది.

## ఢిల్లీలో లైంగికదాడి, హత్య

### గులాబీబాగ్ ప్రాంతంలో శనివారం ఉదయం గుర్తించిన పోలీసులు



**న్యూఢిల్లీ:** హైదరాబాద్ సమీపంలో పశువైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్యను మరువక ముందే.. దేశ రాజధాని ఢిల్లీలో మరో లైంగికదాడి, దారుణహత్య జరిగింది. ఢిల్లీలోని గులాబీబాగ్ ప్రాంతంలోని ఇంట్లో 55 ఏండ్ల మహిళ ఒంటరిగా ఉంటున్నది. ఇది గమనించిన ఓ కామాంధుడు ఇంటి తలుపులు బద్దలుకొట్టి మరీ ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. నిందితుడి ముఖంపై బాధితురాలు ఉమ్మివేయడంతో కోపం తెచ్చుకొన్న దుర్మార్గుడు ఆ మహిళను గొంతునులిమి దారుణంగా హత్యగావించాడు. శనివారం ఉదయం గుర్తుతెలియని మహిళ అర్ధనగ్నంగా ఇంట్లో పడివుండటాన్ని గమనించిన పోలీసులు.. చనిపోయిందని తెలుసుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. గులాబీబాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కిషన్‌గంజ్‌లో నివసించే ధర్మరాజ్ (22) అనే యువకుడు ఈ దారుణానికి ఒడిగట్టాడని పోలీసులు గుర్తించారు. బాధితురాలు ఇంటి నుంచి వెళ్లిపోతున్న ధర్మరాజ్ సీసీటీవీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. తన ముఖంపై ఉమ్మివేయడంతో కోపం వచ్చిందని, దాంతో ఆమె గొంతునులిమి చంపివేసినట్టు నిందితుడు ఒప్పుకొన్నట్టు పోలీసులు తెలిపారు.

## నీరా.. జబ్బులకు మందు

- కల్లుగీత వృత్తిని గొప్పగా భావిస్తున్న సీఎం కేసీఆర్
- నీరా పాలసీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ఆదివారం ఇందిరాపార్క్‌లో గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నీరా పాలసీ ఆత్మీయ సమ్మేళనం మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అనేక జబ్బులకు నీరా మందులాగా పనిచేస్తుందని ఆబ్కారీశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. గౌడ కులస్థులు ఇటీవలికాలం వరకు తమ వృత్తిని చెప్పుకోలేని పరిస్థితిలో ఉండేవారని, ముఖ్యమంత్రి కేసీఆర్ కల్లుగీత వృత్తిని గొప్పగా భావించి గౌడ సామాజికవర్గానికి ఆబ్కారీశాఖను అప్పగించి అభివృద్ధి చేసుకోమని చెప్పారని తెలిపారు. ఆదివారం ఇందిరాపార్క్‌లో గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) ఆధ్వర్యంలో 'నీరా పాలసీ ఆత్మీయ సమ్మేళనం' జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వంశపారంపర్యంగా ఈ వృత్తిని గౌడ కులస్థులు కొనసాగిస్తున్నారని, గతంలో వృత్తిపైనా, కల్లుపైనా అనేక తప్పుడు ప్రచారాలు జరిగినందున తగిన గుర్తింపు రాలేదన్నారు. ఇతర సామాజికవర్గాల కుల వృత్తులకు అనుకూలంగా పథకాలు ఉన్నాయని, గౌడ సామాజికవర్గానికి కల్లుగీత, నీరా పాలసీని ఇవ్వాలని కోరగా సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. నిజాం పాలనలో చెట్టు పన్ను ఉండేదని అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఆ పన్నును రద్దు చేయించినట్టు గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో చిన్న కులాలు, చిన్న కుల వృత్తులకు తప్పకుండా మేలు జరుగుతుందని శ్రీనివాస్‌గౌడ్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సమ్మేళనంలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### పవన్ పర్యటనలో జేబు దొంగల చేతివాటం

**అమరావతి:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటనలో జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించారు. తిరుపతి విమానాశ్రయానికి వస్తున్న పవన్ కోసం అభిమానులు పెద్దఎత్తున తరలిరాగా, ఇదే అదనుగా జేబు దొంగలు.. 40 మంది ఫోన్లు, పర్సులను కొట్టేశారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

### గుంటూరులో డ్రగ్స్ ముఠా అరెస్ట్

**అమరావతి:** ఏపీలోని గుంటూరు జిల్లా నల్లపాడులోని ఓ అపార్టుమెంట్‌లో సాగుతున్న డ్రగ్స్ దందాను పోలీసులు బయటపెట్టారు. 12 మందిపై కేసులు నమోదుచేసి, ఐదుగురిని అరెస్టు చేశారు. ముఠాలో నలుగురు జిల్లా వాసులతోపాటు సుడాన్, టాంజానియా, ఈజిప్ట్, నైజీరియా, సౌదీకి చెందిన వారు ఉన్నారు. విద్యార్థులే లక్ష్యంగా ఆన్‌లైన్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న షాజీ అనే వ్యక్తిని అరెస్టుచేశారు.

## పాక్ పన్నాగాలు బహిర్గతం

- దుస్సాహసానికి పాల్పడితే ఖబడ్దార్
- దుశ్చర్యకు పాల్పడితే కోలుకోలేని విధంగా దెబ్బతీస్తాం
- పాక్‌తో ఆచితూచి స్పందించాలని సిద్ధూకు సూచన
- పాక్ మంత్రి షేక్ రషీద్ వ్యాఖ్యలపై పంజాబ్ సీఎం అమరిందర్ సింగ్ ప్రతిస్పందన



**చండీగఢ్, డిసెంబర్ 1:** కర్తార్‌పూర్ కారిడార్ విషయంలో పాకిస్థాన్ రైల్వే మంత్రి షేక్ రషీద్ చేసిన వ్యాఖ్యలపై పంజాబ్ సీఎం అమరిందర్ సింగ్ తీవ్రంగా మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలు పాక్ దుర్మార్గ పన్నాగాలను బహిర్గతం చేస్తున్నాయని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్తార్‌పూర్ కారిడార్ తమ సైన్యాధిపతి జనరల్ ఖ్వామర్ జావెద్ బజ్వా 'మానస పుత్రిక' అని, అది భారత్‌ను దెబ్బ తీస్తుందని షేక్ రషీద్ శనివారం అన్నారు. కర్తార్‌పూర్ కారిడార్‌ను ప్రారంభించడం పూర్తిగా భారత భద్రత, సమగ్రతకు భారీ ముప్పని పాక్ మంత్రి రషీద్ వ్యాఖ్యపై అమరిందర్ స్పందిస్తూ .. తమపై ఎటువంటి దుస్సాహసానికి పాల్పడినా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. 'కారిడార్‌ను ప్రారంభించడంపై మా కృతజ్ఞతా భావాన్ని బలహీనంగా భావించి మా సరిహద్దులపై గానీ, మా ప్రజలపై దాడికి పాల్పడేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తే దీటుగా సమాధానం చెబుతాం' అని స్పష్టం చేశారు. పాక్ ఆకాంక్షలను భారత్ ఎప్పటికీ అనుమతించబోదని, తమపై ఎటువంటి దుశ్చర్యలకు ప్రయత్నించినా పాకిస్థాన్ కోలుకోలేని విధంగా గుణపాఠం నేర్పుతామని అమరిందర్ సింగ్ తీవ్రస్వరంతో హెచ్చరించారు. కారిడార్ ప్రారంభించడం సంతోషదాయకమని, దీంతో తమ దేశానికి ఏర్పడే ముప్పును నిర్లక్ష్యం చేయబోమని స్పష్టం చేశారు. కారిడార్ ప్రారంభించినందుకు సిక్కుల నుంచి సానుభూతి పొందేందుకు ప్రయత్నించొద్దని, పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ మద్దతుతో ప్రత్యేక సిక్కు దేశం కోసం 'రిఫరెండం 2020 ఎజెండా' ముందుకు తేవాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని తేల్చి చెప్పారు. పాక్ మంత్రి ప్రకటన నేపథ్యంలో ఆ దేశ ప్రభుత్వంతో అనుసరించే వైఖరి విషయమై ఆచితూచి స్పందించాలని అమరిందర్‌సింగ్ తన మాజీ సహచర మంత్రి నవ్‌జ్యోతి సిద్ధూను కోరారు.

## దక్షిణ మధ్య రైల్వేలో పచ్చదనం

- జోన్ పరిధిలో 18 చోట్ల నర్సరీలు
- అందుబాటులో 50 వేల రకాల మొక్కలు






నిజామాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటుచేసిన నర్సరీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపునకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. జోన్ పరిధిలో 18 చోట్ల 15 వేల చదరపు మీటర్లలో నర్సరీలు ఏర్పాటుచేసి, మొక్కల రక్షణతోపాటు పంపిణీచేస్తున్నది. మహాత్మా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2, 2019న దక్షిణ మధ్య రైల్వే ప్రతి డివిజన్‌లోనూ మూడు రైల్వే స్థలాలను ఎంపికచేసి పట్టాలకు ఆనుకొని ఉన్న 18 చోట్ల నర్సరీలను అభివృద్ధిచేసింది. అందుబాటులో ఉన్న స్థల వైశాల్యాన్ని అనుసరించి 50 చరదపు మీటర్ల నుంచి 3,500 చదరపు మీటర్ల వరకు నర్సరీలను ఏర్పాటుచేసింది. నర్సరీలతోపాటు మొక్కల సంరక్షణకు, పచ్చదనం పెంపునకు దక్షిణ మధ్య రైల్వే తీసుకుంటున్న చర్యలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. సికింద్రాబాద్, హైదరాబాద్, గుంతకల్లు, విజయవాడ, గుంటూరు, నాందేడ్ డివిజన్లలో ఎంపికచేసిన ప్రదేశాల్లో నర్సరీలు ఏర్పాటుచేసి మొత్తం 50 వేల వరకు మొక్కలను అందుబాటులో ఉంచారు. వీటిని సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో, అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని రైల్వే అధికారులు పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నారు. నర్సరీలలో స్థానికుల అవసరాలకు అనుగుణంగా పలు రకాల మొక్కలను పెంచుతూ ప్రజలకు పంపిణీ చేస్తున్నారు.

### పచ్చదనం పెంపు ప్రతి ఒక్కరి బాధ్యత



కొత్త ఆలోచనలను అమలుచేసేందుకు దక్షిణ మధ్య రైల్వే ఎప్పుడూ ముందే ఉంటుంది. ఈ క్రమంలో పచ్చదనం పెంపునకు మా వంతు కృషి చేస్తున్నాం. రైల్వే స్థలాలు, రైలు పట్టాలకు ఆనుకొని ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి భారీ ఎత్తున చర్యలు చేపడుతున్నాం. నర్సరీల పరిరక్షణ కోసం ప్రణాళికబద్ధం, సరైన నిర్వహణ పద్ధతులను చేపడుతూ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– గజానన్ మాల్యా, దక్షిణ మధ్య రైల్వే జీఎం

## జేడీఎస్‌తో జత కట్టేందుకు సిద్ధం

- కర్ణాటక అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత తుది నిర్ణయం
- కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, పరమేశ్వర వెల్లడి
- బైపోల్స్ తర్వాతే రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం: కుమారస్వామి సంకేతాలు
- కాంగ్రెస్, జేడీఎస్ పొత్తు చర్చలు హాస్యాస్పదం.. ఆ పరిస్థితే తలెత్తదు: సీఎం యడియూరప్ప



యడియూరప్ప



మల్లికార్జున ఖర్గే

**బెంగళూరు, డిసెంబర్ 1:** మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహం తొణికిసలాడుతున్నది. ఈ నెల ఐదో తేదీన రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రభుత్వ మెజారిటీకి అవసరమైన స్థానాల్లో విజయం సాధించకపోతే జేడీఎస్‌తో మరోసారి చేతులు కలిపేందుకు వెనుకాడబోమని పేర్కొంది. జేడీఎస్ కూడా అందుకు సానుకూల సంకేతాలనిచ్చింది. కర్ణాటకలో కాంగ్రెస్, జేడీఎస్ 14 నెలలు సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపడంతోపాటు ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లోనూ కలిసి పోటీచేశాయి. కానీ జూలైలో 17 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో కుమారస్వామి సారథ్యంలోని జేడీఎస్–కాంగ్రెస్ సంకీర్ణ సర్కార్ పతనమై.. బీఎస్ యెడియూరప్ప సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే. సదరు 17 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటంతో ఈ నెల ఐదో తేదీన జరిగే ఉప ఎన్నికల్లో కనీసం బీజేపీ ఆరు స్థానాల్లో గెలుపొందితేనే ప్రభుత్వ మనుగడకు అవసరమైన మెజారిటీ లభిస్తుంది. ఇంకా రెండు స్థానాలు ఖాళీగా ఉంటాయి. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్ వేర్వేరుగా పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే ఆదివారం మీడియాతో మాట్లాడుతూ 'లౌకిక విలువలతోపాటు సామాజిక న్యాయం అందించేందుకు రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు మా యూపీఏ భాగస్వామ్య పక్షాలతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చూడండి. 15 స్థానాల్లో గెలుపుపైనే దృష్టి పెట్టాం. ఈ నెల తొమ్మిదో తేదీన స్పష్టత వస్తుంది. వాస్తవంగా మహారాష్ట్రలో శివసేనతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మా అధ్యక్షురాలు (సోనియాగాంధీ) వ్యతిరేకంగా ఉన్నారు. కానీ ప్రజలు, పార్టీల ప్రగతి శీల ఆలోచనలతో బీజేపీని అధికారం నుంచి దూరంగా పెట్టడానికి ముందుకు వచ్చారు. లెఫ్ట్ పార్టీలతోపాటు ఇతర పార్టీల ఎమ్మెల్యేల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు బీజేపీని అధికారానికి దూరంగా పెట్టాలని నిర్ణయించాం. కాంగ్రెస్–ఎన్సీపీ–శివసేన సంకీర్ణ సర్కార్ ఏర్పాటు కానుంది' అని తెలిపారు. కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం కే పరమేశ్వర మాట్లాడుతూ అటువంటి పరిస్థితి వస్తే అధిష్ఠానంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తామన్నారు. ప్రజలపై మధ్యంతర ఎన్నికలను రుద్దబోమన్నారు. జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ మాట్లాడుతూ ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ నిర్ణయంపై ఆధారపడి మరోసారి రెండు పార్టీలు కలిసి పని చేస్తాయన్నారు. దేవెగౌడ తనయుడు, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి మాట్లాడుతూ ఉప ఎన్నికల తర్వాతే రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అది బీజేపీది మాత్రమే కానవసరం లేదన్నారు. ఉప ఎన్నికల ఫలితాల వరకు వేచి ఉండాలని కోరారు. ఎవరు 'కింగ్ మేకర్' అన్నది ప్రజలు నిర్ణయిస్తారు. నేను కాదు' అని తెలిపారు. ఉప ఎన్నికల తర్వాత తమ రెండు పార్టీల మధ పొత్తు గురించి కాంగ్రెస్, జేడీఎస్ మాట్లాడటం హాస్యాస్పదం అని కర్ణాటక సీఎం బీఎస్ యడియూరప్ప మీడియాతో చెప్పారు. అటువంటి చర్చలకు విలువే లేదన్నారు. 15 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం సాధిస్తామన్నారు. ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రజలంతా తమ (బీజేపీ) వెంటే ఉన్నారని కాంగ్రెస్, జేడీఎస్ గుర్తిస్తారని చెప్పారు.

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
సోమవారం 2 డిసెంబర్ 2019


అనూప్‌రూబెన్స్, నేహా, కార్తికేయ, అజయ్‌భూపతి, శేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు

# చిరంజీవి నాకు స్ఫూర్తి

'మద్యం తాగకపోతే జీవించలేని ఓ యువకుడికి, మందు వాసన పడని ఓ యువతికి మధ్య జరిగే ప్రేమకథ ఇది. కథాంశంలోని వైవిధ్యత నచ్చి ఈ సినిమా చేశాను' అని అన్నారు కార్తికేయ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం '90ఎం.ఎల్'. శేఖర్‌రెడ్డి ఎర్ర దర్శకత్వం వహించారు. కార్తికేయ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై అశోక్‌రెడ్డి గుమ్మకొండ నిర్మించారు. నేహాసోలంకి కథానాయిక. ఈ నెల 5న విడుదలకానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు అజయ్‌భూపతి బిగ్‌సీడీని విడుదలచేశారు. కార్తికేయ మాట్లాడుతూ 'చిరంజీవి స్ఫూర్తితో హీరోగా మారాను. ఆయనతో పాటు మహేష్‌బాబు నా దృష్టిలో నిజమైన హీరోలు. ప్రేక్షకుల్ని అలరించడానికి ఎలాంటి పాత్రనైనా చేయడానికి సిద్ధమే. నటుడిగా పరిణితి కనబరచడానికి ఇప్పటివరకు నేను పనిచేసిన దర్శకులే కారణం. 'ఆర్ ఎక్స్100' సమయంలో శేఖర్‌రెడ్డి ఈ కథ వినిపించారు. మంచి సినిమా అవుతుందనే నమ్మకంతోనే సొంత సంస్థలో నిర్మించాం. ఈ సినిమా మా సంస్థకు మూడింతల లాభాల్ని తెచ్చిపెడుతుందనే నమ్మకముంది. మద్యపానాన్ని ప్రోత్సహించే సినిమా కాదిది. ఆద్యంతం నవ్విస్తూ ఆరోగ్యకరమైన కిక్‌నిస్తుంది' అని అన్నారు. 'ఈ సినిమా ప్రయాణంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా హీరో కార్తికేయ నాకు అండగా నిలిచారు. నటుడిగా అతడిని కొత్త పంథాలో ఆవిష్కరించే సినిమా ఇది' అని దర్శకుడు చెప్పారు. మంచి సినిమాలో భాగమవ్వడం ఆనందంగా ఉందని కథానాయిక నేహాసోలంకి చెప్పింది. కార్తికేయతో మరో సినిమా చేస్తానని అజయ్‌భూపతి అన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్‌కిషన్, అనూప్‌రూబెన్స్, రాహుల్ సిప్లిగంజ్ తదితరులు పాల్గొన్నారు.

'నిజాయితీగా మేము చేసిన ప్రయత్నానికి సానుకూల స్పందన లభిస్తున్నది. సినిమా చూసిన వారంతా బాగుందని అంటున్నారు' అని అన్నారు టి. సంతోష్. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'అర్జున్ సురవరం'. నిఖిల్, లావణ్యత్రిపాఠి జంటగా నటించారు. ఇటీవల ఈ చిత్రం విడుదలైంది. ఆదివారం హైదరాబాద్‌లో దర్శకుడు సంతోష్ పాత్రికేయులతో ముచ్చటించారు.

# మురుగదాస్ సలహా ఇచ్చారు!


సంతోష్

'కణితన్' సినిమా చూసిన హీరో నిఖిల్ రీమేక్ ఆలోచనతో తమిళ నిర్మాతను కలిశారు. ఈ సినిమా చేసే వరకు నిఖిల్ గురించి నాకు తెలియదు. లవర్‌బాయ్ ఇమేజ్ ఉన్న అతడు పరిణితితో కూడిన ఈ పాత్రకు న్యాయం చేయగలడా లేదా అని తొలుత సందేహించాను. ఈ పాత్ర కోసం పదిహేనుకిలోల బరువు పెరిగాడు నిఖిల్. అర్జున్ పాత్రలో ఒదిగిపోయారు. ఒకసారి చేసిన కథతో మళ్లీ సినిమా చేయడానికి ఏ దర్శకుడు ఇష్టపడడు. తొలుత నేను అలాగే ఆలోచించాను. కన్నడ రీమేక్‌ను తెరకెక్కించే అవకాశం వస్తే తిరిస్కరించాను. తెలుగు సినిమాల మార్కెట్ పరిధి విస్తృతంగా ఉంటుంది. టాలీవుడ్ సినిమా చేయడమంటే చాలా మంది తమిళ దర్శకులు ప్రమోషన్‌గా భావిస్తుంటారు. ఆ ఆలోచనతో పాటు తెలుగు ఇండస్ట్రీపై ఉన్న అభిమానంతో రీమేక్‌కు దర్శకత్వం వహించాను. భవిష్యత్తులో తెలుగులో సినిమాలు చేస్తాను. తమిళ మాతృకతో పోలిస్తే తెలుగులో అదనంగా భావోద్వేగాల్ని జోడించాం. అవన్నీ సత్ఫలితాన్నిస్తున్నాయి.

**మురుగదాస్ దగ్గర శిష్యరికం..**

దర్శకుడు మురుగదాస్ దగ్గర 'సెవంత్ సెన్స్', 'తుపాకి' చిత్రాలకు దర్శకత్వశాఖలో పనిచేశాను. 'కణితన్' సినిమా తనకు బాగా నచ్చిందని ఆయన చాలా సందర్భాల్లో చెప్పారు. తెలుగులో ఈ సినిమాను పునర్నిర్మించే అవకాశం వస్తే వదులుకోకని మురుగదాస్ సలహా ఇచ్చారు. పాత్రికేయుల్లోని ఐకమత్యాన్ని చాటిచెప్పే సినిమా ఇది. ఆ పాయింట్‌నే పతాక ఘట్టాల్లో చెప్పాను. ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన ఉంది. సినిమా విడుదల ఆలస్యమవడం బాధించింది. ప్రతి రంగంలో కష్టసుఖాలుంటాయి. సినీరంగం అందుకు అతీతం కాదు. కథపై ఉన్న నమ్మకంతో ఎనిమిదినెలలు ఎదురుచూశాం. ఆ నిరీక్షణకు విజయం రూపంలో ఫలితం దక్కింది. షూటింగ్ సందర్భంగా నిఖిల్‌తో విభేదాలు వచ్చాయన్న మాట అవాస్తవం. అతడు నా పనిలో జోక్యం చేసుకోలేదు. కథ బాగా రావడానికి మేమిద్దరం చాలా చర్చలు జరిగాయి. అయితే మా వాదనలన్నీ నాలుగు గోడలవరకే పరిమితం.రూమ్‌దాటి బయట అడుగుపెడితే స్నేహితులమయ్యేవాళ్లం. దర్శకుడిగా రియలిస్టిక్ ఇతివృత్తాలతో కూడిన సినిమాలు చేయాలనుంది. తదుపరి సినిమా సంబంధించి కథా చర్చలు జరుగుతున్నాయి.


'అల వైకుంఠపురములో' పూజాహెగ్డే, అల్లు అర్జున్

# మంచి సినిమాలు ఫెయిల్‌కాలేదు


సతీష్, అశోక్, సురేందర్‌రెడ్డి, సుకుమార్, అజయ్, సాయి, భావనరావు

'మంచి సినిమాలు ఓవర్సీస్‌లో ఎప్పుడూ పరాజయం పాలవ్వలేదు. 'వన్ నేనొక్కడినే' అమెరికాలో విజయవంతమైంది కాబట్టే నేను ఇండస్ట్రీలో నిలదొక్కుకోగలిగాను' అని అన్నారు ప్రముఖ దర్శకుడు సుకుమార్. శ్రీనివాససాయి, భావనరావు జంటగా నటిస్తున్న చిత్రం 'మథనం'. అజయ్ సాయి మణికందన్ దర్శకుడు. దివ్యప్రసాద్, అశోక్‌ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 6న అమెరికాలో ఈ చిత్రం విడుదలకానున్నది. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను సుకుమార్ విడుదలచేశారు. ఆయన మాట్లాడుతూ 'దర్శకనిర్మాతల్లో కనిపిస్తున్న సంతోషమే సినిమా పట్ల వారికున్న నమ్మకాన్ని సూచిస్తుంది. దర్శకుడు సురేందర్‌రెడ్డి సలహాలు సినిమాకు ఉపకరిస్తాయనే నమ్మకముంది' అని తెలిపారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా దర్శకనిర్మాతలు చేసిన చక్కటి ప్రయత్నమిదని, సినీ పరిశ్రమ పట్ల ఉన్న ఇష్టం, తపనతో నిర్మాతలు అశోక్, దివ్య ఈ చిత్రాన్ని నిర్మించారని దర్శకుడు సురేందర్‌రెడ్డి అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కొత్త కాన్సెప్ట్‌తో రూపొందించాం. దర్శకుడు ఆరేళ్ల పాటు శ్రమించి ఈ కథను సిద్ధంచేసుకున్నారు. నాయకానాయికల కెరీర్‌కు టర్నింగ్‌పాయింట్‌గా నిలుస్తుంది. తొలుత అమెరికాలో సినిమాను విడుదలచేసి అక్కడ వచ్చిన స్పందనను అనుసరించి తెలుగు రాష్ర్టాల్లో విడుదలచేస్తాం' అని చెప్పారు. యథార్థ సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ కథ రాసుకున్నానని, మంచి టీమ్‌తో నిజాయితీగా ఈ సినిమా చేశామని దర్శకుడు అన్నారు.


ఉదయ్‌శంకర్, పవన్‌కల్యాణ్, భరత్‌రామ్, శ్రీరామ్‌రాజు

# ఈ మనసే గీతావిష్కరణ

''మిస్‌మ్యాచ్' సినిమా పెద్ద విజయం సాధించాలి. హీరోగా ఉదయ్‌శంకర్‌కు శుభారంభాన్ని అందించాలి' అని అన్నారు పవన్‌కల్యాణ్. ఉదయ్‌శంకర్, ఐశ్వర్యారాజేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్‌మ్యాచ్'. జి.శ్రీరామ్‌రాజు, భరత్‌రామ్ నిర్మాతలు. ఎన్.వి.నిర్మల్‌కుమార్ దర్శకుడు. ఈ నెల 6న విడుదలకానుంది. 'తొలిప్రేమ'లోని 'ఈ మనసే' పాటను సినిమాలో రీమిక్స్ చేశారు. ఈ గీతాన్ని ఆదివారం పవన్‌కల్యాణ్ విడుదలచేశారు. ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ 'కుటుంబ విలువలు, ప్రేమ, ఉద్వేగాల సమాహారంగా తెరకెక్కుతున్న క్రీడానేపథ్య చిత్రమిది. పవన్ కల్యాణ్ సినిమా పాటను నాపై చిత్రీకరించడం ఆనందంగా ఉంది. సింగిల్‌షాట్‌లో ఈ గీతాన్ని చిత్రీకరించాం. హీరోగా నాకు మంచి గుర్తింపును తెచ్చిపెడుతుందనే నమ్మకముంది' అన్నారు.

## సాయిరామ్‌శంకర్ 'రీసౌండ్'


రాశిసింగ్, సాయిరామ్‌శంకర్

సాయిరామ్‌శంకర్, రాశిసింగ్ జంటగా నటిస్తున్న 'రీసౌండ్' చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఎస్.ఎస్.మురళీకృష్ణ దర్శకుడు. జె.సురేష్‌రెడ్డి, రాజు, ఎన్.వి.ఎన్ రాజారెడ్డి నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం నాయకానాయికలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సుకుమార్ క్లాప్‌నివ్వగా, సురేందర్‌రెడ్డి కెమెరా స్విచాన్ చేశారు. పోసాని కృష్ణ మురళి గౌరవ దర్శకత్వం వహించారు. ఆకాష్ పూరి పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిరామ్‌శంకర్ మాట్లాడుతూ 'విభిన్నమైన కథ, కథనాలతో రూపొందుతున్న చిత్రమిది. సోమవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. హైదరాబాద్, వైజాగ్‌లలో చిత్రీకరణ జరుపుతాం' అని తెలిపారు. వాణిజ్య హంగుల కలబోతగా రూపొందుతున్న కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమా ఇదని, సమాజంలోని కొన్ని సంఘటనలపై ఓ యువకుడు తన గళాన్ని ఎలా వినిపించాడన్నది ఆకట్టుకుంటుందని దర్శకుడు అన్నారు. అరవింద్‌కృష్ణ ముఖ్య పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: స్వీకర్ అగస్థి, కెమెరా: సాయిప్రకాష్.

## చీమ ప్రేమాయణం


బాపిరాజు, లక్ష్మీనారాయణ, రవివర్మ, అప్పలరాజు, గీతామాధురి

అమిత్, ఇందు జంటగా నటిస్తున్న చిత్రం 'చీమ-ప్రేమ మధ్యలో భామ'. అప్పలరాజు దర్శకుడు. ఎస్.ఎన్.లక్ష్మీ నారాయణ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ఈ చిత్ర గీతాల్ని ఇటీవల విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'అల్పప్రాణి చీమ మనిషిగా మారాలని ఆరాటపడుతుంది. అది సాధ్యమా? అలా అయితే దాని జీవితం ఎలా ఉంటుంది? అనే అంశాన్ని ఈ సినిమాలో చూపిస్తున్నాం' అన్నారు. 'గ్రాఫిక్స్ ప్రధానాకర్షణగా నిలుస్తాయి. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందించిన ఈచిత్రం ప్రేక్షకల్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది. కథానుగుణంగా చక్కటి సంగీతం కుదిరింది' అని నిర్మాత తెలిపారు.

## మహాప్రస్థానం కథ


తనీష్

తనీష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మహాప్రస్థానం'. 'జర్నీ ఆఫ్ ఎన్ ఎమోషనల్ కిల్లర్' ఉపశీర్షిక. జానీ దర్శకుడు. ఓంకారేశ్వర క్రియేషన్స్ సంస్థ నిర్మించనున్నది. ఈ నెల ప్రథమార్థంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఎమోషనల్, క్రైమ్, యాక్షన్ అంశాలతో తెరకెక్కనున్న ప్రేమకథా చిత్రమిది. కథానాయకుడి తాలూకు ప్రేమ, కోపం, బాధతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారు. హైదరాబాద్‌లో ఏకధాటిగా చిత్రీకరణ జరుపుతాం. తనీష్ పాత్ర నవ్యరీతిలో ఉంటుంది. హీరోగా అతడికి మంచి పేరుతెచ్చిపెడుతుంది' అని అన్నారు. కబీర్‌దుహాన్‌సింగ్, అమిత్, గగన్‌విహారి, కంచెరపాలెం రాజు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:సునీల్‌కశ్యప్, సినిమాటోగ్రఫీ: ఎం.ఎన్.బాల.


'సింద్రెల్లా' చిత్రంలో రాయ్‌లక్ష్మి


సూర్య, సత్యదేవ్

## సందేశంతో 'కలియుగ'

రాజ్, స్వాతిదీక్షిత్ జంటగా నటించిన చిత్రం 'కలియుగ'. తిరుపతి దర్శకుడు. నటుడు సూర్య నిర్మాత. శశి ఓ ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఈ నెల 6న విడుదలకానుంది. ఈ చిత్ర ఆడియోను ఇటీవల పవన్‌కల్యాణ్ ఆవిష్కరించారు. అనంతరం చిత్ర ప్రీరిలీజ్ వేడుకు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'సమాజంలో జరుగుతున్న యథార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందించాం. సినిమాలోని సంఘటనలతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారు. ప్రేమ, యాక్షన్ అంశాలకు ప్రాధాన్యత ఉంటుంది. చక్కటి సందేశంతో ప్రేక్షకుల్ని ఆలోచింపచేస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు సునీల్‌కశ్యప్, సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## సహజత్వం మెప్పిస్తున్నది


రవికిరణ్

'రాజావారు రాణిగారు' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు రవికిరణ్‌కోలా. కిరణ్, రహస్యగోరఖ్ జంటగా నటించిన చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మా స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా భద్రవరం. నేను ఎవరి దగ్గరా దర్శకత్వ శాఖలో పనిచేయలేదు. ఇంటర్నెట్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తూ, లఘు చిత్రాలను వీక్షిస్తూ ఫిల్మ్ మేకింగ్ గురించి నేర్చుకున్నా. ఊరి నుంచి హైదరాబాద్ వచ్చిన తర్వాతే సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. చిన్న కాన్సెప్ట్‌ను అర్థవంతంగా తెరపై ఆవిష్కరించడమే నిజమైన సినిమా అనే విషయం వరల్డ్ మూవీస్‌ను పరిశీలించిన తర్వాత తెలిసింది. ఈ సినిమాను రూపొందించే క్రమంలో కొన్ని కష్టాలను ఎదుర్కోవాల్సివచ్చింది. తొలి చిత్ర దర్శకుణ్ణి కాబట్టి అందరిని కన్విన్స్ చేయడం కష్టమనిపించేది. కొత్తనటీనటుల వల్ల సినిమాలో ఫ్రెష్‌నెస్ కనబడిందని అందరూ ప్రశంసిస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాగుందంటున్నారు. చౌదరి, నాయుడు అనే పాత్రలు నవ్వులు పంచాయని మెచ్చుకుంటున్నారు. సన్నివేశాల్లో సహజత్వం ఉండాలనే ఆలోచనతో కాస్ట్యూమ్స్ కూడా రాజమండ్రి వీధుల్లో ఖరీదు చేశాం. తక్కువ మేకప్‌తో పాత్రలు నేచురల్‌గా కనిపించేలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఇండస్ట్రీలోని చాలా మంది సినిమా బాగుందని ప్రశంసిస్తున్నారు' అన్నారు.

# ద్విపాత్రాభినయంలో..

రాయ్‌లక్ష్మి ద్విపాత్రాభినయంలో నటించిన తమిళ చిత్రం 'సింద్రెల్లా' అదే పేరుతో తెలుగులో అనువాదమవుతున్నది. విను వెంకటేష్ దర్శకుడు. ఎస్.ఎస్.ఐ.ప్రొడక్షన్ పతాకంపై మంచాల రవికిరణ్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హారర్ ఫాంటసీ, మర్డర్‌మిస్టరీ కథాంశమిది. సింద్రెల్లా అనే అమ్మాయి జీవితంలో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలేమిటన్నది ఆసక్తిని పంచుతుంది. టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. రాయ్‌లక్ష్మి పాత్ర చిత్రణ భిన్న కోణాల్లో సాగుతుంది. లక్ష్మిరాయ్ గిటారిస్ట్, దెయ్యం పాత్రల్లో వైవిధ్యాన్ని కనబరచింది. హారర్ సినిమాలో విభిన్న కథాంశంతో ప్రేక్షకులకు కొత్త అనుభూతినందించే చిత్రమవుతుంది. హారర్ సినిమాల జోనర్‌లో ఇదొక వినూత్న చిత్రంగా ఆకట్టుకుంటుంది. తెలుగు, తమిళ ప్రేక్షకుల్ని అలరించే హంగులన్నీ ఉంటాయి. రాయ్‌లక్ష్మి కెరీర్‌లోనే విభిన్న చిత్రంగా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది. త్వరలో సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. రోబోశంకర్, అభినయ, అరవింద్‌ఆకాష్, సాక్షిఅగర్వాల్, వినోద్, అన్బు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రమ్మీ, సంగీతం: అశ్వామిత్ర, రచన-దర్శకత్వం: విను వెంకటేష్.